నకిలీ ఉద్యోగుల దందా!

- పనిచేయకుండానే బల్దియాలో 1500ల మందికి జీతాలు



ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీలో పలువురు పని చేయకుండానే జీతాలు పొందుతున్నారు. కొన్నేళ్లుగా ఈ తంతు నడుస్తోంది. ఇంట్లో ఉండి వేరే పనులు చేసుకుంటూ బల్దియాలో జీతం తీసుకుంటున్న ఉద్యోగుల్లో రవాణా విభాగం ప్రధానమైనది. ఇంత జరుగుతున్నా సంబంధిత రవాణా విభాగం ఇంజినీర్లు, పారిశుద్ధ్య విభాగంలోని వైద్యాధికారులు, ఇంజినీర్లు, ఎంటమాలజీ విభాగంలోని సీనియర్ ఎంటమాలజిస్టులు స్పందించడం లేదు.

అక్రమం ఇలా..: మొత్తం 1500 మంది పనిచేయకుండానే జీతాలు పొందుతున్నారు. వారిలో రవాణా విభాగం నుంచే 800 మంది ఉన్నారు. పారిశుద్ధ్యం, ఎంటమాలజీ విభాగాల్లో మరో 700 మంది అక్రమంగా జీతాలు తీసుకుంటున్నారు.

డీజిల్ కూపన్ల దందా.. కవాడిగూడ పార్కింగ్ యార్డులో 150 వరకు లైట్ మోటారు, హెవీ వాహనాలున్నాయి. మరమ్మతుల పేరుతో రూ.5 కోట్లను కొందరు ఉద్యోగులు దారి మళ్లిస్తున్నారు. వాహనాల టైర్లు, డీజిల్ కూపన్లను అమ్ముకుంటున్నారు.

పనిచేసే వారిపైనే భారం..

జీహెచ్ఎంసీ రవాణా విభాగంలో పొరుగు సేవల కింద పనిచేసే డ్రైవర్లు, ఇతర లేబర్లు కలిపి 2 వేల మంది ఉన్నారు. అందులో చాలా మంది రికార్డుల్లోనే ఉంటున్నారు. కొందరు పాలకమండలి నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ ఇళ్లలో పనిచేసే వారిని ఉద్యోగిగా చేర్పిస్తున్నారు. నేతలు పదవి దిగిపోయాక కూడా కొందరు అలాగే కొనసాగుతున్నారు. పని చేయకుండా జీతం దక్కుతుండడంతో బల్దియాను ఏటీఎం కార్డులా వాడుకుంటున్నారు. నకిలీ సిబ్బంది గైర్హాజరుతో రోజూ విధులు నిర్వర్తించే ఉద్యోగులపై తీవ్రమైన భారం పడుతోంది.



గూడు వీడలేక.. గోడు వినే వారు లేక

మూసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు చేపట్టిన సర్వేపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపేట, చైతన్యపురి డివిజన్లలో బాధితులు నిరసన తెలిపారు. ఇళ్లు ఖాళీ చేసి ఎక్కడికెళ్లాలంటూ పలువురు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. ఎంపీ ఈటల రాజేందర్ నిర్వాసితులకు మద్దతు తెలిపారు. ఆయన వెంట భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా నేతలు ప్రేమేందర్‌రెడ్డి, సామ రంగారెడ్డి ఉన్నారు.

జీవనదిలా.. మూసీ

- రూ.5,500 కోట్ల ప్రాజెక్టుకు వారంలో టెండర్లు
- మల్లన్నసాగర్ నుంచి నగరానికి 15 టీఎంసీల తాగునీరు



ఈనాడు–సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మూసీలోకి సంవత్సరం పొడవునా మంచినీటిని వదిలేందుకు వీలైన ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వారంలోనే టెండర్లను పిలవనుంది. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు 15 టీఎంసీల తాగునీటిని తీసుకువచ్చే ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేయడానికి కసరత్తు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో రూ.5,500 కోట్ల ప్రాజెక్టుపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ శుక్రవారం సమీక్షించి తక్షణం టెండర్లు పిలువాలని నిర్ణయించారు. దీంతో అధికారులు ఉరుకులు పరుగులపై ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పైపులైన్ ద్వారా జంటజలాశయాలకు.. ప్రభుత్వం రాజధాని పరిధిలో 55 కి.మీ.ల పొడువున ఉన్న మూసీ నది సుందరీకరణ తలపెట్టింది. ఇది పూర్తయ్యేనాటికి మూసీలో నిరంతరాయంగా మంచినీటి ప్రవాహం ఉంటేనే ఫలితం ఉంటుందని అధికారులు భావించారు. ఇందుకు జంట జలాశయాల నుంచి ఏడాదిలో రెండున్నర టీఎంసీల నీటిని విడతల వారీగా విడుదల చేస్తూనే ఉండాలి. గోదావరి నుంచి నీటిని తీసుకొస్తేనే ఇది సాధ్యం. ఈ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును తక్షణం చేపట్టాలని నిర్ణయించింది. మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీల నీటిని తీసుకువచ్చే పైపులైను ప్రాజెక్టును అధికారులు రూపకల్పన చేశారు. 12.5 టీఎంసీల నీటిని ఘనపూర్ రిజర్వాయర్‌కు తెచ్చి అక్కడ శుద్ధి చేసి నగర అవసరాలకు వినియోగిస్తారు. మిగిలిన రెండున్నర టీఎంసీలను పైపులైను ద్వారా జంటజలాశయాలకు తీసుకురావాలని నిర్ణయించారు. జలాశయాలకు నీరు చేరిన తరువాత అవసరమైనప్పుడు సుందరీకరణ చేసిన మూసీలోకి వదిలేందుకు ప్రణాళిక రూపొందించారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత: గవర్నర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఇందిర నగర్ కాలనీలో నిర్వహించిన 'స్వచ్ఛతా కి భాగీదారి' (స్వచ్ఛతలో అందరి భాగస్వామ్యం) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత బస్తీలో పర్యటించి అక్కడి పరిస్థితులు, పారిశుద్ధ్య నిర్వహణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు.



బస్తీలో పర్యటిస్తున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

పిల్లల భవిష్యత్తు కోసమే చోరీలు

- వారికి తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా..
- పోలీసుల విచారణలో ఘరానా దొంగ వెల్లడి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: 2004 నుంచి దొంగతనాలు మొదలుపెట్టిన ఓ దొంగ ఇప్పటికే సుమారు 200కు పైగా చోరీలు చేశాడు. వివిధ ఠాణాల్లో మొత్తం 60 కేసులు అతనిపై నమోదయ్యాయి. ఇటీవల రాజేంద్రనగర్ పోలీసులకు చిక్కడంతో రిమాండ్‌కు తరలించారు. అతన్ని నగరంలోని మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన సుధాకర్‌గా గుర్తించారు. అతన్ని కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణలో నిందితుడు ఆసక్తికర విషయాలను వెల్లడించినట్లు తెలిసింది. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలుసుకున్న పోలీసులు.. పిల్లల కోసమైనా చోరీలు మానుకోవాలని సూచించగా.. తాను దొంగతనాలు చేస్తున్నదే వారి కోసమంటూ సమాధానం ఇవ్వడంతో ఆశ్చర్యపోయారు. తండ్రి దొంగ అని పిల్లలకు తెలిస్తే వారు అవమానంతో కుంగిపోతారని పోలీసులు చెప్పగా.. ఆ విషయం తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నానని చెప్పినట్లు తెలిసింది. తాను బెంగళూరులో డ్రైవింగ్ చేస్తున్నానని పిల్లలకు చెప్పినట్లు తెలిపాడు. అతన్ని పట్టుకున్న విషయం అన్ని పత్రికల్లో వచ్చినట్లు పోలీసులు గుర్తుచేయగా.. తన పిల్లలు ప్రభుత్వ వసతిగృహంలో చదువుకుంటున్నారని, విషయం వారికి తెలియదని సుధాకర్ చెప్పినట్లు తెలిసింది. మొదట్లో ఐదారు చోరీలు చేసిన తర్వాత మానేద్దామనుకున్నానని, తరువాత తాను దొంగతనం చేయకపోయినా వేరే ప్రాంతాల్లో పోలీసులు తనను అరెస్టు చేసినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం.



దాండియా ఆట.. బతుకమ్మ పాట



మరో మూడు రోజుల్లో దసరా నవరాత్రులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమాజిగూడలోని విల్లామేరీ కళాశాల విద్యార్థినులు శుక్రవారం రంగీలా రాస్ పేరుతో బతుకమ్మ ఉత్సవం, దాండియా వేడుక నిర్వహించి ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, సోమాజిగూడ

మూసీ నిర్వాసితుల పునరావాసంపై సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: మూసీ ప్రక్షాళనలో నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుతోనే సరిపెట్టకుండా మహిళలకు రుణాలు, చిన్నారులను హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్వాసితులకు అన్నిరకాల తోడ్పాటు అందించిన తరువాతే కూల్చివేతలను మొదలుపెట్టాలని భావిస్తోంది. మూసీ పునరావాసంపై ఎమ్మార్డీసీ ఎండీ దానకిషోర్ శుక్రవారం అధికారులతో చర్చించారు. ఉపాధి కల్పన, పట్టా ఉంటే చట్ట ప్రకారం రావాల్సిన ప్రయోజనాలు, ఆయా కుటుంబాల్లోని పిల్లలకు గురుకులాల్లో అడ్మిషన్లు కల్పిస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల సమన్వయంతో అర్హులకు పథకాలు అందేలా చూస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్డీసీ ఎండీ దానకిషోర్

హౌసింగ్ సిబ్బందికి ఇళ్ల కేటాయింపు బాధ్యతలు

మూసీ నిర్వాసితులకు త్వరితగతిన ఇళ్ల కేటాయింపు కోసం ప్రాంతాల వారీగా హౌసింగ్ సిబ్బందికి జీహెచ్ఎంసీ బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు పడక గదుల ఇళ్లను మూసీ నిర్వాసితుల కుటుంబాలకు కేటాయించనున్నారు. ఇందుకుగాను.. ప్రాంతాలవారీగా హౌసింగ్ సిబ్బందిని కేటాయిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్(హౌసింగ్), చీఫ్ ఇంజినీర్(హౌసింగ్)ను ఆమె ఆదేశించారు.

మత్తులో హత్యలు... అడ్డొస్తే గొడవలు
ధన్వంతరి మోసానికి సీసీఎస్ చికిత్స
15లో

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



వైద్య శిబిరంలో కార్మికులతో చామ సంపూర్ణరెడ్డి, కౌన్సిలర్లు

హయత్‌నగర్ న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పెద్దఅంబర్‌పేట్ పురపాలిక వైస్ ఛైర్‌పర్సన్ చామసంపూర్ణరెడ్డి అన్నారు. శుక్రవారం కుంట్లూర్ వార్డు కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నిత్యం మున్సిపాలిటీలో స్వచ్ఛత కోసం పాటుపడే కార్మికులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రతలు పాటించాలని సూచించారు. కౌన్సిలర్లు అనుపమ, హరిశంకర్, కమిషనర్ రవీందర్‌రెడ్డి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితుల తరలింపు ప్రారంభం



సామగ్రిని వాహనాల్లో తరలిస్తున్న ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ సంధ్యారాణి

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: మూసీ పరిసర ప్రాంతం జియాగుడ, వినాయక నగర్, రసూల్‌పుర, శంకర్‌నగర్ బస్తీలకు చెందిన 20 కుటుంబాలు శుక్రవారం రాత్రి అక్కడి నుంచి తరలి వెళ్లేందుకు అంగీకరించారు. దాంతో రెవెన్యూ అధికారులు వాహనాలను ఏర్పాటు చేసి సామగ్రి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. చంచల్‌గూడ క్రాస్ రోడ్డులో ఉన్న రెండు పడకల సముదాయానికి వెళ్లారు. నిర్వాసితులు వెళ్లాలనుకుంటే తమకు చెబితే సామగ్రి తరలింపునకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆర్డీఓ మహిపాల్, హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు.

మాంసం దుకాణాలు తొలగించాలని డిమాండ్

వనస్థలిపురం, న్యూస్‌టుడే: వనస్థలిపురంలోని రైతుబజార్ ప్రాంగణంలోని వీరశైవ మత గురువు బసవేశ్వర విగ్రహం వద్ద ఉన్న మాంసం దుకాణాలను వెంటనే తొలగించాలనీ పలువురు వీరశైవ కులస్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతి ఏడాది జయంతి ఉత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. వీరశైవ మతస్థులు మాంసాహారులు కారు కాబట్టి వారి మనోభావాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. స్థానిక పోలిసులు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు కరిణె శాంతప్ప ప్రభాకర్, భక్తులు కోరారు.

'ఇజ్తేమా-ఏ-ఆమ్' రేపు

సైదాబాద్, న్యూస్‌టుడే: జమాత్-ఏ-ఇస్లామీ హింద్ మలక్‌పేట ఆధ్వర్యంలో ఈనెల 29న 'ఇజ్తేమా-ఏ-ఆమ్' నిర్వహించనున్నట్లు సంబంధిత కమిటీ ప్రతినిధులు తెలిపారు. సైదాబాద్ కూడలి వద్ద ఉన్న మస్జిద్-ఏ-ఉజాలేషాలో రాత్రి 8 గంటలకు సీరాహ్ క్యాంపెయిన్‌లో భాగంగా కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. మస్జిద్-ఏ-అజీజియా ఖతీబ్ అధ్యక్షుడు ఏజాజ్ మొహియుద్దీన్ వసీమ్‌తోపాటు మునీబ్ అహ్మద్ ఖాన్ హాజరై ధార్మిక సందేశం ఇవ్వనున్నారని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు



ఇంద్రప్రస్థ కాలనీలో రోడ్డు పక్కన చెత్తకు నిప్పు

బండ్లగూడ, న్యూస్‌టుడే: నాగోల్ డివిజన్‌లోని అనేక కాలనీల్లో రోడ్ల పక్క, ఖాళీ ప్లాట్లలో చెత్తాచెదారంతో నిండి అపరిశుభ్రంగా దర్శనిమిస్తున్నాయి. చెత్తను ఊడ్చి కుప్పలుగా పేర్చుతున్నారు కానీ ఎన్నటికీ తరలించడం లేదు. కొన్ని చోట్ల సిబ్బందే కుప్పలను తగలబెడుతున్నారు. ఇటీవల కురుసిన వర్షాలకు చెత్తకుప్పలు కొట్టుకుపోయి మ్యాన్‌హోళ్లలోకి చేరాయి. దీంతో డ్రైనేజీ దెబ్బతిని కొన్ని కాలనీల్లో మురుగు పొంగిపోర్లుతోంది. ఇలా పారిశుద్ధ్య వ్యవస్థ దారుణంగా ఉండటంతో కాలనీల్లో ప్రతి ఒక్క ఇంట్లో జ్వరపీడితులై ఆసుపత్రుల పాలవుతున్నారు.

ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా మార్పు లేదు

ఆగస్టులో ప్రభుత్వం 'స్వచ్ఛదనం- పచ్చదనం' చేపట్టింది. అది తూతూ మంత్రంగా సాగింది. కొన్ని చోట్ల ముగ్గులు వేసి ప్రజల్లో చైతన్యం కల్పించారు కానీ ఫలితం లేదు. ప్రస్తుతం కేంద్రం పిలుపు మేరకు 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో జరుగుతోంది. అయినా ఏమాత్రం మార్పు లేదు. సంబంధిత అధికారులు కనీసం రోడ్ల మీదకు వచ్చి పరిశీలించడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలనీలో ప్రతీ రోజు పలానా రోడ్డు శుభ్రం చేశామని, అక్కడ నివాసం ఉంటున్న స్థానికుల సంతకాలు, ఫోన్ నంబర్లు తీసుకోవాలి. అవి కూడా పాటించడం లేదంటున్నారు. ఇకనైనా చర్యలు తీసుకొని కాలనీల్లో చెత్త, వ్యర్థాలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.

● పరిస్థితి ఇలా ఉంటే నాగోల్ డివిజన్‌లో చెత్త తరలించేందుకు రిక్షాలు లేవని అధికారులు చెబుతుండటంతో కొన్ని చోట్ల కాలనీవాసులు సొంత ఖర్చులతో వాటిని కొనుగోలు చేశారు. ఇంద్రప్రస్థకాలనీ సంక్షేమ సంఘం రూ.20వేలు ఖర్చు చేసి రిక్షాను కొన్నారు.



కాలనీలో రెండు నెలలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

దీన్ని ఆగస్టు 15న డీసీ యాదయ్య, కార్పొరేటర్ అరుణాయాదవ్ ప్రారంభించారు. కానీ వాటిని వినియోగించేందుకు అదనంగా సిబ్బందిని మాత్రం నియమించలేదని ప్రజలు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటున్నాం

– తిప్పర్తి యాదయ్య, ఉపకమిషనర్, హయత్‌నగర్ సర్కిల్

పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుపరచడానిక అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలో శుభ్రం చేశాక స్థానికుల సంతకాల సేకరణ చేపట్టాలని ఆదేశించాము చెత్త రిక్షాలకు సిబ్బందిని వెంటనే కేటాయించి తరలింపు నిరంతరంగా చేయిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030	మలక్‌పేట: 80085 73284
	హయత్‌నగర్: 98336 64897
	కర్మన్‌ఘాట్: 94400 32872
	బండ్లగూడ: 96034 78579
	మూసారాంబాగ్: 79933 00559

బండ్లగూడ, కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే:

? ఫతుల్లాగూడ సర్వే నంబర్-58 బస్తీలోని ఆంజనేయ ఆలయం ముందు రెండు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు.
– శ్రీనివాస్ యాదవ్, బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

✔ మా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపడతాం.
– కోటయ్య, సూపర్‌వైజర్, జీహెచ్‌ఎంసీ లైటింగ్ విభాగం

? హస్తినాపురం డివిజన్ పరిధి సాగర్ రోడ్డులోని పద్మావతినగర్ కాలనీలోని ఓ పాఠశాల ముందు వ్యర్థాలతో పాటు చెత్తను తెచ్చి పారబోస్తున్నారు.
– నాగేశ్వర్‌రావు, పద్మావతినగర్ కాలనీ

✔ చెత్త వేయకుండా నివారణ చర్యలు చేపడుతాం.
– శంకర్, పారిశుద్ధ్య శాఖ జవాన్, హస్తినాపురం

అదనపు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాత నాయక్

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: కాలనీలలో మురుగు సమస్య లేకుండా అదనపు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. డివిజన్ పరిధి జడ్పీ రోడ్డులోకి వెంకటేశ్వర, అగ్రికల్చర్ కాలనీల మధ్య నెలకొన్న మురుగు సమస్య పరిష్కారానికి జలమండలి జీఎం బాలరామరాజుతో పాటు ఇంజినీరింగ్ అధికారులతో కలసి కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. మురుగు సమస్య ఉన్న కాలనీలో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని పేర్కొన్నారు. ఏఈ మల్లికార్జున్ గౌడ్, మేనేజర్ సురేష్, చంద్రమోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వం శ్రీరామరక్ష



మూసారాంబాగ్ న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వం కుటుంబానికి శ్రీరామరక్ష అని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్ రెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూసారాంబాగ్‌లోని కాలనీలు, బస్తీల్లో ఇంటింటికి పర్యటించారు. పార్టీ విధివిధానాలను వివరించి సభ్యత్వాన్ని నమోదు చేయించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్బీనగర్, న్యూస్‌టుడే: మన్సూరాబాద్ సౌత్ ఎండ్ పార్క్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ఎం.రమేష్, ప్రధాన కార్యదర్శి టి.రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ మూర్తి, కోశాధికారి రామకృష్ణ, సహాయ కోశాధికారి డి.సుధాకర్, జాయింట్ సెక్రటరీ రాజేశ్ రావు, కార్యవర్గ సభ్యులుగా హరిప్రసాద్, జగన్మోహన్‌రావు, కృష్ణారావు నియమితులయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం పాటుపడతామని చెప్పారు.

ముగిసిన ఎస్జీఎఫ్ జోనల్ క్రీడలు



బాలికల జట్లతో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి. చిత్రంలో రాధాకృష్ణ, శివకుమార్ తదితరులు

సైదాబాద్: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) సైదాబాద్ జోనల్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. 25 నుంచి మూసారాంబాగ్-అంబర్‌పేట మార్గంలోని స్వామి వివేకానంద సెంటనరీ స్కూల్ మైదానంలో కొనసాగాయి. శుక్రవారం కబడ్డీ- 17 బాలుర విభాగంలో ప్రథమ- ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ బాలురు మలక్‌పేట, ద్వితీయ-టీజీఎంఆర్ఎస్ సైదాబాద్, తృతీయ-ప్రభుత్వ మలక్‌పేట పాఠశాలలు విజయం సాధించాయని సైదాబాద్ జోన్ కార్యనిర్వాహక కార్యదర్శి గుర్రం ఓం హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవంలో స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ హాజరయ్యారు. సైదాబాద్ జోన్ డిప్యూటీ డీఈవో రాధాకృష్ణ, స్వామి వివేకానంద స్కూల్ ప్రిన్సిపల్ శివకుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.

ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన నడక రేపు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డా.శ్రీనివాస్, తదితరులు

మూసారాంబాగ్ న్యూస్‌టుడే: దిల్‌సుఖ్‌నగర్ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో ప్రోస్టేట్ క్యాన్సర్‌పై ఆదివారం అవగహన నడక ఉంటుందని డైరెక్టర్, డా.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోడపత్రికను ఆవిష్కరించారు. దేశంలో అత్యధికంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తర్వాత ప్రోస్టేట్ అని వివరించారు. 50 ఏళ్లు పైబడిన వృద్ధులకు అధికశాతం కనిపిస్తుందని, కాని అంతగా బయపడాల్సిన అవసరం లేదన్నారు. పరిక్షల్లో గుర్తిస్తే ప్రాథమిక దశలోనే నివారించవచ్చు అని పేర్కొన్నారు. డా.సుభాష్ చంద్రబోస్, డా.దీప్తి, డా.వలి తదితరులు ఉన్నారు.

రిక్షాల పంపిణీ



నాగోలు, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీకి చెందిన కొత్త చెత్త రిక్షా బండ్లను ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ శుక్రవారం కార్మికులకు అందజేశారు. తద్వారా డివిజన్‌లో స్వచ్ఛతను పెంపొందించాలనీ, సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఉపకమిషనర్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈ నీలిమ, జవాన్ లక్ష్మయ్య, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాసచారి, వెంకటస్వామి, రవి, తన్వీర్ పాల్గొన్నారు.

జీఎస్ఐలో 'స్వచ్ఛతా హీ సేవా'



మొక్క నాటుతున్న అధికారులు

బండ్లగూడ, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగి కనీసం ఒక్క మొక్కనైనా నాటి దాని సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని జీఎస్ఐ సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్ ఎస్.డి. పట్నాజీ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా నాగోల్ డివిజన్ బండ్లగూడ జీఎస్ఐ సంస్థలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. సంస్థ ఏడీజీ పట్నాజీ, క్రీడల విభాగం డిప్యూటీ కంట్రోలర్ ఎస్.శంకరయ్య హాజరై సంస్థ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యవరణ పరిరక్షణకు మొక్కలు నాటితే భవిష్యత్తు తరాలు ఆనందంగా ఉంటాయన్నారు. విశాలమైన సంస్థ ఆవరణను పచ్చదనంతో కార్యాలయాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. డీడీజీలు ఎస్.ఎన్.పాత్ర, అన్షుమన్ ఆచార్య, అధికారులు మహేశ్, మధిర సత్యనారాయణ, తారకేశ్వర రావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా న్యాయపీఠంతో సత్వర న్యాయం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సత్వర న్యాయం పొందడానికి జాతీయ ప్రజా న్యాయపీఠాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డిజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీదేవి కక్షీదారులకు పిలుపునిచ్చారు. రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం(నేడు) జరిగే జాతీయ ప్రజా న్యాయ పీఠం(నేషనల్ లోక్ అదాలత్) కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. చట్టానికి లోబడి రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులతో పాటు కుటుంబ తగాదాలు, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, రుణ వసూళ్లు, బ్యాంకులు తదితర సివిల్ కేసులు ప్రజా న్యాయ పీఠంలో పరిష్కరించుకోవచ్చని సూచించారు. సివిల్ కేసులు రాజీ కుదుర్చుకుంటే కేసు దాఖలు సమయంలో చెల్లించిన కోర్టు రుసుమును వాపసు పొందొచ్చునని అన్నారు. ఇంకా కోర్టు వరకు రాని వివాదాల్లో(ప్రీ లిటిగేషన్ కేసులు) సైతం పరిష్కారం చూపిస్తామని అన్నారు.

పోరాట యోధుడు బాపూజీ



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, నర్సింహారెడ్డి

హయత్‌నగర్ న్యూస్‌టుడే: మలిదశ తెలంగాణ ఉద్యమ మార్గదర్శి, బడుగుబలహీన వర్గాల చైతన్యానికి ప్రతీక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి కొనియాడారు. హయత్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హయత్‌నగర్ పద్మశాలి సంఘం సభ్యులు నరేందర్, విజయ్, విఠల్ పాల్గొన్నారు.

మురుగు సమస్యతో ఇబ్బందులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: రోడ్డుపై నిత్యం మురుగు ఏరులై పారుతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మన్సురబాద్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పొంగుతున్న డ్రైనేజీ మురుగును ఆయన పరిశీలించి, సిబ్బందితో పనులు చేయించారు. వర్షం కురిసిన ప్రతీసారి మురుగు రోడ్డుపైకి ఇళ్లలోకి రావడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికైన జలం మండలి అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలనీ కోరారు. నగరంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే డ్రైనేజీ పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తున్నారని ఆరోపించారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: వనస్థలిపురం సచివాలయ నగర్‌లోని ఔషధీ క్లినిక్‌లో శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3 వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 9032346359 నంబరులో సంప్రదించాలని వెల్లడించారు.

కార్పొరేటర్ పాదయాత్ర

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీలో అధికారులు, కాలనీ ప్రతినిధులతో కలసి కార్పొరేటర్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. పనుల్లో నాణ్యతతో పాటు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కోరారు. సతీష్‌రెడ్డి, నవీన్‌కుమార్, హరీందర్‌రెడ్డి, నారాయణరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఈఈ ఆశలత, డిఈ దామోదర్

వనస్థలిపురం, న్యూస్‌టుడే: రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో వేస్తున్న నూతన సీసీ రోడ్డును ఈఈ ఆశలతా, డిఈ దామోదర్‌లతో కలిసి పరిశీలించారు. గుత్తేదారు పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. కాలనీవాసులు పురుషోత్తంరెడ్డి, ధనరాజ్, రవికిరణ్, జీహెచ్‌ఎంసీ ఏఈ నరేందర్ తేజ, జవాన్ యాదగిరి పాల్గొన్నారు.

ధర్నాచౌక్‌లో 'రైతు హామీల సాధన దీక్ష' 30న

రాంనగర్: అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు భాజపా పోరాటాలు చేపడుతుందని ఆ పార్టీ శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. 30న ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో 24 గంటల పాటు 'రైతు హామీల సాధన దీక్ష' చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కిసాన్ మోర్చా నేతలతో కలిసి ధర్నాచౌక్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. రాహుల్‌గాంధీని రాష్ట్రానికి తీసుకొచ్చి 'వరంగల్ డిక్లరేషన్' పేరిట అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. పంట ఉత్పత్తులకు బోనస్‌తోపాటు రైతుభరోసా పథకం కూడా బోగస్ అని.. సగంమంది కర్షకులకే రుణమాఫీ చేశారని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో రైతుల పక్షాన పోరాటం చేయాలని భాజపా నిర్ణయించి.. 'రైతు హామీల సాధన దీక్ష' కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. దీక్షకు అన్నదాతలు తరలివచ్చి మద్దతు పలకాలని కోరారు. సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి అదృశ్యం

సైదాబాద్, న్యూస్‌టుడే: దివ్యాంగుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దివ్యాంగుడైన పీవీఆర్ నాగేశ్వర ప్రసాద్ ఐఎస్‌సదన్ డివిజన్ శంకేశ్వర్‌బజార్‌లోని గోల్డేజ్ హోంలో నివాసం ఉంటాడు. బుధవారం ఉదయం వాకింగ్ కోసం సమీపంలో ఉన్న సరూర్‌నగర్ చెరువు కట్టపైకి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో నిర్వాహకులు పలు ప్రాంతాల్లో వెతికారు. ఎలాంటి సమాచారం అందకపోవడంతో గోల్డేజ్ హస్పిటల్ మేనేజర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్కను కలిసేందుకు వచ్చిన తమ్ముడి...

సైదాబాద్, న్యూస్‌టుడే: అక్కను కలిసేందుకు వచ్చిన తమ్ముడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా సదాశివపేట మండల పరిధి మాచిరెడ్లపల్లెకు చెందిన వెంకటేశం గౌడ్ మేస్త్రీ. 13న ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ వాంబే గృహాల్లోని బ్లాక్ నంబర్-33లో నివసించే అక్క కళావతిని కలిసేందుకు వచ్చాడు. 14న మధ్యాహ్నం ఆయన మూర్ఛ వచ్చి రహదారిపై పడగా తలకు దెబ్బ తగలడంతో స్థానికులు ప్రథమ చికిత్స చేశారు. 15న ఇంటినుంచి బయటకు వెళ్లిన తమ్ముడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆచూకీ కోసం ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

టెన్యూర్ పీపీల వ్యవస్థను కొనసాగించాలి

న్యాయవాదుల సంఘం

సర్వసభ్య సమావేశంలో తీర్మానం




మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో న్యాయవాదుల కోటాలో కేటాయించిన టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల స్థానంలో ఎట్టి పరిస్థితుల్లో క్యాడర్ పీపీలను నియమించరాదని రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం సర్వ సభ్య సమావేశం తీర్మానించింది. ప్రాసిక్యూటర్ల స్థానంలో రెగ్యులర్ ఏపీపీలకు పదోన్నతితో నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్తర్వులపై చర్చించడానికి రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కొండల్‌రెడ్డి మాట్లాడుతూ... టెన్యూర్ పీపీల స్థానంలో క్యాడర్ పీపీలను నియమించరాదని కోరుతూ ఇటీవలే సచివాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ, హోం సెక్రటరీలతో పాటు న్యాయ శాఖ కార్యదర్శికి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేదని అన్నారు. గురువారం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు(జీవో నెంబరు 837)ను వెంటనే రద్దు చేయాలని, టెన్యూర్ పీపీల నియామక విధానాన్ని పునరుద్ధరించి న్యాయవాదుల హక్కుల్ని కాపాడడం కోసం సంఘటితంగా పోరాడాలని పలువురు న్యాయవాదులు ఉద్ఘాటించారు. సంఘం మాజీ అధ్యక్షులు కొంగర రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు అనంత సేనారెడ్డి, మధుసూదన్‌రావు, రామారావు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లాకోర్టులో కొండా లక్ష్మణ్, చాకలి ఐలమ్మలకు నివాళులు

మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గులగారి కృష్ణ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లాకోర్టుల్లోని బార్ అసోసియేషన్ హాలులో వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థికాభివృద్ధికి పర్యాటకరంగం దోహదం



పురస్కార గ్రహీతలతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మురళీమోహన్‌రాజు తదితరులు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: పర్యాటకరంగం దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మార్గమని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం సైఫాబాద్‌లోని అన్మోల్ కాంటినెంటల్ హోటల్‌లో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పర్యాటక పురస్కారాలను 'మీర్ అహ్మద్ అలీ (నైస్ టూర్స్ అండ్ ట్రావెల్స్), డా.బోగ కోదండపాణి (సావరిన్ ఎస్టేట్స్ అండ్ మల్టీ ట్రేడర్స్), డి.రఘురామ్ (శ్రీబాలాజీ ట్రేడర్స్), ఎస్.విలాస్ (హైదరాబాద్ హాలీడేస్)లకు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యాటకమే అన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఆర్థిక వనరు మాత్రమే కాదని, యువతకు ఉపాధినిచ్చే వేదికని పేర్కొన్నారు. అంతకుముందు కవి సమ్మేళనం నిర్వహించారు. నాట్యగురువు డా.ఎస్.పి.భారతి, సామాజికవేత్తలు మురళీమోహన్ రాజు, ఎస్.రామచంద్రరావు, సర్వేపల్లి గోపీకృష్ణ, డా.రాధా కుసుమ, వై.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

నగరంలో పోస్టర్లపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలకు దారి తీయడం, అపరిశుభ్రత, నగర వాతావరణాన్ని అధ్వానంగా మార్చుతున్న పోస్టర్లపై జీహెచ్‌ఎంసీ నిషేధం విధించింది. అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, చెట్లు, విద్యుత్తు స్తంభాలకు ప్రకటనలు తగిలించడం, రహదారులపై బోర్డులను ఏర్పాటు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిషేధాజ్ఞలను పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం యంత్రాంగాన్ని ఆదేశించారు. సర్కిళ్ల ఉపకమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై పత్రాలను అంటించకుండా అవగాహన కల్పించాలన్నారు. గోడలపై ప్రకటనలు, నినాదాలు, ఇతర రాతలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పెళ్లి చేసుకుంటానని యువకుడి మోసం

వనస్థలిపురం, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని యువకుడు యువతిని మోసం చేసిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. యువతి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వనస్థలిపురంలోని మహాలక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్న నందకుమార్ ప్రైవేటు ఉద్యోగి. 6 నెలల క్రితం పెళ్లి చూపుల కోసం కుటుంబసభ్యులతో కలిసి ఓ యువతి ఇంటికి వెళ్లారు. ఆమె నచ్చడంతో ఇటీవలే ఇద్దరికి నిశ్చితార్థం అయింది. దీంతో వారు సన్నిహితంగా ఉన్నారు. ఆ తర్వాత తన మామ కూతురితో వివాహం జరుగుతుందని, మర్చిపోవాలనీ యువకుడు ఆమెకు సూచించాడు. మోసపోయానని శుక్రవారం యువతి కుటుంబసభ్యులతో కలిసి నందకుమార్ ఇంటిముందు ఆందోళనకు దిగారు. తనకు న్యాయం చేయాలనీ ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

సైదాబాద్, న్యూస్‌టుడే: సైదాబాద్ ఠాణా హోంగార్డు మహమ్మద్ ఆసిఫ్(40) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం కంచన్‌బాగ్ పరిధి హఫీజ్‌బాబానగర్‌లోని బీ-బ్లాక్‌లోని నివాసంలో ఉంచిన ఆయన మృతదేహాన్ని ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేందర్, సిబ్బందితో కలిసి సందర్శించారు. గత మూడేళ్లకు పైగా సైదాబాద్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఆసిఫ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్
• చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

ఫారూఖ్‌నగర్‌లో 'డబుల్' ఇళ్ల పరిశీలన



చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ఫలక్‌నుమా ఫారూఖ్‌నగర్‌లోని డబుల్ ఇళ్లను శుక్రవారం సందర్శించారు. ఫారూఖ్‌నగర్‌లో చేపడుతున్న విద్యుత్ నియంత్రిక ఏర్పాటు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. వసతులు మెరుగు పరచడంతో పాటు ఖాళీగా ఉన్న వాటిని అర్హులకు కేటాయించేలా చూస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెంట మజ్లిస్ నాయకుడు మోతిలాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

రెండు పడక గదుల గృహాలను పరిశీలిస్తున్న బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

'గో రక్షా మహా పాదయాత్ర' ప్రారంభం

కేశవగిరి, న్యూస్‌టుడే: శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ నుంచి 'గో రక్షా మహా పాదయాత్ర' శుక్రవారం ప్రారంభమైంది. నగరంలోని సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీకి చెందిన బాలకృష్ణ గురుస్వామి ఈ యాత్రను తలపెట్టారు. నగరంలోని పాతబస్తీకి చెందిన ప్రముఖులు గాజుల వెంకటరమణ, ఆదుల శ్రీధర్, చిట్టి బాల్‌రాజ్, ఒగ్గు బాల్‌రాజ్‌లు ప్రత్యేకంగా శ్రీనగర్‌కు వెళ్లి యాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొనడం విశేషం. సుప్రసిద్ధ లాల్ చౌక్ ప్రాంగణంలో జరిగిన 'గో రక్షా మహా పాదయాత్ర'లో స్థానిక ముస్లింలు పాలుపంచుకుని సంఘీభావం తెలపడం విశేషం. 'అఖిల భారత గోసేవా ఫౌండేషన్' ఆధ్వర్యంలో గోవు, ధరిత్రి, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా బాలకృష్ణ గురుస్వామి దేశవ్యాప్తంగా మహాపాదయాత్రకు రూపకల్పన చేశారు.



శ్రీనగర్ లాల్‌చౌక్ వద్ద పాదయాత్రలో..

జీఎంహెచ్ఎస్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డా.అనురాధ



సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (జీఎంహెచ్ఎస్) ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డా.అనురాధ నియమితులయ్యారు. ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన డా.రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు.

స్నూకర్ విజేత న్యూ క్లబ్

ఈనాడు, హైదరాబాద్: ఫతే మైదాన్ క్లబ్ (ఎఫ్ఎంసీ) అంతర్ క్లబ్ ఆహ్వానిత స్నూకర్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో న్యూ క్లబ్ విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో న్యూ క్లబ్ 2-1తో ఎఫ్ఎంసీ-ఎపై విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో మురళీ కృష్ణ (న్యూ క్లబ్)పై విశాల్ అగర్వాల్ (ఎఫ్ఎంసీ-ఎ)పై నెగ్గాడు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



సేకరించిన వ్యర్థాల మూటలతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కార్వాన్, విజయనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏ వర్సిటీ ప్రొ.సీతారామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మనుస్వామినథన్ సూచించారు. శుక్రవారం వర్సిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. అధికారులు ఆర్.రాధిక, నరేష్‌కుమార్, సుబ్బనారాయణ, ఆదిత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు బజీ మసీదు, ఫుట్‌బాల్ (గ్రౌండ్), జఫర్ షా (గ్రౌండ్), అన్సర్ ఉలూం కళాశాల, హాటీ ఉస్మాన్‌పుర, బజార్‌ఘాట్, హోటల్ గ్యాస్, ఇందిరానగర్, టోలీ హూట్, గాంధీ విగ్రహం. మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు రేతిబౌలి, గోల్కొండ ఆసుపత్రి, బాలాజీనగర్, బడాబజార్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదు.

ఉస్మానియా ఆసుపత్రి: శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంస్థాన్ నారాయణపురం, సంజయ్‌నగర్, మున్సిపల్ క్వార్టర్స్, బాంజావాడీ, గిర్కపల్లి, టోలీ మసీదు, ఎస్‌బీఐ గార్డెన్స్, మహబూబ్ కాలనీ, మల్లైమెర్, ఐస్ ఫ్యాక్టరీ, తదితర ప్రాంతాలు.

అక్రమ పార్కింగ్



జ్యోతినగర్ వద్ద సర్వీస్ రోడ్డులో పిల్లర్ నంబరు 86 నుంచి 92 వరకు..



లంగర్‌హౌస్ మారుతీనగర్‌లో..

నాంపల్లి నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రోడ్లపై కార్లు, వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇతర వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. స్థానికులు నానాయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఓంనగర్‌లో కార్లు పెట్టకుండా స్థానికులు రాళ్లు పెట్టారిలా.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

– న్యూస్‌టుడే, బేగంబజార్ సుల్తాన్‌బజార్

? కందస్వామిలేన్, గుజరాతీగల్లీ ప్రాంతాల్లో లోప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. ఇబ్బందులు పడుతున్నాం.
– వివేకానంద, ప్రైవేటు ఉద్యోగి, సుల్తాన్‌బజార్

✓ నీటి సమస్య తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది.

? ఇసామియాబజార్, రెసిడెన్సీక్వార్టర్స్, గాడీఖానా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. మురుగు పారడంతో దుర్వాసన, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.
– శంకర్‌రెడ్డి, వ్యాపారి, ఇసామియాబజార్

✓ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటాం. – కులశేఖర్, సెక్షన్ మేనేజర్, సుల్తాన్‌బజార్

? జుమ్మేరాత్‌బజార్ పోలీసు అవుట్ పోస్టు వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. క్షేత్రస్థాయిలో బల్దియా సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త తరలించకపోవడంతో విపరీతమైన ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి.
– సుప్రియ, జుమ్మేరాత్‌బజార్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి అదనపు ట్రిప్పుల ద్వారా చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు కృషి చేస్తాం.
– అశోక్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

నత్తనడకన ఫలక్‌నుమా ఆర్వోబీ పనులు

నరకయాతన పడుతున్న వాహన దారులు

న్యూస్‌టుడే, కేశవగిరి

చాంద్రాయణగుట్ట చౌరస్తా, ఫలక్‌నుమా మధ్య చేపడుతున్న ఫలక్‌నుమా ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) పనులు నత్తకే నడక నేర్పుతున్నాయి. 2021లో రూ.47.10 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో జీహెచ్ఎంసీ వాటా రూ.13.25 కోట్లు. రైల్వే శాఖకు రూ.10.76 కోట్లు వంతెన నిర్మాణానికి కేటాయించారు. మొత్తం వ్యయంలో అప్పటికే ఉన్న ఫలక్‌నుమా ఆర్వోబీ ఆధునికీకరణతో పాటు సమాంతరంగా 360 మీటర్ల పొడవైన నూతన వంతెన నిర్మించేందుకు ప్రతిపాదించారు. దీంతోపాటు ముర్కినాలాపై 19 మీటర్ల వెడల్పయిన కల్వర్టునూ ప్రతిపాదించారు. నూతనంగా నిర్మితమవుతున్న సమాంతర ఆర్వోబీ 7.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఈ రెండు వంతెనలకు ఇరుపక్కలా 7.5 మీటర్ల సర్వీసు రోడ్లు నిర్మిస్తున్నారు. జీహెచ్ఎంసీ 2021 మార్చి 1న ఆర్వోబీ పనులు ప్రారంభించింది. అప్పట్లో ఈ మార్గాన్ని పూర్తిగా మూసివేసి రాకపోకలు నిషేధించారు. లాల్‌దర్వాజా వైపు నుంచి 9 నెలల పాటు ట్రాఫిక్‌ను మళ్లించగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో 2021 నవంబరు 2న ఒకవైపు మార్గంలో హుటాహుటిన రాకపోకలకు అనుమతించారు. దీంతో వాహనదారులు నానాయాతన పడుతున్నారు.



రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా..

సమాంతర వంతెన నిర్మాణం సైతం..

ఒకవైపు ఆధునికీకరణ పనులు పూర్తయి 2021 నవంబరులో రాకపోకలకు వీలు కల్పించారు. తరువాత దీని ఎడమ పక్కన సమాంతర నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో ప్రముఖంగా కృష్ణా పైపులైన్లను పక్క నుంచి దారి మళ్లించడం, రెండోది రైలు పట్టాలపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం. రూ.10.76 కోట్లు బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే శాఖకు ముందే కేటాయించారు. సమాంతర నూతన వంతెన 360 మీటర్ల పొడవు నిర్మితమవుతోంది. జీహెచ్ఎంసీ ట్రాక్‌కు ఇవతలి వైపు, ఆవలి వైపున బ్రిడ్జి రహదారులను నిర్మించి సిద్ధంగా ఉంచింది. కృష్ణా పైపులైన్లను పక్కకు తొలగించారు. అయితే రైల్వేశాఖ పనులు ఆలస్యంగా మొదలుపెట్టినా నత్తనడకన కొనసాగించడంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఆ శాఖ పనులు వేగంగా పూర్తిచేస్తే జీహెచ్ఎంసీ చొరవ తీసుకుని ఈ మార్గాన్నీ ప్రారంభించేందుకు అవకాశం కలుగుతుంది.

18 నెలలు ఆలస్యంగా..

2021 మార్చిన ఫలక్‌నుమా ఆర్వోబీ పనులు ప్రారంభం కాగా రెండేళ్లలో పూర్తిచేయాల్సి ఉంది. అయితే 18 నెలలు అదనంగా గడిచిపోయినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. ఆర్వోబీ నిర్మితమవుతున్న పరిసరాలు అధ్వానంగా మారాయి. రెండు వైపులా రోడ్డు విస్తరణ జరగలేదు. సర్వీసు రోడ్లకు మరమ్మతులూ లేవు. పరిసర బస్తీల ప్రజలు, ఫలక్‌నుమా రైల్వేస్టేషనుకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.



పూర్తయిన దిగువ మార్గం.. ఎగువ మార్గంలో సిద్ధమైన రోడ్డు.. ప్రస్తుతానికి ఒకే మార్గంలో రాకపోకలు

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

– టి.వెంకన్న, జోనల్ కమిషనర్, చార్మినార్



ఫలక్‌నుమా ఆర్వోబీ పనులు రెండు నెలల్లో పూర్తిచేసేందుకు కసరత్తు జరుగుతోంది. జీహెచ్ఎంసీ తరఫున పనులన్నీ పూర్తయ్యాయి. నూతన సమాంతర వంతెన రెండు వైపులా బ్రిడ్జి రోడ్లు పూర్తిచేసి సిద్ధంగా ఉంచాం. రైల్వేశాఖ వారు పనులు పూర్తి చేయాల్సి ఉంది.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో డీజేలు వాడొద్దు: ఏసీపీ



ప్రసంగిస్తున్న ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి

గోషామహల్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో డీజేలు ఏర్పాటు చేయరాదని గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి సూచించారు. షాయినాయత్‌గంజ్ ఠాణాలో డీజే దుకాణదారులు, ఉత్సవ నిర్వాహకులతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. డీజేలతో శబ్ద కాలుష్యం, వయోవృద్ధులు, రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో అనుమతులు ఇవ్వడం లేదన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఐ శోభన్ బాబు, ఎస్సైలు లక్ష్మయ్య, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాయణ మేళాకు భారీ ఏర్పాట్లు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న గోవింద్ రాఠి, కమల్‌నారాయణ్ అగర్వాల్

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకొని అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించనున్న 52వ రామాయణ మేళాకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్ రాఠి పేర్కొన్నారు. సమాజ్ అధ్యక్షుడు కమల్ నారాయణ అగర్వాల్, మేళా కోశాధికారి గిర్ధారిలాల్ ధాగా, మనోజ్ జైస్వాల్‌తో కలిసి శుక్రవారం కోఠిలోని సమాజ్ కార్యాలయంలో రామాయణ మేళా ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

సీఐటీయూ నిరసన కార్యక్రమాలు 28, 30న..



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికులు, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 28న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 30న చలో లేబర్ కమిషనరేట్ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు ఎస్వీ రమ, వెంకటేశ్ తదితరులతో కలిసి మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 5 నుంచి ప్రచారోద్యమాన్ని చేపట్టినట్లు గుర్తు చేశారు.

కొమురవెల్లి మల్లన్న సేవలో ఎస్‌బీఐ సీజీఎం



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామిని శుక్రవారం దర్శించుకొని పూజలు చేశారు. త్వరలో కొమురవెల్లిలో ఎస్‌బీఐ శాఖను ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎస్‌బీఐ డీజీఎం వివేక్‌చంద్ర జస్వాల్, రీజనల్ మేనేజర్ అరుణజ్యోతి, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సిద్దిపేట ప్రాంతీయ అధికారి నర్ర సంతోష్ ఉన్నారు. – న్యూస్‌టుడే, చేర్యాల

నగరంలో పోస్టర్లపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలకు దారి తీయడం, అపరిశుభ్రత, నగర వాతావరణాన్ని అధ్వానంగా మార్చుతున్న పోస్టర్లపై జీహెచ్ఎంసీ నిషేధం విధించింది. అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, చెట్లు, విద్యుత్తు స్తంభాలకు ప్రకటనలు తగిలించడం, రహదారులపై బోర్డులను ఏర్పాటు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిషేధాజ్ఞలను పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం యంత్రాంగాన్ని ఆదేశించారు. సర్కిళ్ల ఉపకమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై పత్రాలను అంటించకుండా అవగాహన కల్పించాలన్నారు. గోడలపై ప్రకటనలు, నినాదాలు, ఇతర రాతలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపకమిషనర్లు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తాఖీదులు తప్పవన్నారు. ఉల్లంఘనలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా నిషేధాజ్ఞలు పట్టించకపోతే జరిమానా వేయాలని, రోజువారీ నివేదికలను కేంద్ర కార్యాలయానికి పంపాలని తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



కలెక్టరేట్‌లో.. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా అధికారులు



నాంపల్లిలో డాక్టర్ ఎస్.ముజీబ్‌హుస్సేన్, టీఎన్జీవో నేతలు, ఉద్యోగులు

అభివృద్ధికి అందరూ సహకరించాలి



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ డా.సురేఖ

అబిడ్స్, న్యూస్‌టుడే: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను గన్‌ఫౌండ్రి కార్పొరేటర్ డా.సురేఖ కలిశారు. లఖ్‌నవూ, ఇండోర్ మున్సిపాలిటీలను చూడడంతో పాటు అక్కడి మున్సిపల్ కమిషనర్లతో వివిధ అంశాలపై చర్చించామన్నారు. నగరంలో చెత్త లేకుండా మురుగు పారకుండా ప్రణాళికలను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగేట్లు చూడాలని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లు కలిసి పనిచేద్దామని సూచించారు.

బేగంబజార్: అసోంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు పర్యటిస్తున్నారు. అక్కడి పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, వైద్య ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన, యువత, ఉపాధి రంగం తదితర అంశాల్లో అధ్యయనం చేస్తున్నారు. బృందానికి జీహెచ్ఎంసీ భాజపా పక్షనేత, బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్ అధ్యక్షత వహించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత బిశ్వశర్మను సత్కరించారు.

మూసీ నిర్వాసితుల ధర్నా

చార్మినార్, న్యూస్‌టుడే: బహదూర్‌పుర మండల కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం కిషన్‌బాగ్, అసద్‌బాబానగర్ పరిసరాల్లోని మూసీ నిర్వాసితులు ధర్నా చేశారు. తమ నివాసాలకు అధికారులు రెడ్ మార్క్ చేశారని నిరసన వ్యక్తం చేశారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లను ఎలా వదిలిపెట్టి వెళ్లాలని బాధితులు వాపోయారు. కామాటిపుర, బహదూర్‌పుర పోసులు చేరుకుని నిరసనకారులు తహసీల్దారు కార్యాలయంలోనికి వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కిషన్‌బాగ్‌లోని అసద్‌బాబానగర్ మూసీ పరివాహక ప్రాంతాన్ని డిప్యూటీ కలెక్టర్లు అశోక్‌రెడ్డి, రవికుమార్, లావణ్యతో పాటు బహదూర్‌పుర, బండ్లగూడ, చార్మినార్, అంబర్‌పేట, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్లు సందర్శించారు. రెడ్ మార్క్ చేసిన బాధిత కుటుంబాలకు జంగమ్మెట్‌లో డబుల్ ఇళ్లు ఇస్తామని బహదూర్‌పుర తహసీల్దార్ కె.చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న 527 బాధిత కుటుంబాలకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. చార్మినార్ పరిధిలోని మూసీలో కూడా సర్వే పూర్తి చేశామని తహసీల్దారు నిహారిక తెలిపారు.



డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, తహసీల్దార్లు జ్యోతి, ప్రేమ్‌కుమార్‌లకు డిమాండ్ల ప్రతిని అందజేస్తున్న కార్పొరేటర్ దర్శన్, నేతలు

స్థానికేతరులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వొద్దని ఆందోళన

జియాగూడ, న్యూస్‌టుడే: జుమ్మేరాత్‌బజార్ దేవీనగర్ ఉప్పలమ్మ ఆలయ సమీపంలోని మూసీ ఒడ్డున ఉన్న కొన్ని నివాస గృహాలను హైడ్రా అధికారులు కూల్చివేయనున్నారు. అక్కడి 11 కుటుంబాలకు జియాగూడలో డబుల్ ఇళ్లను కేటాయించాలని కలెక్టర్, ఆర్డీవోల నుంచి ఆదేశాలు జారీ కావడంతో మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, ఆసిఫ్‌నగర్, నాంపల్లి తహసీల్దార్ జ్యోతి, ప్రేమ్‌కుమార్‌లతో పాటు అధికారులు దేవీనగర్ బాధిత కుటుంబాలను అక్కడికి పిలిపించారు. వారు తరలిరావడంతో జియాగూడలో ఇళ్లను స్థానికేతరులతో భర్తీ ఎలా చేస్తారంటూ స్థానికులు ఆందోళన చేపట్టి అధికారులను అడ్డుకున్నారు. నిరసనకారులకు కార్పొరేటర్ బోహిని దర్శన్, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎమ్.ప్రవీణ్‌కుమార్ (టింకు), తెదేపా నేత మంకాల శ్రీరాములు, భాజపా సీనియర్ నేతలు శివకుమార్‌యాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు మద్దతు తెలిపారు.

ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం



సూపరింటెండెంట్ డా.ఆనందాచార్య, ఆర్ఎంఓ డా.అనిల్‌కుమార్‌లను సన్మానిస్తున్న టీఎన్జీఓ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: కోఠిలోని ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డా.ఆనందాచార్యతో పాటు ఆర్ఎంఓగా బాధ్యతలు చేపట్టిన డా.అనిల్‌కుమార్‌లకు ఆసుపత్రి టీఎన్జీవో యూనిట్ శుక్రవారం సన్మానించింది. యూనిట్ అధ్యక్షుడు తూముకుంట రాజు ఆధ్వర్యంలో ప్రతినిధులు రవి, సునీల్, సంతోష్ తివారి, అశ్విన్, భాస్కర్, అజ్మత్ అలీ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ధూల్‌పేట: స్కూటీపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. సరఫరా చేసిన నలుగురితో పాటు 14 మంది కొనుగోలుదారులపై సైతం కేసు నమోదు చేశారు. ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ ఎన్.అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా స్కూటీపై 2.064 కిలోల గంజాయిని తీసుకెళ్తున్న సుశీల్‌కుమార్‌ను అరెస్టు చేశారు. నిందితుడిని విచారించగా అప్పర్ ధూల్‌పేటకు చెంది లడ్డూ, టి.వైష్ణోసింగ్, సోమసింగ్, సాగర్‌సింగ్‌లు గంజాయి సరఫరా చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఈ గంజాయిని 14 మందికి ఇవ్వడానికి తీసుకెళ్తున్నట్లు నిందితుడు వెల్లడించడంతో సరఫరా చేసిన నలుగురితో పాటు కొనుగోలుదారులుగా గుర్తించిన 14 మందిపై కూడా కేసులు నమోదు చేశామని వివరించారు. 30 గ్రాముల గంజాయిని రూ.2500 చొప్పున ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సీఐ జీడీ గోపాల్, ఎస్సై విష్ణు గౌడ్, హెచ్‌సీలు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్, పీసీలు ప్రకాశ్, మహేశ్‌లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు కప్ అందజేస్తున్న బండ్లగూడ జోన్ ఉప విద్యాశాఖాధికారి ఆదిత్యవర్ధన్ రాజు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(హెచ్‌డీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన బండ్లగూడ జోన్ స్థాయి కబడ్డీ, ఖోఖో టోర్నీ ముగిసింది. వివిధ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బండ్లగూడ జోన్ డిప్యూటీ డీఈఓ ఆదిత్య వర్ధన్ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశామని హెచ్‌డీఎస్‌జీఎఫ్ బండ్లగూడ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇ.శ్రీనునాయక్ తెలిపారు.

ఆన్‌లైన్ ఉద్యోగమని నమ్మించి.. రూ. 1.59 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగమని నమ్మించి మోసం చేశారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ వ్యక్తి తన టెలిగ్రామ్ ఖాతాలో ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగ ప్రకటన చూశాడు. అందులోని నంబరులో సంప్రదించాడు. అవతలి వ్యక్తి బాధితుడి వివరాలను సేకరించాడు. రోజువారీ వేతనంతో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చాడు. మరుసటి రోజు టెలిగ్రామ్ ద్వారా కాల్ వచ్చింది. రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించాడు. బాధితుడు వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యాడు. పని మొదలుపెట్టాడు. బాధితుడి చేత కొంత డబ్బు కట్టించుకొని, లాభాలు ఇచ్చారు. ఆ తర్వాత బాధితుడు రూ.1.59 లక్షలు పోగొట్టుకున్న తరువాత మోసపోయినట్లు గ్రహించారు.

గుడిమల్కాపూర్‌లో కళార్చన



మెహిదీపట్నం, న్యూస్‌టుడే: గుడిమల్కాపూర్‌లోని ప్రభుత్వ అన్నమాచార్య సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కళార్చన నిర్వహించారు. గాయకులు అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. పేరిణి, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్ సూపరింటెండెంట్‌కు సత్కారం



రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రవికుమార్‌ను ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ లాలూప్రసాద్, డాక్టర్ చంద్రయ్య, డాక్టర్ మాధురి తదితరులు శుక్రవారం సన్మానించారు.

గాంధీభవన్ మెట్రోస్టేషన్‌లో వైద్య సేవలు



నాంపల్లి: నాంపల్లి మెట్రో స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కేర్ ఆసుపత్రి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గాంధీభవన్ మెట్రోస్టేషన్ను కేర్ ఆసుపత్రి స్టేషన్‌గా నామకరణం చేశారు. శుక్రవారం ఆసుపత్రి ఆధ్వర్యంలో కేర్ మెడికల్ ఫెసిలిటీ హెల్త్ కేర్ సెంటర్‌ను ఆసుపత్రి సీఈవో జస్‌దీప్‌సింగ్ ప్రారంభించారు. సీవోవో డాక్టర్ సమీ ఉన్నారు.

రాజేంద్రనగర్

• రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, న్యూస్‌టుడే: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు శుక్రవారం షాద్‌నగర్‌లోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో సందడి చేశారు. ఈ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారితో కలిసి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ అలరించారు. ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నేతలు, ఇతర మహిళలు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారాల్లో ప్రోత్సహించాలి: ఎంపీ


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మహిళలను వ్యాపారాల్లో ప్రోత్సహించడం ద్వారా మహిళా సాధికారత సాధించడానికి అవకాశం ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్‌లో శుక్రవారం జస్టిస్ కొండామాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మహిళాసాధికారతతోనే భారతదేశ సాధికారత' అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వ నైపుణ్య శిక్షకురాలు పర్ణానా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లోనూ విజయవంతంగా రాణిస్తున్నారని, వారికి మరిన్ని అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహించడం ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని దేశాభివృద్ధికి బాటలు వేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, ఎన్. మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

బండ్లగూడజాగీర్: హిమాయత్‌సాగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ పీఅండ్‌టీ, హైదర్షాకోట్, భాగ్యనగర్, సన్‌సిటీ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

మొక్కల పెంపకం అలవాటుగా మారాలి



పెంజర్ల పాఠశాలలో మొక్కలు నాటిన ఉద్యోగులు

కొత్తూరు: మొక్కల పెంపకాన్ని విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలని మండల విద్యాధికారి అంగూర్ నాయక్ అన్నారు. సమర్థనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 180 మంది పీడబ్ల్యూసీ సాఫ్ట్‌వేర్ సంస్థ ఉద్యోగులు పెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించాలి

కేశంపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి దాని వికాసానికి వారిని ప్రోత్సహించాలని తహసీల్దారు అజాంలీ, ఎంఈవో చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను వారు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. వివిధ అంశాలకు సంబంధించి తయారు చేసిన నమూనాలను చూసి అభినందించారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా నాజర్‌అలీ



కొందుర్గు, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ కొందుర్గు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా నాజర్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా వంశీధర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా రజిత, కార్యదర్శిగా లింగయ్య ఎన్నికయ్యారు.

పోరాటం ముగిసె.. రైతన్నలు మురిసె

కాలుష్యకారక పరిశ్రమలపై రెండు దశాబ్దాలుగా ఉద్యమం ● ఏడాదిలోగా తరలించాలని తీర్పు వెల్లడించిన హైకోర్టు

కేశంపేట, కొత్తూరు, షాద్‌నగర్, న్యూస్‌టుడే: కాలుష్యం నుంచి విముక్తి కావాలంటూ రైతన్నల దశాబ్దాల పోరాటం.. వారి తరఫున ఓ న్యాయవాది సుమారు రెండు దశాబ్దాలుగా ఆరాటం.. ఎట్టకేలకు ఏడాదిలోపు కాలుష్య పరిశ్రమలను నివాస ప్రాంతాల నుంచి తరలించాలంటూ హైకోర్టు ఇటీవల తీర్పునివ్వడంతో రైతన్నల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. అయితే ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా కోర్టు తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ఇక అధికారులపై ఉంది.


న్యాయవాది వీరేందర్‌రెడ్డిని సత్కరించి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సమస్య ఇలా.. షాద్‌నగర్ నియోజకవర్గంలో వందకు పైగా పరిశ్రమలుండగా వాటిలో 26 కాలుష్య కారకమయ్యేవి ఉన్నాయి. ఇందులో ఎక్కువగా ఐరన్, స్పాంజ్ పరిశ్రమలతో కాలుష్యం ఉత్పన్నమవుతుండగా బ్యాటరీ, రసాయన పరిశ్రమలతో కూడా ఈ బాధ ఉంది. ఈ పరిశ్రమల కారణంగా షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని 32 గ్రామాల్లో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల రసాయనాల కారణంగా పంటలు ఎండిపోవడం, గింజలు నలుపు రంగులోకి మారడం, చెరువులు కలుషితం కావడం, ఈ నీటిని తాగి పశువులు మరణించడం, జనం, కార్మికులు రోగాలబారిన పడడం వంటి అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. కాలుష్యం వెలువడకుండా పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పరిశ్రమల వెదజల్లే కాలుష్యాన్ని గుర్తించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాలపై వాయు నాణ్యతను గుర్తించే పరికరాలు ఏర్పాటు చేసినా అవి వృథాగా ఉన్నాయి.


కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో వృథాగా వాయు నాణ్యత గుర్తింపు పరికరాలు

పోరాటం ఇలా.. కాలుష్య పరిశ్రమలతో ఏర్పడే ఇబ్బందులపై రైతులు ఎప్పటి నుంచో పోరాటం చేస్తుండగా వీరికి న్యాయవాది వీరేందర్‌రెడ్డి జత కలిశారు. 2005లో కేశంపేట మండలం ఇప్పలపల్లి పరిధిలోని కాలుష్య పరిశ్రమపై పోరాటం ప్రారంభించిన ఆయన షాద్‌నగర్ నియోజకవర్గం, ప్రస్తుత పాలమూరు జిల్లా పరిధిలోని బాలానగర్ మండల కాలుష్య పరిశ్రమలపై హైకోర్టులో పిటిషన్ వేశారు. 19 సంవత్సరాల పోరాటం తర్వాత పరిశ్రమలను తరలించాలంటూ కోర్టు ఇటీవల తీర్పు వెల్లడించింది. దీనిపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం హైదరాబాద్‌లోని వీరేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను సత్కరించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి పరిశ్రమలను ఇక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇన్నేళ్ల తమ పోరాటం ఫలించడంతో అన్నదాతల నుంచి కూడా హర్షం వ్యక్తమవుతోంది.

నియోజకవర్గంలోని కాలుష్య పరిశ్రమలు ఇలా..

మండలం	స్పాంజ్ ఐరన్	కెమికల్	బ్యాటరీ
షాద్‌నగర్	7	3	1
కొత్తూరు	6	4	2
నందిగామ	1	0	0
కేశంపేట	1	0	0
కొందుర్గు	1	0	0

మణికొండ, చేవెళ్ల, న్యూస్‌టుడే:

? గీతాంజలి స్కూల్ నుంచి స్కైలా అపార్ట్‌మెంట్ వరకు చాలా రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. –ప్రసాద్, విశ్రాంత ఉద్యోగి, మణికొండ

✓ వీధి దీపాలు వెలగని విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే చర్యలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తాను. – ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

? చేవెళ్ల సీపీఐ కాలనీలో విద్యుత్ దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు పనిచేయక కొన్ని రోజులుగా పట్టపగలు సైతం వెలుగుతున్నాయి. –రాజు, చేవెళ్ల

✓ వర్షాలు పడుతుండడంతో స్విచ్‌లు పనిచేయకపోవచ్చు. రెండుమూడు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. –రాఘవేందర్, గ్రామ కార్యదర్శి

స్వచ్ఛతకు ప్రాధాన్యమివ్వాలి: మేయర్

బండ్లగూడజాగీర్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని బండ్లగూడజాగీర్ మేయర్ ఎం.లత అన్నారు. స్వచ్ఛతాహీసేవా-24 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హిమాయత్‌సాగర్ జలాశయం కట్టపై శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీమేయర్ పి.రాజేందర్‌రెడ్డి, కమిషనర్ బి.శరత్‌చంద్ర, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభస్వామి గుట్టపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



మణికొండ: పర్యాటక దినోత్సవం సందర్భంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం మణికొండ పద్మనాభస్వామి గుట్టలో నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను, పిచ్చి మొక్కలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్వేతాకిరణ్‌కుమార్, పురుషోత్తం తదితరుల పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి


అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: అగ్నిమాపకశాఖ అధికారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఫైర్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన రెండు అగ్నిమాపక వాహనాలకు శుక్రవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో కాటేదాన్, గగన్‌పహాడ్‌లాంటి పారిశ్రామిక వాడలున్న కారణంగా వేసవిలో తరచూ ప్రమాదాలు సంభవిస్తుంటాయన్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే స్పందించకపోతే నష్టం వెలకట్టలేమని అన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన అగ్నిమాపక వాహనాలతో మరింత ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ రంగారెడ్డి జిల్లా అధికారి మురళీమనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్: మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో నిర్వహించే దేవీ నవరాత్రులకు సంబంధించి శుక్రవారం మధుబన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేసి మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

కొత్తూరు: పారిశుద్ధ్య సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్య అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు డాక్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: నందిగామలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నందిగామ, మామిడిపల్లి, వీర్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు స్రవంతి, రాజశేఖర్, చంద్రశేఖర్, సునిత, స్వరూప తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శేరిగూడ గ్రామస్థులు

శంకర్‌పల్లి(చేవెళ్ల): ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ శంకర్‌పల్లి మండలంలోని శేరిగూడ గ్రామస్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామంలో సర్వేనంబర్ లేని సుమారు 50 ఎకరాల నదీ నాలా బందీ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల దృష్టికి తెచ్చినా కబ్జాలను అడ్డుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించడంతో పాటు విలువైన భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు.

అమ్మ పేరుతో మొక్కను నాటాలి


మొక్క నాటి నీరు పోస్తున్న సుష్మారెడ్డి

శంషాబాద్: ప్రతి ఒక్కరు విధిగా అమ్మ పేరుతో ఓ మొక్కను నాటి సంరక్షించాలని శంషాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొలన్ సుష్మారెడ్డి పేర్కొన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ దేవరంపల్లి పుష్పలతారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ గోపాల్‌యాదవ్, సుమన్‌రావు, పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి, భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వరాష్ట్ర ఉద్యమంలో లక్ష్మణ్ బాపూజీ కృషి ఎనలేనిది


షాద్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న నవీన్‌రెడ్డి, అంజయ్యయాదవ్

చేవెళ్ల, కాటేదాన్, మణికొండ, షాద్‌నగర్, షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కృషి మరువలేనిదని పలువురు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, ఎమ్మెల్యే నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్ వేర్వేరుగా తదితరులు పాల్గొన్నారు. చేవెళ్లలో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అనంత్ రెడ్డి, కృష్ణ గౌడ్, శ్రీనివాస్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు. మణికొండ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఛైర్మన్ కస్తూరి నరేందర్, వైస్ ఛైర్మన్ కె.నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కస్తూరి నరేందర్, కె.నరేందర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ తదితరులు

ఫిరంగి నాలాను పునరుద్ధరించాలి: తెదేపా

శంషాబాద్: నిజాం కాలంలో రంగారెడ్డి జిల్లాకు గుండెకాయలా ఉన్న ఫిరంగి నాలాను నేడు పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని తెదేపా రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో శుక్రవారం తెదేపా బృందం మండల పరిధిలోని ఫిరంగి నాలా రాతి కట్టడాలను పరిశీలించారు. పిల్లోనిగూడలో నందుల కత్వ వద్ద శివలింగానికి పూజలు చేసి మాట్లాడారు. జిల్లాలో 80 కి.మీ మార్గంలో నిజాం సర్కార్ నిర్మించిన ఫిరంగి నాలా 50కి పైగా చెరువులు, కుంటలకు వరద పారేలా అనుసంధానంగా ఉందన్నారు. ఫిరంగి నాలాను పాలకులు పట్టించుకోకపోవడంతో కబ్జాలకు గురవుతుందన్నారు. ఈ నాలా పునరుద్ధరణ కోసం రేవంత్ సర్కార్‌కు లేఖ రాస్తామని తెలిపారు. కార్యక్రమంలో సామ భూపాల్‌రెడ్డి, కృష్ణమాచారి, రాఘవులు, రాంరెడ్డి, బోకుల రాజు, గణేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు రుణమాఫీ చేయాలి

శంషాబాద్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని చిన్నగోల్కొండ పీఏసీఎస్ ఛైర్మన్ బి.దవనాకర్‌గౌడ్ కోరారు. శుక్రవారం పీఏసీఎస్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నగోల్కొండ పీఏసీఎస్‌లో సభ్యత్వం తీసుకున్న 373 మంది రైతుల్లో 171 మందికి రుణ మాఫీ అయిందన్నారు. మిగతావారు రుణమాఫీ నిధుల విడుదల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, బాల్య, విజయలక్ష్మి, మోహన్‌రావు, పాల్గొన్నారు.

పిడుగు బాధితుడికి పాడి పశువుల అందజేత


ఆవును బాధితుడికి అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్, న్యూస్‌టుడే: పిడుగుపాటుకు గురై రెండు పాడి పశువులను పోగొట్టుకున్న ఫరూక్‌నగర్ మండలం రంగంపల్లికి చెందిన లింగంయాదవ్‌కు దాతల సహకారంతో పాడి పశువులు చేకూరాయి. బాధితుడికి సాయం చేయాలంటూ హలోషాద్‌నగర్ నిర్వాహకుడు ఎండీ ఖాజాపాషా ఇచ్చిన పిలుపునకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తన వద్ద ఉన్న ఆవును ఆయనకు ఇచ్చారు. అలాగే చటాన్‌పల్లికి చెందిన భారాస నేత నందారం అశోక్‌యాదవ్ రూ.లక్ష విలువైన జర్సీ ఆవును కొనిచ్చారు. అలాగే కొందరు దాతలు కలిసి రూ.22,500 నగదును బాధితుడికి అందజేశారు.

డీసీసీబీ కో ఆప్షన్ సభ్యుడిగా మోహన్‌రావు


మంచర్ల మోహన్‌రావుకు నియామక పత్రం అందజేస్తున్న సబితారెడ్డి

శంషాబాద్, న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) కో ఆప్షన్ సభ్యుడిగా శంషాబాద్ మున్సిపల్ పరిధి పోశెట్టిగూడకు చెందిన మంచర్ల మోహన్‌రావు(చిన్న గోల్కొండ పీఏసీఎస్ డైరెక్టర్) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మాజీ మంత్రి పి.సబితారెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. భారాస బలోపేతానికి నిస్వార్థంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలను అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డి.జయమ్మ, కార్తిక్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, మహేశ్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో ప్రపంచానికి దిక్సూచిగా భారత్


సభ్యత్వ నమోదులో మాజీ ఎమ్మెల్యే రత్నం

షాబాద్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో గత పదేళ్లలో మన దేశం ప్రపంచానికి దిక్సూచిగా మారిందని మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం అన్నారు. శుక్రవారం షాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. భాజపాలో సామాన్యులు కూడా ప్రధాని పదవిని చేపట్టగలరనడానికి మోదీయే నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో కిరణ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సతీష్ రెడ్డి, మానయ్య, మహేశ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

కేశంపేట: క్షేత్రస్థాయి నుంచి భాజపాను బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బైర్‌ఖాన్‌పల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, నర్సింగ్, అశోక్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం: భాజపా

కొందుర్గు, న్యూస్‌టుడే: బూత్‌స్థాయి నుంచి భాజపాను బలోపేతం చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సభ్యత్వ ప్రముఖ్ చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పర్వతాపూర్, బైరంపల్లి గ్రామాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బల్వంత్‌రెడ్డి, సుధాకర్, అశోక్, చంద్రయ్య పాల్గొన్నారు.

రహదారి నిండా నీరే



వర్షం పడిందంటే ఆ రహదారిలో ఆ ప్రదేశమంతా నీటితో మునుగుతోంది. అక్కడే మలుపులు ఉండటంతో ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతోంది. వర్షం పడిన ప్రతిసారి కేశంపేట-షాద్‌నగర్ ప్రధాన రహదారిలో ఇప్పలపల్లిలో కనిపించే దృశ్యమిది. నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ఈ మార్గంలో నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కేశంపేట

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

షాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పరిగి మాజీ జడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య, ఎంఈవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఆయన తన అంకిత ఫౌండేషన్ ద్వారా ఎల్గొండగూడ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, పాదరక్షలు, యోగా మ్యాట్‌లను పంపిణీ చేశారు.

చేవెళ్లలో వీధి కుక్క స్వైర విహారం

చేవెళ్ల: చేవెళ్లలోని ఇంద్రారెడ్డి చౌరస్తాలో శుక్రవారం ఓ వీధి కుక్క స్వైర విహారం చేసింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వారి వెంటపడి భయభ్రాంతులకు గురిచేసింది. సూరత్‌సింగ్, శంకర్‌నాథ్‌లను కాటు వేయడంతో వెంటనే స్థానికులు వారిని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. చేవెళ్లలో ఇటీవల కుక్కల బెడద విపరీతంగా పెరిగింది. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మరణంలోనూ వీడని బంధం


రాములమ్మ, శివమ్మ

షాబాద్, న్యూస్‌టుడే: తల్లీకుమార్తె బంధం విడదీయరాదనడానికి ఈ సంఘటనే నిదర్శనం. షాబాద్ మండలం మాచనపల్లికి చెందిన కోళ్ల రాములమ్మ(70)కు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తె శివమ్మ (55)ను ముప్పై ఏళ్ల క్రితం పోతుగల్‌కి చెందిన జంగయ్యకు ఇచ్చి పెళ్లి చేశారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు జన్మించాక భర్త వదిలి పారిపోవడంతో ఇరవయ్యేళ్ల నుంచి తల్లి రాములమ్మతో కలిసి మాచనపల్లిలోనే ఉంటోంది. ఇటీవల ఆమె అనారోగ్యం బారిన పడడంతో రెండురోజుల క్రితం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. కుమార్తె ఆరోగ్యం క్షీణించిందనే దిగులుతో రాములమ్మ శుక్రవారం మృతి చెందింది. ఆమె చనిపోయిన కొద్దిసేపటికే శివమ్మ కూడా ఆసుపత్రిలో మృతి చెందింది. వారిద్దరి అంత్యక్రియలు స్వగ్రామమైన మాచనపల్లిలో నిర్వహించారు. తల్లీకుమార్తె ఇద్దరూ ఒక్కరోజే చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొనసాగిన జానీ మాస్టర్ కస్టడీ విచారణ

నార్సింగి, న్యూస్‌టుడే: నృత్యదర్శకుడు జానీ మాస్టర్ కస్టడీ విచారణ మూడో రోజు కొనసాగింది. ఉదయం నుంచి పోలీసు అధికారులు వివిధ కోణాల్లో ఆయన్ను ప్రశ్నించి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ప్రధాన ఆరోపణలను నిందితుడు ఖండించినట్లు తెలిసింది. నేరం జరిగినట్లు ఆరోపణల్లో పేర్కొన్న ప్రదేశాలకు నిందితున్ని తీసుకెళ్లి విచారించే అవకాశం లేనట్లు సమాచారం. అది జరిగి ఏళ్లు గడిచిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

గ్రామస్థులను మోసం చేసిన వ్యక్తి రిమాండ్

నందిగామ: గ్రామస్థుల దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకుని ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నందిగామ ఎస్సై గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన మధుసూదన్ అదే గ్రామానికి చెందిన 22 మంది వద్ద రూ.2.63 కోట్లు వడ్డీకి తీసుకున్నాడు. ఏళ్లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులతో మహిళ ఆత్మహత్య

కాటేదాన్, న్యూస్‌టుడే: భర్త అత్తామామల వేధింపులు తట్టుకోలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవుపల్లి ఠాణా పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ వివరాల ప్రకారం.. పద్మశాలిపురం సాయికాలనీలో నివసించే ముఖేష్ బాటి(32), పూజా బాటి(31)లు 2012లో వివాహం చేసుకున్నారు. మూడేళ్లుగా భార్యపై అనుమానం పెంచుకున్న ముఖేష్‌తో పాటు మామ బాలకిషన్ బాటి, అత్త చంపా బాటిలు ఆమెను మానసికంగా వేధిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక శుక్రవారం పూజాబాటి తన గదిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త, అత్తామామలే కారణమని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిలకమర్రి నరసింహపై చర్యలకు డిమాండ్


శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

శంషాబాద్, న్యూస్‌టుడే: స్వార్థ ప్రయోజనాల కోసం ముచ్చింతల్‌లో గొడవలు సృష్టిస్తున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గ్రామ మాజీ సర్పంచులు బీర్ల పెంటయ్య, వడ్డె సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయం ఎదుట స్థానికులతో కలిసి వారు ఆందోళన చేశారు. ఆ తర్వాత డీసీపీ రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. కొంత మంది వ్యక్తిగత కక్షలతోనే నరసింహతో ఘర్షణ పడ్డారని, ఈ గొడవలకు సంబంధం లేని మైహోం గ్రూప్ యాజమాన్యంపై ఠాణాలో ఫిర్యాదు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మై హోం సంస్థ సొంత నిధులతో ముచ్చింతల్‌ను దశల వారీగా అభివృద్ధి చేస్తున్న విషయాన్ని మరవద్దన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

జల్‌పల్లి పెద్ద చెరువు సందర్శించిన ఎమ్మెల్యే



పెద్దచెరువు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కమిషనర్ వాణిరెడ్డి, చైర్మన్ అబ్దుల్లాసాదీ

జల్‌పల్లి, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో జల్‌పల్లి పెద్దచెరువు పొంగి పొరుతున్న వరదల నుంచి జల్‌పల్లి శంషాబాద్ విమానాశ్రయ పీ7 రహదారిని కాపాడాలని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబిత రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె చెరువును సందర్శించారు. గతంలో చెరువు సుందరీకరణకు మంజూరై నిలిచిన రూ.9 కోట్ల నిధులను ఈ ప్రభుత్వం తిరిగి అందించాలన్నారు. మరోవైపు పురపాలికలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలిక కమిషనర్ వాణిరెడ్డి, చైర్మన్ అబ్దుల్లా సాదీ, నియోజకవర్గ భారాస ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాంజాల జనార్దన్, పార్టీ యూత్ అధ్యక్షులు ఇద్రిస్ తదితరులు పాల్గొన్నారు.

గౌరెల్లిలో అరుదైన నల్ల తాబేలు



జనావాసాల్లోకి వచ్చిన తాబేలు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా మూసీ పరివాహక గ్రామం గౌరెల్లిలో అరుదైన రకం నల్ల తాబేలు జనావాసాల్లో ప్రత్యక్షమైంది. గౌరెల్లి గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం పరిసరాల్లో గురువారం రాత్రి వేళ పూర్తిగా నల్లగా ఉన్న తాబేలును స్థానికులు గుర్తించారు. ఈ తాబేలు సమీపంలోని వరి పొలాల్లో నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. దానిని యువజన సంఘం సభ్యులు సురక్షితంగా సమీపంలోని చేలల్లో వదిలి పెట్టినట్లు తెలిపారు. పూర్తిగా నల్లగా ఉండే రకం తాబేళ్లు ఈ ప్రాంతంలో కనిపించడం అరుదని పశువైద్యాధికారి నర్సింహారావు చెప్పారు.

రైతులకు రూ.4 కోట్ల పంట రుణాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: దండుమైలారం సహకార సంఘం పరిధిలోని రైతులకు రూ.4 కోట్ల పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడం జరిగిందని ఛైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సంఘం పనితీరు ఆదర్శంగా ఉందని ప్రభుత్వం మూడు ఎకరాల భూమి కేటాయించడంతో అందులో ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ఫంక్షన్ హాలు, గోదాం నిర్మాణం చేస్తామని చెప్పారు. జిల్లా మేనేజర్ నవీన్‌కాంత్‌రెడ్డి, జిల్లా అధికారిణి సరస్వతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాలాపూర్: బాలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి సభ్యులు తగిన సహకారం అందించాలని అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి కోరారు. సంఘం 49వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం బాలాపూర్‌లో నిర్వహించారు. సీఈఓ ఎర్ర జైహింద్ వార్షిక నివేదిక చదివారు. మేయర్ చిగురింత పారిజాత, ఉపాధ్యక్షుడు కొలను తిరుపతి రెడ్డి, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

రూ.280 కోట్ల ఆదాయం.. అయినా అద్దె భవనమే!

• రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వసతులు కరవు • 29 ఏళ్లుగా అదే తీరు

మహేశ్వరం, న్యూస్‌టుడే: భూముల క్రయ, విక్రయాల ద్వారా మహేశ్వరం రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లు తెచ్చి పెడుతోంది. ఈ కార్యాలయం పరిధిలో మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్, తుక్కుగూడ తదితర ప్రాంతాలు వస్తాయి. ఇంత పరిధి ఉన్నా.. కార్యాలయంలో కనీస వసతులు లేవు. మహేశ్వరంలో వివిధ రకాల ఆస్తులకు రిజిస్ట్రేషన్లు కాగా.. వాటి ద్వారా ఈ ఏడాది సుమారు రూ.280 కోట్ల ఆదాయం సమకూరింది. వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

సొంతభవనం లేకుండా.. మహేశ్వరంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో రిజిస్ట్రేషన్ శాఖకు భారీగా ఆదాయం సమకూరుతోంది. తనఖాల ద్వారా ఆదాయం, బాకీ చెల్లించిన తర్వాత తనఖా విడుదలకు డబ్బు చెల్లించాల్సిందే. ఇలా ఏ లావాదేవీ నిర్వహించినా శాఖకు అదనపు ఆదాయమే. దశాబ్దకాలంలో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం సమకూరింది. సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పడి 29 ఏళ్లు అవుతున్నా.. ఇప్పటికీ సొంతభవనం లేదు.



మహేశ్వరం రిజిస్ట్రేషన్ కార్యాలయం

పార్కింగ్ సమస్య.. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రోజూ సుమారు 300-450 మంది వస్తుంటారు. వీరిలో చాలా మంది కార్లు, ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. కార్యాలయం వద్ద పార్కింగ్ వసతి లేక వీరంతా సమీపంలో రోడ్డుపైనే పెడుతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. తాగడానికి కనీసం మంచినీళ్లు ఉండట్లేదు. ఇక్కడ మూత్రశాలలు, మరుగుదొడ్లు వసతి కల్పించాలని మహిళలు కోరుతున్నారు.

సమస్య మంత్రికి వివరించాం

– శ్రీకాంత్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్, మహేశ్వరం

గత నెలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో ఇక్కడ సమస్యలు వివరించాం. సొంత భవనం లేదని తెలిపాం. అన్ని హంగులతో కొత్త భవనం నిర్మిస్తామని మంత్రి ప్రకటించారు. దీనికి అనుగుణంగా భూకేటాయింపు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థలం కేటాయింపు జరిగితే.. వచ్చే ఏడాదికి భవనం సమకూరే అవకాశం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఆర్కేపురం, కందుకూరు, న్యూస్‌టుడే:

? సిరినగర్ కాలనీలోని భాగ్యనగర్ ఫంక్షన్ హాలు నుంచి శివాలయం వెళ్లే మార్గంలో పక్షం రోజులైనా పోగుపడిన వ్యర్థాలు తొలగించడం లేదు.
– శివాని, సిరినగర్ కాలనీ

✓ వెంటనే తొలగిస్తాం. – సుజాత, సరూర్ నగర్ డీసీ

? కందుకూరు మండల కేంద్రంలో 9వ వార్డులో రోడ్లను పంచాయతీ సిబ్బంది చాలా రోజులుగా ఊడ్చక పోవడంతో తీవ్ర అపరిశుభ్రంగా మారాయి. – శ్రీనివాస్, కందుకూరు మండల కేంద్రం

✓ పరిశీలించి రోడ్లు శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడతాం.
– సురేందర్, పంచాయతీ కార్యదర్శి

భాజపా నేత కుటుంబానికి త్రిపుర గవర్నర్ పరామర్శ



లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట్ మాజీ సర్పంచి, భాజపా సీనియర్ నాయకుడు వడ్డేపల్లి పాపయ్యగౌడ్ నివాసానికి శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి విచ్చేశారు. ఇటీవల పాపయ్యగౌడ్ తల్లి లక్ష్మమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న గవర్నర్ స్వయంగా ఆయన నివాసానికి వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. జిల్లా, మండల నాయకులు విష్ణుగౌడ్, జంగమయ్యగౌడ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు



నాదర్‌గుల్‌లో డీఈ యాదయ్యతో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

బాలాపూర్, న్యూస్‌టుడే: నాదర్‌గుల్ నుంచి గాంధీనగర్ వరకు నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని బడంగ్‌పేట కార్పొరేషన్ డీఈ యాదయ్య తెలిపారు. నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులను ఆయన కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి, ఇంద్రసేనలతో కలిసి పరిశీలించారు. పనులు నిలిచిపోవడంతో పాటు డివైడర్ కోసం స్థలం వదిలిపెట్టడంతో రోడ్డును దాటే క్రమంలో వాహనాల జారిపడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కల్వర్టు వద్ద పైపులు కొంత మేర ధ్వంసమయ్యాయని, దీంతో వరద నీరు సక్రమంగా వెళ్లక ఎగువన ఉన్న ఇళ్లు ముంపునకు గురవుతున్నాయన్నారు. రహదారి విస్తరణ సమయంలో కల్వర్టును పెంచాలని కోరారు. త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తామని డీఈ చెప్పారు.

అధికారుల చొరవతో తొలగిన ప్రమాదం



హైమాస్ట్ విద్యుత్తు స్తంభం తొలగించి గ్రామ నాభిశిల వద్ద ఏర్పాటు చేయిస్తున్న పంచాయతీ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: అబ్దుల్లాపూర్‌మెట్‌లోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం సమీప కూడలిలో విద్యుత్తు (హైమాస్ట్) స్తంభం దిగువ తుప్పు పట్టి కూలే స్థితిలో ఉన్న వైనంపై 'ఈనాడు'లో శుక్రవారం 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించారు. అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీఓ శ్రీవాణి స్పందించి ప్రమాదకర స్తంభాన్ని తొలగించి సురక్షితంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దెబ్బతిన్న స్తంభాన్ని క్రేన్ సహాయంతో తొలగించి కూడలిలోని బొడ్రాయి వద్ద ఏర్పాటు చేయించారు. దీంతో ప్రమాదం తొలగడంతో పాటు నాభిశిల వద్ద వెలుగులకు అవకాశం ఏర్పడింది.

రోడ్డు అంచుల్లో మట్టితో చదును

ఈనాడు కథనాలకు స్పందన



రహదారి వెంట కోతకు గురైన ప్రాంతాల్లో మట్టి పోయిస్తున్న కేశెట్టి వెంకటేశ్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలతో పలు ప్రాంతాల్లో రహదారుల్లో గుంతలతో పాటు రోడ్డు అంచుల్లో కోతకు గురైన పరిస్థితిపై 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన 'కోతకు గురైనా నిర్లక్ష్యమేనా?' కథనానికి బాటసింగారం తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు కేశెట్టి వెంకటేశ్ స్పందించారు. బాటసింగారం గ్రామ పరిధి ఎన్‌హెచ్ 65 శివాజీ చౌక్ నుంచి గ్రామానికి ఉన్న మార్గంలో రోడ్డు వెంట కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో టిప్పర్‌తో మట్టి పోయించి డోజర్‌తో చదును చేయించారు. రహదారి వెంట ప్రమాదకర పరిస్థితిని వెలుగులోకి తీసుకువచ్చిన 'ఈనాడు'ను, సత్వరం స్పందించి సొంత డబ్బుతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన వెంకటేశ్‌ను గ్రామస్థులు, వాహనదారులు అభినందించారు.

వాటర్‌మెన్‌ల పాత్ర కీలకం

మంచాల, న్యూస్‌టుడే: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో వాటర్‌మెన్‌ల పాత్ర కీలకమని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ పావని అన్నారు. మంచాలలో నాలుగు రోజులుగా సాగుతున్న వాటర్‌మెన్‌ల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. మరమ్మతులు, లీకేజీలు, వాటర్ క్వాలిటీ, టెస్టింగ్, హ్యాండ్ పంపు రిపేర్లపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఎంపీడీఓ బాలశంకర్, ఉషారాణి, రూప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి డీఎస్‌పీ (ధర్మ సమాజ్ పార్టీ) కృషి చేస్తుందని పార్టీ జిల్లా కన్వీనర్ అమరేందర్ అన్నారు. శుక్రవారం కందుకూరులో 12 అంశాల పరిష్కార చర్యలపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను వసతి గృహాలను సందర్శించి సమస్యలపై సంపూర్ణ సమాచారాన్ని సేకరించి జిల్లా కలెక్టర్‌కు అందించాలన్నారు. పార్టీ నాయకులు శేఖర్, రాము, భాస్కర్, ప్రదీప్, మహిపాల్, అశోక్, స్వామి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో పంచాయతీ కార్యదర్శుల నిరసన

మంచాల, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యం పేరుతో సస్పెండ్ చేసిన ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్‌ను వెంటనే తొలగించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. చిన్న పొరపాటుకు సస్పెండ్ చేయడం తగదన్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి ఎంఈవోగా ఖానాపూర్ జీహెచ్‌ఎం చాంప్లనాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టిన ఆయనను వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీలు, సీఆర్పీలు సన్మానించారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు నలుగురి ఎంపిక

యాచారం: యాచారం జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. హెచ్‌ఎం నరసింహ, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. అండర్-17లో అలేఖ్య, అండర్-14లో కృషికా, సంధ్య, జాన్వి ఎంపికైనట్లు చెప్పారు.

'పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దు'

బాలాపూర్, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించొద్దని బాలాపూర్ మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌గుప్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సంఘం నేతలతో కలిసి శుక్రవారం బడంగ్‌పేటలో ర్యాలీ తీసి బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవికి వినతి పత్రం అందజేశారు.

'నందిహిల్స్‌లో బార్ ఏర్పాటుకు అనుమతివ్వొద్దు'

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌కాలనీ మెయిన్ రోడ్డు నంబరు 10లో బార్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని కాలనీవాసులు సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ఫయాజ్‌ను కాలనీవాసులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షుడు చల్లా సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద స్వచ్ఛతా హీ సేవ

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపాలిటి సిబ్బంది కలిసి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు పెద్ద తూం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

ప్రజా సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ దుర్గదీప్‌లాల్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవలో భాగంగా చేపట్టే కార్యక్రమాలపై సూచనలు చేశారు. మేనేజరు చంద్రప్రకాశ్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

28న లోక్ అదాలత్

మంచాల: ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో ఈ నెల 28న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంచాల సీఐ బాబ్యానాయక్ కోరారు. పలు రకాల చిన్న చిన్న కేసులు పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశమన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడాలనుకున్న వారు ముందుగా మంచాల పోలీసులను సంప్రదించాలని సూచించారు.

'హైడ్రా పేరుతో పేదలను ఇబ్బంది పెట్టొద్దు'

మంచాల: హైడ్రా పేరుతో పేదల బతుకులను ఛిద్రం చేస్తున్నారని భారాస మండల కార్యదర్శి బహదూర్ ఆరోపించారు. శుక్రవారం మంచాలలో విలేకర్లతో మాట్లాడారు. పేదల ఇళ్లు కూల్చి వేధింపులకు గురిచేయొద్దని కోరారు. హైడ్రాపై గ్రామస్థాయిలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు

ఘనంగా టూరిజం దినోత్సవం

మహేశ్వరం, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో పర్యాటక రంగానికి ప్రాముఖ్యత పెరుగుతుందని, ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. కె.చందన అన్నారు. శుక్రవారం కళాశాలలో యువ టూరిజం క్లబ్ కో-ఆర్డినేటర్ డా.జహీదాబేగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డా. ఇంతియాజుద్దీన్ ఫారుకి, శ్రీదేవి, నర్సింహులు, నరేందర్‌రెడ్డి, డా. శ్రీహరిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫార్మాసిటీపై సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి'

ఇబ్రహీంపట్నం: ఫార్మాసిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు, భారాస జిల్లా నాయకుడు ఏనుగు భరత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో భారాస నాయకులతో కలిసిమాట్లాడారు. గత ప్రభుత్వం వేలాది మంది చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఫార్మాసిటీ కోసం 19 వేల ఎకరాల్లో భూసేకరణ చేయగా.. ఇప్పుడు అక్కడ స్థిరాస్తి దందాకు ఆ భూములు వాడుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫార్మాసిటీని ఏర్పాటు చేయకపోతే తిరిగి ఆ భూములను రైతులకు ఇవ్వాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తేనే మనుగడ

యాచారం: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులో తక్కళ్లపల్లితండా నివాసి ఆంగోతు వెంకటేశ్ స్టీల్ సామగ్రిని జమ చేశారు. గ్రామ పంచాయతీలు, మండల కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో స్టీల్ బ్యాంకులో జమ చేసిన వస్తువులను వినియోగిస్తామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే ఉద్దేశంతో స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వెంకటేశ్‌ను ఎంపీడీవో సత్కరించారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే భవిష్యత్తు

బాలాపూర్: విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో మెలుగుతూ విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు సూచించారు. సమాజంలో విద్యార్థినులు, మహిళల పట్ల జరుగుతున్న నేరాలపై మీర్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం బడంగ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైద్యశిబిరాలతో పేదలకు మేలు

ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీవో వెంకటమ్మ, దండుమైలారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ భాను ప్రకాష్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు గ్రామంలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా రెండువందల మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల చేతులకు గ్లౌజులు, సబ్బులు, నూనె ప్యాకెట్లు ఉచితంగా అందజేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామ పరిధి ఉదయ్‌గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెద్దఅంబర్‌పేట్ విజయ ఆసుపత్రి ఆధ్వర్యంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, స్థానిక గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరంలో స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మాజీ వైస్‌ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచి సుజాతగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు 351 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను అందించారు. నెల రోజుల నుంచి కామినేని ఆసుపత్రి సహకారంతో తన ట్రస్టు నుంచి అన్ని గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యువకుడి బలవన్మరణం

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆమనగల్లు పట్టణం శ్రీనివాస కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్, స్థానికుల వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల మహేష్ (30) అనే యువకుడు భార్య శిరీష, కుమారుడు (చిన్న బాబు)తో కలిసి ఆమనగల్లులోని శ్రీనివాస కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉన్నట్టుండి రాత్రి 9 గంటల సమయంలో భార్య ఆరుబయట ఉండగా.. మహేష్ ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి మృతితో వీరన్నపల్లిలో విషాదం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం వీరన్నపల్లికి చెందిన యువకుడు బెక్కరి సుప్రీత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కుప్పగండ్ల గ్రామంలో నీటికుంటలో పడి గురువారం మృతి చెందడంతో విషాదం అలముకుంది. అతడి తండ్రి గోవర్ధన్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులను శుక్రవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులు పరామర్శించారు.


పదిమంది జూదరుల అరెస్టు

యాచారం: యాచారం మండలం చింతపట్లలో జూదం ఆడుతున్న పదిమంది శుక్రవారం పోలీసులకు పట్టుబడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద క్షేత్రం వద్ద పదిమంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.23 వేల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ శంకర్ కుమార్ చెప్పారు.

రేషన్ బియ్యం కేసుల్లో నిందితులపై పీడీ యాక్టు

కందుకూరు, న్యూస్‌టుడే: రేషన్ బియ్యం కేసుల్లో పట్టుబడ్డ వారిపై పీడీ యాక్టు ప్రకారం కేసు నమోదుతో జైలుకు పంపడం ఖాయమని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ తెలిపారు. శుక్రవారం కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో పీడీఎస్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వివరాలను సేకరించారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పట్టుబడితే పీడీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని చెప్పారు.

చిత్రాల ప్రదర్శనతో స్వచ్ఛతపై అవగాహన



స్వచ్ఛతపై విద్యార్థులు గీసిన చిత్రాలు ప్రదర్శిస్తూ..

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచేలా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ఆ చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మానవహారంగా ఏర్పడి విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడంతో పాటు గ్రామస్థులకు అవగాహన కలిగేలా నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు దశరథ్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి రమేష్, ఈసీ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ చిలకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో నివాళులర్పిస్తున్న పుర ఛైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వెంకట్రామ్, కౌన్సిలర్లు



మహేశ్వరంలో నివాళులు అర్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలిసంఘు నాయకులు



మీర్‌పేట చందనచెరువు కట్టపై విగ్రహావిష్కరణలో సబితా ఇంద్రారెడ్డి తదితరులు

ఉద్యమాల ఊపిరి.. కొండా లక్ష్మణ్ బాపూజీ

న్యూస్‌టుడే బృందం: స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ విముక్తి పోరాటం.. మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించిన అలుపెరగని ధీరుడు కొండాలక్ష్మణ్ బాపూజీ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఘన నివాళులు అర్పించారు.



ఆదిభట్ల: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శశాంక



తుర్కయంజాల్ పురపాలక సంఘ కార్యాలయంలో..



మీర్‌పేటలో విప్రసంగిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బాలాపూర్: బడంగ్‌పేటలో నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాత తదితరులు



పెద్దఅంబర్‌పేట్ పురపాలిక కార్యాలయం వద్ద..

సందడిగా స్వాగతోత్సవాలు



గిరిజన వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన

కందుకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం కందుకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవం నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆట పాటలతో స్వాగతం పలికారు. డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గేయాలతో ఉల్లాసంగా గడిపారు. ప్రిన్సిపల్ మంగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాడ్గుల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అభ్యుదయ భారతి ఫౌండేషన్ ఛైర్మన్ సూదిని పద్మారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. . ఈ ఏడాది ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో వివిధ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సబెరా ఖాతూన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు బస్తీల్లో తనిఖీలు



బస్తీలో యువకులను విచారిస్తున్న ఏసీపీ బృందం

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు బాలాపూర్ పోలీసులు ఠాణా పరిధిలోని వాది ఎ సాలిహీన్ బస్తీలో విజువల్ పోలీసింగ్ నిర్వహించారు. ఠాణా పోలీసు బలగాలతో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి రెండుగంటల పాటు తనిఖీలు చేపట్టారు. వీధుల్లో కూర్చుని వివాదాలు సృష్టిస్తున్న యువతను, వలస కార్మికులను హెచ్చరించారు. మరోమారు రాత్రిళ్లు బయట కనిపిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జల్‌పల్లి పురపాలికలోని వాది ఎ సాలిహీన్, రాయల్‌కాలనీ, షాహిన్‌నగర్ పరిసరాల్లో బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలసగా వచ్చిన కార్మికులు నివసిస్తున్నారన్నారు. నిత్యం రాత్రిళ్లు వీధుల్లో బైఠాయించి మద్యం మత్తులో పరస్పరం వివాదాలకు దిగుతుండటంతో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయన్నారు. కమిషనర్ ఆదేశాలతో దృష్టిసారించి నిత్యం ఓ బస్తీలో విజువల్ పోలీసింగ్ చేపడుతున్నట్లు చెప్పారు.

మత్తులో హత్యలు.. అడ్డొస్తే గొడవలు

నగరంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్

ఈనాడు, హైదరాబాద్ రాంనగర్, న్యూస్‌టుడే

● బాగ్‌లింగంపల్లిలో గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు పాత నేరస్తులు పాన్ దుకాణంలోకి వెళ్లి గొడవపడ్డారు.

● బోలక్‌పూర్‌లో ఇద్దరు యువకులు మత్తుపదార్థం తీసుకొని వీరంగం వేశారు.

● తాజాగా ముషీరాబాద్ పరిధిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని గంజాయి మైకంలో జోగుతున్న యువకుడు కత్తితో పొడవటంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



పాన్‌దుకాణం యజమానిపై మత్తులో దాడి చేస్తున్న యువకుడు

నగరంలో చోటుచేసుకున్న ఘటనల్లో ఇవి కొన్ని మాత్రమే. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముఠాలకు కళ్లెం వేయటం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

● ఏపీ, ఏవోబీ ఏజెన్సీ ప్రాంతాలనుంచి నగరానికి రోజుకు 100కిలోల గంజాయి వివిధ మార్గాల్లో చేరుతున్నట్టు అంచనా. దూల్‌పేట్, మంగళ్‌హాట్ అడ్డాగా సాగుతున్న దందాకు అడ్డుకట్ట వేసేందుకు అబ్కారీ, పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తున్నా పూర్తిస్థాయిలో సానుకూల ఫలితాలు రావడం లేదు. ● నగరంలో నెలలోనే నాలుగు చోట్ల గొడవలు, రెండు హత్యలు, 10కి పైగా జరిగిన రోడ్డు ప్రమాదాలకు గంజాయి మత్తే కారణంగా పోలీసులు నిర్ధారించారు.

● రాష్ట్రంలో సుమారు 40 వేల మంది డ్రగ్స్‌కు బానిసలైనట్టు టీజీన్యాబ్ నిర్ధారించింది. వీరిలో 25 వేల మంది మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో ఉన్నట్టు అంచనా.

ఖాళీ జాగాలే అడ్డాలు

● మత్తుకు దగ్గరైన వారిలో చాలామందిని కుటుంబాలు దూరంగా ఉంచుతున్నాయి. వీరంతా మెట్రో పిల్లర్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండులు, శ్మశానాలు, పబ్లిక్‌గార్డెన్, పార్కుల్లో మకాం వేస్తున్నారు. ● ముషీరాబాద్, చిక్కడపల్లి, గాంధీనగర్ పరిధిలో రేయింబవళ్లు గంజాయి పీల్చుతూ దారెంట వెళ్లే వారిని బెదిరిస్తున్న ముఠాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఎప్పటికప్పుడు అదుపులోకి తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. ● కుటుంబానికి దూరంగా ఉంటూ కూలీ చేసుకుంటూ విభాగినులు, పాదచారి మార్గాల్లో ఉండే యువకులను మత్తుముఠాలు ఏజెంట్లుగా మార్చుకుంటున్నాయి. ● అర్ధరాత్రి, తెల్లవారుజాము సమయాల్లో ఈ ముఠాలు గంజాయి ప్యాకెట్లను వీరికిచ్చి కొనుగోలుదారులకు చేరవేస్తున్నాయి. కమీషన్‌గా రూ. 200-300 నగదు, 5 గ్రాముల గంజాయి ఇస్తున్నారు.

ధన్వంతరి మోసానికి సీసీఎస్ చికిత్స!

● రూ.514 కోట్ల విలువైన ఆస్తుల అటాచ్‌మెంట్

● బాధితులకు న్యాయం జరిగేలా ఏర్పాట్లు



ఈనాడు, హైదరాబాద్: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్(డీఎఫ్ఐ)లో కాస్త సొమ్ము చెల్లించి భారీగా లాభపడొచ్చని చెప్పిన మాటలు నిజమని వేలాది మంది నమ్మారు. ఎన్నో ఏళ్ల కష్టార్జితాన్ని ట్రస్ట్‌ల్లో పెట్టుబడిగా పెట్టి నట్టేట మునిగిపోయారు. డాక్టర్ పి.కమలాకరశర్మ వ్యవస్థాపక ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీగా ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన తమ వర్గానికి చెందిన వారికి అండగా నిలిచేందుకు ట్రస్ట్ ఏర్పాటుచేసినట్టు నమ్మించారు. స్వయంవరం, ఉపాధిశిక్షణ, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య సేవలు అందిస్తామంటూ ఊదరగొట్టారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే నెలవారీ అధిక వడ్డీలు చెల్లిస్తానంటూ ప్రచారం చేశారు. దీంతో విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులు, వయోధికులు భవిష్యత్ అవసరాల కోసం కష్టార్జితాన్ని ట్రస్ట్‌లో పెట్టుబడి పెట్టారు. కొద్దికాలం 3 నెలలకోసారి సక్రమంగా వడ్డీలు చెల్లించినా.. తరువాత ముఖం చాటేశారు. సభ్యులు ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి ఈ ఏడాది నగర సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్‌చేశారు. దర్యాప్తు ఆలస్యమవుతోందంటూ బాధితులు ఇటీవల సీసీఎస్ ఎదుట ఆందోళన నిర్వహించారు. సీసీఎస్ డీసీపీ శ్వేత బాధితులతో మాట్లాడి భరోసా ఇచ్చారు.

బాధితుల గగ్గోలు: వేలాది మంది సుమారు రూ.1500 కోట్ల మేర ట్రస్ట్‌కు చెల్లించినట్టు ఆధారాలు చూపుతున్నారు. కొంతకాలం సజావుగానే వడ్డీలు చెల్లించడంతో నమ్మామని ఓ విశ్రాంత ఉద్యోగి వాపోయారు. దాచుకున్న డబ్బంతా మోసగాళ్ల చేతిలో పోసి ప్రస్తుతం మాత్రలు కొనుక్కునేందుకు బిడ్డలవద్ద చేయి చాపాల్సి వస్తోందంటూ మరో వయోధికురాలు కన్నీరుపెట్టుకున్నారు. బాధితుల సొమ్ము తిరిగిప్పించేందుకు సీసీఎస్ పోలీసులు సిద్ధమయ్యారు. నగర సీపీ సీవీ ఆనంద్ దర్యాప్తుపురోగతిని సమీక్షించి సత్వర చర్యలకు ఆదేశించినట్టు సమాచారం.

ఆస్తుల విక్రయంతో న్యాయం: డీసీపీ శ్వేత

ధన్వంతరిలో 31 కంపెనీలు, 9ట్రస్ట్‌లున్నాయి. సీసీఎస్ దర్యాప్తులో 2వేల మంది బాధితులున్నట్టు తేలింది. ట్రస్ట్ పేరిటఉన్న రూ. 514 కోట్ల విలువైన 6 ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. బ్యాంకుఖాతాలను ఫ్రీజ్ చేశాం. ట్రస్ట్ నిర్వాహకులు ఆస్తులవిక్రయానికి అంగీకరించారు. వచ్చిన సొమ్ముతో బాధితుల నష్టాన్ని భర్తీ చేయవచ్చు.

'ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులు విక్రయించాలి'

కాచిగూడ, న్యూస్‌టుడే: అమాయకులను రూ. 1500 కోట్ల మేరకు మోసగించిన ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులను విక్రయించి బాధితులకు సొమ్ము చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో బాధితులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరు చాముండి అగ్రహారంలో భూములను విక్రయించి రూ. 26 కోట్లు రికవరీ చేసిన సీసీఎస్ డీసీపీ శ్వేత, ఏసీపీ ఆదినారాయణలకు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన ఆస్తులూ విక్రయించి బాధితులకు న్యాయంచేయాలన్నారు. నగరసీపీ చొరవ చూపాలని కోరారు.

ఆర్పీ పట్నాయక్ కుమారుడిపై దాడి.. విద్యార్థిపై కేసు

రాయదుర్గం: సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కుమారుడు వైష్ణవి పట్నాయక్‌పై దాడిచేసిన ఓ విద్యార్థిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదుచేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న వివరాల ప్రకారం.. మణికొండ పంచవటి కాలనీలో నివసించే ఆర్పీ పట్నాయక్ కుమారుడు శంకర్‌పల్లిలోని ఓ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ చదువుతున్నాడు. అదే కళాశాల మరో విద్యార్థి ర్యాగింగ్ చేస్తున్నాడని ప్రిన్సిపల్‌కు వైష్ణవి పట్నాయక్ ఫిర్యాదు చేశాడు. ప్రిన్సిపల్ అతన్ని మందలించారు. గురువారం సాయంత్రం ఇద్దరూ బస్సులో ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. మణికొండలో బస్సు దిగుతుండగా వైష్ణవి పట్నాయక్‌తో ఆ విద్యార్థి గొడవకు దిగాడు. ఈ క్రమంలో అతడి చెవిని కొరకడంతో రక్తస్రావమైంది. ఘటనపై ఆర్పీ పట్నాయక్ ఫిర్యాదు చేశారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కీలక మార్గం.. నడకే కష్టం



నగరం నడిబొడ్డున ఉన్న రవీంద్రభారతి వద్ద ప్రధాన రహదారిపై కాలిబాట లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులందరూ తిరిగే ఈ దారిలో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

నిర్లక్ష్యం పందిరేసింది..



ట్యాంక్‌బండ్‌పై నాటిన తీగ మొక్కలు రక్షణ గోడను ఆనుకుని కింది దాకా పెరిగాయి. గోడలకు వున్న రంధ్రాల్లో వేళ్లూనుకుని గోడకు ప్రమాదకరంగా మారాయి. లోయర్ ట్యాంక్‌బండ్ మార్గంలో కనిపిస్తున్న చిత్రమిది.

'దేవర' విడుదలతో ఎన్టీఆర్ అభిమానుల సందడి

రాంనగర్, న్యూస్‌టుడే: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' చలన చిత్రం విడుదల సందర్భంగా శుక్రవారం ఉదయం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని పలు థియేటర్ల వద్ద అభిమానుల సందడి నెలకొంది. ఈ క్రమంలో కొందరు అభిమానులు బాణసంచా కాల్చడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి.. సుదర్శన్-35ఎంఎం థియేటర్ ప్రాంగణంలో ఫ్లెక్సీతో ఏర్పాటుచేసిన భారీ కటౌట్‌కు మంటలంటుకుని దగ్ధమైంది.



కాలిపోతున్న కటౌట్

వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. కొంతసేపటికి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని థియేటర్ యాజమాన్యం తెలిపింది. ఎవరో కావాలనే ఎన్టీఆర్ కటౌట్‌కు నిప్పుపెట్టినట్లు కొంతమంది ఆరోపిస్తున్నా.. వాటిల్లో నిజం లేదని చిక్కడపల్లి ఎస్సై నాగరాజు చెప్పారు.

భవనంపైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

మియాపూర్, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వివాహిత భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మియాపూర్ ఎస్సై వెంకటేష్ వివరాల ప్రకారం.. మయూరి నగర్ దివ్యశ్రీశక్తి అపార్ట్‌మెంట్స్ 9వ ఫ్లోర్లో నెహ్రూ ఆయన భార్య సాయి సింధూర(29) ఉంటున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని వేళ సాయిసింధూర 9వ అంతస్తు పైనుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు సమాచారమివ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఐడీపీఎల్ కాలనీలో నివాసముండే ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. అనారోగ్యం కారణమా? అన్న కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మంత్రాల పేరుతో మోసం.. నకిలీ బాబా అరెస్టు



కేశవగిరి, న్యూస్‌టుడే: రోగాలు నయం చేస్తా.. సమస్యలు దూరం చేస్తానంటూ ప్రజలను మోసంచేస్తున్న నకిలీ బాబాను బండ్లగూడ పోలీసులతో కలిసి, సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణ్‌పేట్‌కు చెందిన **మహ్మద్ ఇల్యాస్‌అహ్మద్**(42) వృత్తిరీత్యా ఇస్త్రీ పనిచేస్తుంటాడు. 2012లో నగరానికి జీవనోపాధికి వచ్చిన ఆయన పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో నివసించాడు. భూతవైద్యుడు(బాబా)గా అవతారమెత్తాడు. అతీత శక్తులున్నాయని.. మీ సమస్యలన్నీ ఇట్టే తీరుస్తానని ప్రచారం చేసుకున్నాడు. తన వద్దకు వచ్చిన అమాయకులకు మాయమాటలు చెప్పి, అధిక మొత్తంలో డబ్బులు వసూలుచేశాడు. రెండు నెలల క్రితం బండ్లగూడ జహంగీరాబాద్‌లో అద్దెకు ఇల్లు తీసుకుని దందా ప్రారంభించాడు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్‌వర్మ, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు ఎం.మధు, షేక్‌కవియుద్దీన్, పి.సాయిరాం, సిబ్బంది అతడి ఇంటిపై దాడిచేశారు. ఇల్యాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు నిమిత్తం బండ్లగూడ పోలీసులకు అప్పగించారు.

ఐఎస్ఎఫ్ పిచ్‌కు 10 అంకురాలు ఎంపిక



ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ భరత్

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: అంకురాలకు ప్రోత్సాహం అందించేందుకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహిస్తోన్న ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ (ఐఎస్ఎఫ్) 2024లో పది అంకురాలు ఐఎస్ఎఫ్ ఫిచ్ ఫెస్ట్‌కు ఎంపికయ్యాయి. ఇందులో వాటర్ ఫాల్ ఆటోమేషన్, ప్లానిటిక్స్, ఐ గోవైస్ మొబిలిటీ, డాక్టర్‌ఎట్‌హోమ్, 6డిగ్రీ, కోడ్ బ్లూ, టెన్, కిక్ ఆఫీస్, సిరిగ్జో, టియా కెనెక్టర్లు ఉన్నాయి. దాదాపు 53వేలకు పైగా అంకురాలు ఐఎస్ఎఫ్ పిచ్‌ఫెస్ట్‌కు దరఖాస్తు చేసుకున్నాయని, ఇందులో నుంచి 50 అంకురాలకు తమ గురించి తెలియజేసేందుకు అవకాశం కల్పించినట్లు ఐఎస్ఎఫ్ ఛైర్‌పర్సన్, కన్వీనర్ జేఏ చౌదరి తెలిపారు. 50 సంస్థల్లో నుంచి అత్యున్నతంగా ఉన్న 10 సంస్థలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీటికి ఐఎస్ఎఫ్ తరఫున మార్గనిర్దేశకత్వం, పెట్టుబడులు సమీకరించడంలో సాయంతోపాటు, ఇతర అంశాల్లో తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు.

సందర్శించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఐఎస్ఎఫ్ ఫెస్టివల్‌ను శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఎం.భరత్ సందర్శించారు. ఇక్కడ పలు అంకురాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అంకుర సంస్థల ప్రతినిధులతో మాట్లాడి వాటి ప్రత్యేకతలు అడిగి తెలుసుకున్నారు.

పేదలను తరలించకుండా..

మూసీకి రక్షణగోడ నిర్మించాలి



బాధితులతో మాట్లాడుతున్న గౌతంరావు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీనది పరివాహక ప్రాంతాల నుంచి పేదలను తరలించకుండానే.. ఆయా ప్రాంతాలకు వరద ముప్పు తలెత్తకుండా పటిష్ఠ రక్షణగోడను నిర్మించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు కోరారు. నగర శివార్లలో రెండు పడకగదుల ఇళ్లను ఇస్తామంటే నగరంతో ముడిపడ్డ వారి జీవనోపాధి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. శుక్రవారం భాజపా గోల్నాక అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తులసీనగర్ లంక, కమలానగర్ తదితర మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నేతలు కీసరి నర్సింగ్‌యాదవ్, రాంచందర్, దామోదర్‌నాయుడు, ఈశ్వర్‌రావు, రవీందర్, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరివాహక ప్రాంతాలవాసుల కొవ్వొత్తుల ర్యాలీ

అత్తాపూర్: హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలపై ప్రతాపం చూపుతోందని పలువురు ఆరోపించారు. అత్తాపూర్ మూసీ పరివాహక ప్రాంతంలో ఇళ్లను కూల్చివేస్తామని అధికారులు సర్వే చేయడాన్ని నిరసిస్తూ బాధితులు, వివిధ పార్టీల నాయకులు అత్తాపూర్ హైదర్‌గూడలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని అనుమతులు తీసుకొని ఇళ్లు నిర్మించుకుంటే ఇప్పుడు ప్రభుత్వం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంటూ తమను బెదిరిస్తోందన్నారు. ఇళ్లు కూల్చివేయాలనే నిర్ణయాన్ని సీఎం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత, భాజపా నాయకులు కొమురయ్య, వివిధ సంఘాల నేతలు, సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధు తదితరులు పాల్గొన్నారు.

పీరంచెరువులోని భవంతులు హైడ్రాకు కనిపించవా..?

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ పీరంచెరువులో యథేచ్ఛగా పెద్దపెద్ద భవంతులు కడుతున్నారని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇక్కడి చెరువులో కొనసాగుతున్న భవన నిర్మాణాలపై వీడియో, సమాచారాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆయన ఎక్స్ వేదికగా పోస్టుచేశారు. ఇక్కడి అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ప్రశ్నిస్తే.. 'మాకు సీఎం బాగాతెలుసు.. ఆర్-టాక్స్(పర్ ఎస్ఎఫ్‌టీ రూ.50/) కట్టుకుంటాం.. కోర్టుకు ఎలా పోవాలో మాకుతెలుసు అని దబాయిస్తున్నరంట. మరి ఇక్కడి అధికారులు ఏంచేస్తున్నరు? పేదోళ్ల ఇండ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే శని, ఆదివారాల్లో కూల్చుతున్నరు కదా..! హైడ్రా కమిషనర్ ఎక్కడ..? అంటూ నిలదీశారు. ప్రవీణ్‌కుమార్ ఇక్కడి స్నేహిత హిల్స్ కాలనీలోనే నివాసముంటున్నారు. ఆయన భవనంపై నుంచే పీరంచెరువు ఎఫ్‌టీఎల్‌లో కొనసాగుతున్న భవనాల నిర్మాణ పనులను వీడియో తీశారు.

60 దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ఓ వైద్యుడు ఇంట్లో బంగారం చోరీ చేసిన కేసులో నిందితుల్లో ఒకరిని పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్ రాధమ్మకాలనీకి చెందిన వైద్యుడు కిరణ్ ఇంటిలో మే 28న చోరీ జరిగింది. 20 తులాల బంగారం దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. అక్కడున్న సీసీకెమెరాల ఆధారంగా పాతనేరస్థుడు దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని యానాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో శామ్యూల్ రాజ్ అనే నిందితుడితో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. దొంగిలించిన బంగారం నాగ్‌పూర్‌లో ముత్తూట్ సంస్థలో తాకట్టుపెట్టినట్లు చెప్పాడు. పోలీసులు వెళ్లి 13 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దుర్గాప్రసాద్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతను 60 దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శామ్యూల్‌రాజ్ పరారీలో ఉన్నాడని చెప్పారు.

అత్త ప్రశ్నించిందని.. కోడలు బలవన్మరణం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: తనకు గాయమైతే ఆసుపత్రిలో ఎందుకు చూపించలేదని అత్త ప్రశ్నించినందుకు కోడలు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందింది. పటాన్‌చెరు ఎస్సై వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన బాలమ్మకు ఇటీవల రహదారి ప్రమాదం జరిగింది. ఆమె చేతికి గాయం అవడంతో నన్ను ఆసుపత్రిలో ఎందుకు చూపలేదని కోడలు అనూష(38)ను గురువారం ప్రశ్నించింది. దీనితో మనస్తాపం చెందిన అనూష అత్త వేసుకునే రక్తపోటు నియంత్రణ మాత్రలు వేసుకుని బలవన్మరణానికి యత్నించింది. ఆమెను ప్రైవేటుఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వసతి గృహానికి రూ.2 లక్షల జరిమానా

శేరిలింగంపల్లి, మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల రెసిడెన్షియల్ హాస్టల్‌కు జీహెచ్ఎంసీ అధికారులు రూ.2 లక్షల జరిమానా విధించారు. హాస్టల్‌లోని పలువురు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురైనట్లు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, చందానగర్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. దీనిపై పరిశీలించాలని చందానగర్ సర్కిల్ సహాయ వైద్యాధికారి కేవీఎస్ రవి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు పలువురికి ఆదేశాలు ఇచ్చారు. అధికారుల బృందం వెళ్లి పరిశీలించగా వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న విద్యార్థులను కొందరిని ప్రైవేటు ఆసుపత్రికి, మరికొందరిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హాస్టల్‌లోని క్యాంటీన్ తదితర ప్రదేశాలు తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించారు.

నమ్మించి రూ.2కోట్లు కాజేశాడు

ఈనాడు, హైదరాబాద్: ఖరీదైన ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నట్టు నమ్మించి రూ.కోట్లు కాజేసి మోసగించిన ఘటనపై శుక్రవారం నగర సీసీఎస్‌లో కేసు నమోదైంది. నగరానికి చెందిన వైద్యనిపుణుడికి సోదరి కుటుంబం ద్వారా శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్, బిల్డర్స్ నిర్వాహకుడు జి.శ్రీనివాస్ పరిచయమయ్యాడు. ఘట్‌కేసర్‌లో తాము కొత్తగా నిర్మిస్తున్నట్టు చెప్పాడు. ఇది నిజమని భావించిన వైద్యుడు రూ.2.3కోట్లు చెల్లించాడు. రెండేళ్లు గడచినా నిర్మాణం చేపట్టలేదు. శ్రీనివాస్ పేరిట స్థలం లేదని గుర్తించారు. మోసపోయానని డబ్బు తిరిగి ఇవ్వమని కోరాడు. అతడిచ్చిన చెక్ బ్యాంకులో చెల్లకపోవటంతో బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠా అరెస్టు

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: డ్రగ్స్‌తో పాటు గంజాయి విక్రయిస్తున్న ముఠాను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్టుచేశారు. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. సికింద్రాబాద్ శివాజీనగర్‌కు చెందిన ఎడ్ల రాజు (25) అలియాస్ ప్రభ, చెన్నకేశవ వంశీ (22) అలియాస్ సాయి, అభిషేక్ కుమార్ సింగ్(24)లు ప్రైవేటు ఉద్యోగులు. వీరు నిత్యం జల్‌పల్లి 16వ వార్డులోని పీ7 రోడ్డుపై ఉన్న జేసీ దాబా వద్దకు చేరుకుని గంటన్నర పాటు ఉండి మాయమవుతారు. ఈ యువకులు కావాల్సిన వారికి డ్రగ్స్, గంజాయిని విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం వారిపై ఎస్సై తమ సిబ్బందితో కలిసి దృష్టిపెట్టారు. డ్రగ్స్ సేకరిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీగా మార్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నగరాన్ని సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంలో భాగంగా 90 రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం ఈ కార్యక్రమంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీవరేజీపై వచ్చే ఫిర్యాదులను తగ్గించడంతోపాటు దీర్ఘకాలికంగా వస్తున్న సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. భవిష్యత్తులో నీటి ట్యాంకుల డిమాండ్ లేకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. సీవరేజీపై ఈఎన్‌సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక అధికారి సత్యనారాయణ ప్రదర్శన ఇచ్చారు. ఇందులో ఈడీ మయాంక్ మిట్టల్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, విజయరావు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వీఎం హోం ప్రిన్సిపల్



ప్రిన్సిపల్ ప్రభుదాస్

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ హోం పాఠశాల (వీఎం హోం) ప్రిన్సిపల్ వి.ప్రభుదాస్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. వీఎం హోం వసతి గృహంలో ఫుడ్ కాంట్రాక్టు సంబంధించి సదరు గుత్తేదారు నుంచి రూ.29 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో శుక్రవారం రూ.29 వేలు నగదు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. అధికారులు పాఠశాలలో శుక్రవారం రికార్డులను పరిశీలించారు. పట్టుబడిన ప్రభుదాస్‌ను నాంపల్లి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు.

రాజధానిలో 5 కొత్త డంపింగ్ యార్డులు

ఈనాడు, హైదరాబాద్: నగరం నలువైపులా ఐదు కొత్త డంపింగ్ యార్డులు రాబోతున్నాయి. త్వరలోనే భూములను స్వాధీనం చేసుకుంటామని, భూ కేటాయింపు కోసం సర్కారుకు లేఖ రాయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు కమిషనర్ ఆమ్రపాలి వెల్లడించారు. ఐదింటిలో దుండిగల్ సమీపంలోని ప్యారానగర్‌లో భూ కేటాయింపు పూర్తయిందని తెలిపారు. అక్కడున్న 152 ఎకరాల్లో యూరోపియన్ సాంకేతికతను మరో నాలుగుచోట్ల భూకేటాయింపు జరగాల్సి ఉందని జీహెచ్ఎంసీ వెల్లడించింది.

జవహర్‌నగర్‌పై తగ్గనున్న ఒత్తిడి: గ్రేటర్ హైదరాబాద్‌లో రోజూ 7,500 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. శివారులోని 17 మున్సిపాలిటీలు నగర పాలక సంస్థలనుంచి మరో 1,500టన్నులు.. మొత్తం 9వేల టన్నుల వ్యర్థాలు రోజూ జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. ఆ చెత్తను సవ్యంగా నిర్వహించడంలో రాంకీ సంస్థ ఆపసోపాలు పడుతోంది.

రూ.50 లక్షల హవాలా సొమ్ము స్వాధీనం

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.50 లక్షల హవాలా సొమ్మును శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన వ్యాపారి అమిత్ సిర్వాణి రూ.50 లక్షల భారీ మొత్తంతో బొగ్గులకుంట ఆదిత్య ఆసుపత్రి సమీపంలో పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపకపోవడంతో.. నగదును స్వాధీనం చేసుకుని సుల్తాన్‌బజార్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

రూ.5.27 కోట్ల మోసం కేసులో నలుగురి రిమాండ్

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట నగర వాసిని రూ.5.27 కోట్లు మోసగించిన కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వనస్థలిపురానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి కొత్తండ రమణ్ మురళీకృష్ణన్ (53), అల్మాస్‌గూడకు చెందిన వ్యాపారి కందుకూరి రవీందర్‌రెడ్డి (40), అత్తాపూర్‌కు చెందిన బండ్లమూడి రవి, జీడిమెట్లకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సామినేని మాధవరావు (40)ను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 11 చెక్‌బుక్కులు, 23 సిమ్‌కార్డులు, 10 ఏటీఎం కార్డులు, ఒక స్వైపింగ్ యంత్రం, 3 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు గత జులై 11న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయడంతో ఈ నలుగురి దందా బహిర్గతమైంది. బాధితుడిని ఫేస్‌బుక్ ప్రకటనల ద్వారా ఆకర్షించిన ముఠా.. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే పెద్దమొత్తంలో లాభాలొస్తాయని నమ్మించి మోసం చేసింది.

సందడి చేసిన నాగ చైతన్య



హైపర్‌వర్స్ రైడ్‌ను ప్రారంభిస్తున్న నాగ చైతన్య

ఆదిభట్ల, న్యూస్‌టుడే: సినీ నటుడు నాగ చైతన్య రావిర్యాలలో సందడిచేశారు. దేశంలోని అతిపెద్ద అమ్యూజ్‌మెంట్ పార్కు చైన్లలో ఒకటైన వండర్‌లాలో ఏర్పాటుచేసిన రెండు రైడ్‌లు హైపర్‌వర్స్, జీపాల్‌లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో నాగ చైతన్య మాట్లాడారు. గ్లోబల్ పార్కులకు దీటుగా ప్రపంచ స్థాయి రైడ్‌లను వండర్లా తీసుకొచ్చిందన్నారు. సందర్శకులకు ఇవి మరుపురాని అనుభూతిని ఇస్తాయన్నారు. వండర్‌లా ఎండీ అరుణ్ కె.చిట్టిలపిల్లి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125–00	డ్రెస్డ్ 213–00
రిటైల్ 147–00	స్కిన్‌లెస్ 243–00

నృత్యంతో అలరించిన కృతిశెట్టి



జ్యోతి వెలిగిస్తున్న కృతిశెట్టి

పీర్జాదిగూడ (బోడుప్పల్), న్యూస్‌టుడే: వస్త్రదుకాణం ప్రారంభించడమే కాదు.. నృత్యంతో అభిమానులను సినీనటి కృతిశెట్టి అలరించింది. శుక్రవారం పీర్జాదిగూడలో కాంచీపురం మంగళ గౌరి వస్త్ర దుకాణాన్ని సినీ నటి కృతిశెట్టి ప్రారంభించారు. డైరెక్టర్ కృష్ణమూర్తి నేతృత్వంలో ఏర్పాటైన వస్త్ర దుకాణంలో దసరా, దీపావళి ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని కృతిశెట్టి పేర్కొన్నారు.

నార్సింగిలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం



చీర పరిశీలిస్తున్న సంయుక్త మేనన్

నార్సింగి న్యూస్‌టుడే: నార్సింగిలో కొత్తగా ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్‌ను సినీనటి సంయుక్త మేనన్ శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిత్యనూతన డిజైన్లు, అధునాతన కలెక్షన్లతో తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద షాపింగ్‌మాల్‌గా మాంగళ్య అవతరించిందన్నారు. డైరెక్టర్లు పి.ఎన్.మూర్తి, కాసం నమఃశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

'లడ్డూ కల్తీ'పై కేంద్రం విచారణ చేపట్టాలి

జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదమైన లడ్డూ కల్తీ వ్యవహారంపై తక్షణం విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. శుక్రవారం నింబోలిఅడ్డాలో నేతలు పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్ నిమ్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, భూషణ్ భాస్కర్ తదితరులతో కలిసి మాట్లాడారు. ఈ వ్యవహారానికి అప్పటి వైకాపా ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

పాఠాలు చెప్పని వేలిముద్ర ప్రొఫెసర్లు

కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో అట్టడుగున బోధనా ప్రమాణాలు



ఈనాడు, హైదరాబాద్: "కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు కనీస నైపుణ్యాలు ఉండటం లేదు. ఆయా కళాశాలల గుర్తింపు రద్దు చేస్తా'మంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొనడం సంచలనం సృష్టించింది.

ఎంటెక్ ఉంటే చాలు.. అఖిల భారత సాంకేతిక విద్యామండలి మార్గదర్శకాలను అనుసరించి ఆచార్యులను నియమిస్తున్నట్లు కళాశాలలు పేర్కొంటున్నా, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో పరిస్థితి వేరుగా ఉంది. చాలామంది ఆచార్యులు ఉదయం, సాయంత్రం 'వేలి' ముద్రలు (బయోమెట్రిక్) వేసి వెళ్తున్నారు. జేఎన్‌టీయూ పరిధిలోని 216 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలుంటే, 30 శాతం కళాశాలల్లో ఈ తరహా ప్రొఫెసర్లే ఉన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ పూర్తిచేసిన వారిని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించాలి. అందుకు విరుద్ధంగా బీటెక్ పూర్తిచేసిన వారితో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. ఎంటెక్ పూర్తి చేసిన వారితో ఎంటెక్ విద్యార్థులకే పాఠాలు చెప్పిస్తున్నారు.

- పంజాగుట్ట- ఖైరతాబాద్ మధ్యలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఎంటెక్ పూర్తిచేసిన వారికి నెలకు రూ.20 వేలు ఇస్తూ.. ఉదయం ఒకసారి, సాయంత్రం వేలి ముద్రలు వేయించుకుని పంపుతున్నారు.
- గండిపేటకు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, సివిల్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. ఆ విభాగాల్లో పీజీ చేసిన వారితో హాజరు వేయిస్తున్నారు.

తొలి సెమిస్టర్‌లోనే ధమాల్

జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో సరైన సంఖ్యలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో.. ఆ ప్రభావం విద్యార్థుల ఉత్తీర్ణతపై పడుతోంది. ఈ ఏడాది జనవరిలో తొలి సెమిస్టర్ రాసిన 17,063 విద్యార్థుల్లో 9,677 మంది ఫెయిల్ అయ్యారు. సుమారు 57 శాతం మంది పరీక్షలు తప్పడం జేఎన్‌టీయూ చరిత్రలో ఇదే తొలిసారి. ప్రమాణాలకు అనుగుణంగా బోధనా సిబ్బంది లేకపోవడంతో.. పాఠాలు అర్థంకాక విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. పీహెచ్‌డీ లేకపోయినా, ఎంటెక్ విద్యార్హతతో కొన్ని కళాశాలలు ప్రిన్సిపాళ్లను నియమించుకుంటున్నాయి. తనిఖీలు నిర్వహిస్తే.. నకిలీల గుట్టు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

సీపీఆర్‌ని పాఠ్యాంశంగా చేర్చాలి: గవర్నర్



సీపీఆర్ సాధన చేస్తున్న జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో బుర్రా వెంకటేశం

సోమాజిగూడ, న్యూస్‌టుడే: అకస్మాత్తుగా గుండెపోటు వస్తే కాపాడే సీపీఆర్ శిక్షణ పొందితే ఆపాయంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడగలిగే ధైర్యం వస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. కార్డియాక్ అరెస్టు వీక్, ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ కార్డియాలజిస్టు, ఎలక్ట్రోఫిజియాలజిస్టు హయగ్రీవరావు ఆధ్వర్యంలోని రాజ్‌భవన్‌లో సిబ్బందికి సీపీఆర్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ బొమ్మపై సీపీఆర్ సాధన చేశారు. కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ విభాగం అధిపతి డా.సంబిత్ సాహు, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



మహాబోధి మొక్క నాటుతున్న దలైలామా ప్రతినిధులు, కమలేష్ డి పటేల్

నందిగామ, న్యూస్‌టుడే: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్‌గైడ్ కమలేష్ డి పటేల్(దాజీ) అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతి వనంలోని అతిపెద్ద ధ్యాన మందిరంలో ఆయన 69వ జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దలైలామా ప్రతినిధి, శ్రీలంక దేశానికి చెందిన అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య అదనపు సెక్రటరీ జనరల్ దమింద పోరగే విచ్చేశారు. బుద్ధుడు జ్ఞానోదయం పొందిన మహాబోధి చెట్టు మొక్కను బుద్ధగయ నుంచి తీసుకువచ్చి దాజీతో శాంతివనంలో నాటించారు.

విశ్వనగరం మెరిసేలా.. భూ నిర్వాసితులు మురిసేలా



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ (ఫోర్త్) సిటీలో పనులు వేగంగా సాగుతున్నాయి. భూ నిర్వాసితులకు టీజీఐఐసీ ఆధ్వర్యంలో మీర్‌ఖాన్‌పేట పరిధిలో 600 ఎకరాల లేఅవుట్ రూపొందించి రహదారులు నిర్మిస్తున్నారు. కందుకూరు, యాచారం మండలాల్లోని 13వేల ఎకరాల భూసేకరణకు సంబంధించి.. సుమారు 8వేల మంది నిర్వాసితులు ఉన్నారు. ఇప్పటికే వీరికి ప్లాట్ల పత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, కందుకూరు

ఉస్మాన్‌సాగర్ నీటి విడుదల

నార్సింగి, న్యూస్‌టుడే: ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయం నుంచి శుక్రవారం నాలుగు గేట్లు అడుగు మేర ఎత్తి 484 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులుగా పేర్కొన్నారు.

నగరంలో ఈనాడు

- కాచిగూడ భద్రుకా కాలేజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(బీబీసీఐటీ) ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి 'సమాజం - సైబర్ సెక్యూరిటీ పాత్ర'పై సదస్సు
- రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు 'అక్కినేని ఆణిముత్యాలు గ్రంథావిష్కరణ - అంకితోత్సవం'

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం: మంత్రి



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యత్వం తీసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటైన ప్రజాపాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. శుక్రవారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 6వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యమకారులకు గుర్తింపుతో పాటు ఎలా సాయం చేయాలనేది చర్చించుకొని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్దామని సూచించారు. ఉద్యమకారులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఏడాదిలోగా అమలయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో విమలక్క, వెన్నెల గద్దర్, ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ చీమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జన్యు సంబంధిత పరిశోధనల్లో పురోగతి



జ్యోతి వెలిగిస్తున్న డా.అర్క శుభ్ర ఘోష్, చిత్రంలో నీరజ్‌కుమార్

అమీర్‌పేట, న్యూస్‌టుడే: జన్యు సంబంధిత చికిత్సా విధానాల్లో కొనసాగుతున్న పరిశోధన ప్రయత్నాల్లో పురోగతి సాధిస్తున్నామని గ్రో రీసెర్చ్ ల్యాబ్ డైరెక్టర్, నారాయణ నేత్రాలయ ఫౌండేషన్ సీనియర్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా.అర్క శుభ్రఘోష్ తెలిపారు. త్వరలో దేశీయంగానూ ఆధునిక జన్యు సంబంధిత సమస్యల చికిత్సా విధానం అందుబాటులోకి రానుందని వెల్లడించారు. అమీర్‌పేటలోని జెనిటిక్ ఇన్‌స్టిట్యూట్, జెనిటిక్ డిసీజెస్ ఆసుపత్రిలో 'ఇన్నోవేషన్ డయాగ్నసిస్, కేర్, మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ మస్క్యులర్ డిస్ట్రోఫీస్' అనే అంశంపై రెండ్రోజుల సదస్సును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. బీబీనగర్ ఎయిమ్స్ ప్రొఫెసర్ డా.నీరజ్‌కుమార్, జెనిటిక్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డా.బి.విజయలక్ష్మి, వైద్య నిపుణులు సూర్యబాలకృష్ణ, బి.శ్రీనాథ్, టి.సునీత, పోషకాహార నిపుణులు ఎ.ఎన్.మల్లేశ్వరి, కొల్లిపర పార్వతి, భారత్ ఎండీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురళి, డైరెక్టర్ బి.వి.రామలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్‌తో మోకాలి చికిత్స

గచ్చిబౌలి న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్‌ను ఉపయోగించి మోకాలి పాక్షిక రీసర్ఫేసింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు గచ్చిబౌలిలోని ఒమేగా హాస్పిటల్ ఆర్థోపెడిక్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య కపూర్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఆయన మాట్లాడుతూ.. "తొలిసారిగా బయోనిక్ గోల్డ్ ఇంప్లాంట్ ఉపయోగించి మోకాలి పాక్షిక రీసర్ఫేసింగ్‌ను విజయవంతంగా నిర్వహించాం. ఈ ఇంప్లాంట్ టైటానియం, నియోబియం, నైట్రైడ్‌తోపాటు యాంటీఆక్సిడెంట్ పాలిథిలిన్ కలిగి ఉండటం వల్ల శరీరం అలెర్జీకి గురి కాదు. 62 ఏళ్ల మహిళకు విజయవంతంగా ఈ శస్త్రచికిత్స చేశాం" అని ఆయన వివరించారు.

కిమ్స్ కడల్స్ మిసెస్ మామ్ పోటీలు రేపటి నుంచి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డాక్టర్ శిల్పిరెడ్డి, డాక్టర్ సుధీర్ తదితరులు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సాధారణ ప్రసవాల ప్రాధాన్యంతో పాటు గర్భిణులకు సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ఏటా మిసెస్ మామ్ పోటీలు నిర్వహిస్తుంది. ఈసారి హైదరాబాద్, ఖమ్మం, సిద్దిపేట, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ.. ఇలా 8 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, గైనకాలజిస్టు డాక్టర్ కె.శిల్పిరెడ్డి తెలిపారు. శుక్రవారం మిసెస్ మామ్ పోటీల గోడ పత్రికను కొండాపూర్‌లోని ఆసుపత్రిలో ఆవిష్కరించారు. సెప్టెంబర్ 29న ఈ కార్యక్రమం ప్రారంభమై, డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే గ్రాండ్ ఫినాలెతో ముగుస్తుంది. డైరెక్టర్ డా.సుధీర్, సీవోవో సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

ఎస్టీ కులాల యువతీ యువకులకు నేడు, రేపు ఉచిత రిజిస్ట్రేషన్లు



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎస్టీల్లోని బంజారా, కోయ, గోండు, ఎరుకల కులాలకు చెందిన యువతీయువకుల కోసం 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఈ నెల 28, 29 తేదీల్లో సోమాజిగూడలోని 'ఈనాడు కార్యాలయంలో జరగనుంది. వివాహాల కోసం ఎదురుచూస్తున్న వారంతా.. శనివారం, ఆదివారం రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా ప్రొఫైల్ రిజిస్టర్ చేయించుకోవచ్చు. పూర్తి వివరాలకు 91549 92572, 91543 40820 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

'ఎలీప్' అధ్యక్షురాలిగా కన్నెగంటి రమాదేవి



నిజాంపేట, న్యూస్‌టుడే: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూనర్స్ ఆఫ్ ఇండియా(ఎలీప్) నూతన అధ్యక్షురాలిగా కన్నెగంటి రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా పారిశ్రామికవేత్తల పేరుతో 1993 డిసెంబరు 18న ఎలీప్ ఆవిర్భవించింది. ప్రగతి నగర్‌లోని ఎలీప్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం నూతన అధ్యక్షురాలితోపాటు కమిటీ సభ్యులుగా పి.జ్యోతిరావు, కె.పద్మజా ప్రభాకర్, ఎ.దుర్గా భవానీ, ఎన్.స్వరూపారాణి, టి.పల్లవి జోష్ ఎన్నికయ్యారు.



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో.. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలి: మంత్రి





ఉత్సవాలను ప్రారంభిస్తున్న జూపల్లి కృష్ణారావు. చిత్రంలో పటేల్ రమేష్‌రెడ్డి, వాణీప్రసాద్, ఇంద్రసేనారెడ్డి, నిఖత్ జరీన్, ఈషా సింగ్, పక్కన సాంస్కృతిక ప్రదర్శనలు

మాదాపూర్, న్యూస్‌టుడే: జీవితమున్నది ఒక్కటే.. దాన్ని సాకారం చేసుకోవాలి.. నిత్యం కుటుంబం, సంపాదనలో మునిగిపోకుండా కనీసం నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలను చూసి ప్రశాంతంగా గడపాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. పర్యాటక ప్రదేశాల సందర్శనతో మనసుకు ఆనందం, ఆహ్లాదంతోపాటు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో ప్రపంచ పర్యాటక దినోత్సవాలు నిర్వహించారు. రాష్ట్రంలో అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసిన పలువురు కలెక్టర్లకు అవార్డులు అందజేశారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్ పాల్గొన్నారు.

లులూ మాల్ వార్షికోత్సవం



కేకు కోసి సంబరాలు చేసుకుంటున్న మాల్ ప్రతినిధులు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ రోడ్డులోని లులూ మాల్ యాజమాన్యం శుక్రవారం ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించింది. మాల్ ప్రతినిధులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. మాల్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ మాట్లాడుతూ.. ఏడాది కాలంగా మాల్ వినియోగదారులకు షాపింగ్ అనుభూతిని అందించి గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఉత్తమమైన నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందిస్తూ సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 31 వరకు ప్రత్యేక ఆఫర్ ద్వారా గంట గంటకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

రచనల్లో అడవి బాపిరాజు సిద్ధహస్తుడు



నివాళులర్పిస్తున్న మాణిక్, శ్రీనివాస్‌గుప్తా, కళా జనార్దనమూర్తి, సుబ్బారావు, వంశీ రామరాజు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అడవి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో రచయిత, కళాకారుడు 'అడవి బాపిరాజు యాదిలో..' శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించగా.. వంశీ రామరాజు, మాణిక్, పొత్తూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలు కోటీశ్వరులయ్యేందుకు ప్రోత్సాహం



చీరలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మహిళలు కోటీశ్వరులు అయ్యేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన సరస్ ఫెయిర్ 2024ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలకు రూ.లక్ష కోట్లు ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంపీ అనిల్ యాదవ్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి లోకేష్‌కుమార్ పాల్గొన్నారు. హిజ్రా ప్రేమ్‌లీల బృందం తయారు చేసిన బ్యాగు స్టాల్‌ను మంత్రి పరిశీలించి అభినందించారు.

ఖైరతాబాద్

● ఖైరతాబాద్ ● జూబ్లీహిల్స్

నగరంలో పోస్టర్లపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలకు దారి తీయడం, అపరిశుభ్రత, నగర వాతావరణాన్ని అధ్వానంగా మార్చుతున్న పోస్టర్లపై జీహెచ్ఎంసీ నిషేధం విధించింది. అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, చెట్లు, విద్యుత్తు స్తంబాలకు ప్రకటనలు తగిలించడం, రహదారులపై బోర్డులను ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిషేధాజ్ఞలను పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం యంత్రాంగాన్ని ఆదేశించారు. సర్కిళ్ల ఉపకమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై పత్రాలను అంటించకుండా అవగాహన కల్పించాలన్నారు. గోడలపై ప్రకటనలు, నినాదాలు, ఇతర రాతలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపకమిషనర్లు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తాఖీదులు తప్పవన్నారు. ఉల్లంఘనలు జరగకుండా నిఘా పెట్టాలన్నారు. ఎవరైనా నిషేధాజ్ఞలు పట్టించకపోతే జరిమానా వేయాలని, రోజువారీ నివేదికలను కేంద్ర కార్యాలయానికి పంపాలని తెలిపారు.

ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగం దోహదం



పురస్కార గ్రహీతలతో శ్రీనివాస్‌గుప్తా, మురళీమోహన్‌రాజు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: పర్యాటకరంగం దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మార్గమని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం సైఫాబాద్‌లోని అన్మోల్ కాంటినెంటల్ హోటల్‌లో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పర్యాటక పురస్కారాలను 'మీర్ అహ్మద్ అలీ (నైస్ టూర్స్ అండ్ ట్రావెల్స్), డా. బోగ కోదండపాణి (సావరిన్ ఎస్టేట్స్ అండ్ మల్టీ ట్రేడర్స్), డి. రఘురామ్ (శ్రీబాలాజీ ట్రేడర్స్), ఎస్. విలాస్ (హైదరాబాద్ హాలీడేస్)లకు ప్రదానం చేశారు. అంతకముందు కవి సమ్మేళనం నిర్వహించారు. నాట్యగురువు డా. ఎస్. పి. భారతి, సామాజికవేత్తలు మురళీమోహన్ రాజు, ఎస్. రామచంద్రరావు, సర్వేపల్లి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, న్యూస్‌టుడే

? బంజారాహిల్స్ రోడ్డు నం.2 ఎల్వీప్రసాద్ మార్గ్‌లోని పామ్ బంజారా రెస్టారెంట్ పక్క గల్లీలో కొన్ని వీధిదీపాలు వెలగడం లేదు. చీకటి పడిన తరువాత రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.

– జయదీప్, స్థానికుడు, బంజారాహిల్స్

✓ సిబ్బందిని పంపి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్– 18.

హడలెత్తిస్తున్న శునకాలు..

చర్యలకు మీనమేషాలు



పంజాగుట్ట, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారిని, కదిలిన వారిని హడలెత్తిస్తూ దాడి చేస్తున్నాయి. వీధులు, ఉద్యానాలు, రహదారులపై గుంపులుగా తిష్టవేస్తున్న శునకాలతో పాదచారులు, వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది.

● సిబ్బంది, వాహన కొరతతో వెటర్నరీ విభాగం సతమతం
● సగటున వారానికి ఐదుగురు కుక్కకాటు బాధితులు



ప్రతాప్‌నగర్‌లో..

ఈ కాలనీల్లో అధికం..

ద్వారకాపురి కాలనీ, బాలాపుర బస్తీ, పంజాగుట్ట కుమ్మరిబస్తీ, పద్మావతినగర్, వెంకటరమణ కాలనీ, చింతలబస్తీ ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం మాత్రం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. డివిజన్‌లోని ఉద్యానాల్లో ఉదయం, సాయంత్రం నడక వెళ్లే వారు కరుస్తున్నాయని, వాటి బారి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీసి కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. వారానికి కనీసం అయిదుగురు కుక్క కాటు బారిన పడి వస్తున్నారని బస్తీదవాఖానాల వైద్య సిబ్బంది చెబుతున్నారు.

లెక్కలు మిక్కిలిగా..

జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో 5 సర్కిళ్లలో 90 వేలకు పైచిలుకు వీధికుక్కలున్నట్లు అధికారులు లెక్కతేల్చారు. వాస్తవానికి లక్షన్నర పైబడే వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయని ఓ అధికారి తెలిపారు. వీధి కుక్కల బెడద గురించి ఫిర్యాదు చేస్తే డాగ్ స్క్వాడ్ వచ్చేసరికి ఆలస్యం అవుతోంది. ఒక్క ఖైరతాబాద్ సర్కిల్ విషయమే తీసుకుంటే రోజుకు కనీసం 10 ఫిర్యాదులైన కుక్కల సమస్యపై వస్తున్నాయి. వాస్తవానికి సరిపడ సిబ్బంది లేక, అవసరమైన సంఖ్యలో వాహనాలు అందుబాటులో లేక జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం సమస్యలు ఎదుర్కొంటుంది. కుక్కల బెడద విషయమై తమకు ఫిర్యాదులు అందిన వెంటనే కుక్కలను పట్టుకొని తీసుకువెళ్లి యానిమల్ బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్సలు చేసి, రేబిస్ నిరోధక, డి-ఫార్మింగ్ టీకాలను వేసి తిరిగి వదిలిపెడుతున్నామని వెటనరీ విభాగం అధికారులు చెప్పారు.

కోర్టు ఉత్తర్వులను అమలుచేయరా?

● సహకార శాఖ కమిషనర్ రిజిస్ట్రార్‌పై హైకోర్టు ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అవకతవకలపై సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్పందించని సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ హరితపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాగైతే కోర్టు ధిక్కరణ కింద జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. చర్యల్లో జాప్యంపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 18కి వాయిదావేసింది. గత మేనేజింగ్ కమిటీ అవకతవకలపై విచారణ జరిపి సమర్పించిన నివేదికపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో జూబ్లీహిల్స్ సొసైటీ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ ఎం. హరిత వ్యక్తిగతంగా హాజరయ్యారు. విచారణ నివేదికను పిటిషనర్‌కు అందజేశారు. గత పాలకమండలి అవకతవకలపై విచారణ జరిపినా చర్యలు ఎందుకు చేపట్టలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించారు. వచ్చే విచారణకు హాజరు మినహాయింపు ఇవ్వాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను తిరస్కరించారు.

నేడు రాష్ట్రపతి పర్యటన.. ట్రాఫిక్ ఆంక్షలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉత్తర మండలం పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేట్ ఫ్లైఓవర్, హెచ్‌పీఎస్ ఔట్‌గేట్, పీఎన్‌టీ ఫ్లైఓవర్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా జంక్షన్, టివోలి, జేబీఎస్, సికింద్రాబాద్ క్లబ్, కార్ఖానా జంక్షన్లు, తిరుమలగిరి, ఆల్వాల్, బొల్లారం, రాణిగంజ్, గ్రీన్‌లాండ్స్ జంక్షన్, సోమాజిగూడ రోడ్, యశోద ఆసుపత్రి, ఎంఎంటీఎస్, వీవీ విగ్రహం కూడలి (ఖైరతాబాద్), పంజాగుట్ట, ఎన్‌ఎఫ్‌సీఎల్, ఎన్టీఆర్ భవన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లిస్తామని పేర్కొన్నారు.

ప్రజావాణిలో 63 అర్జీల తక్షణ పరిష్కారం

సోమాజిగూడ: మహాత్మా జ్యోతిబా పులే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలకు అధికారులు తక్షణ పరిష్కారం చూపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌ఛార్జి డా. జి.చిన్నారెడ్డి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మొత్తం 365 అర్జీలు రాగా 63 సమస్యలు తక్షణం పరిష్కారమైనట్లు అధికారులు తెలిపారు. మిగతా అర్జీలను పోర్టల్ ద్వారా సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. రెవెన్యూ-105, విద్యుత్తు-58, ఎస్సీ సంక్షేమం-42, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి-29, మైనారిటీ- 26, ప్రవాసీ ప్రజావాణి -22, ఇతర శాఖలకు 83 అర్జీలు వచ్చాయి. ప్రజావాణి అధికారి దివ్య పాల్గొన్నారు.

మూసీ సుందరీకరణ పేరిట దందా

ఫిల్మ్‌నగర్: మూసి సుందరీకరణ పేరుతో దందా నడుస్తోందని భారాస రాష్ట్ర నాయకులు పి. కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. మూసీ సుందరీకరణ పేరిట దోచుకునే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందన్నారు. మూసీ వెంట ఉన్న వారికి కేసీఆర్ అండగా ఉంటారన్నారు. సమావేశంలో రాకేష్‌కుమార్, వై. సతీష్‌రెడ్డి, గజ్జల నగేష్, పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోండి

ఖైరతాబాద్: మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్న దుకాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆరిజన్ డైయిరీ సీఏఓ బోడపాటి శేజల్ ఆబ్కారీ శాఖను కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాధవి వైన్స్‌లో మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆబ్కారీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు.

'అడ్డదారుల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు'

ఖైరతాబాద్: కొందరు సచివాలయం వేదికగా అడ్డదారుల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని తెలంగాణ నిరుద్యోగ రక్షణ ఐకాస ఛైర్మన్ డా. మహిపాల్ యాదవ్ ఆరోపించారు. మరో వారం రోజుల్లో కొన్ని పోస్టులు భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

'ముక్కుసూటితనం వల్లే లక్ష్మణ్ బాపూజీ ముఖ్యమంత్రి కాలేదు'

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ముక్కు సూటిగా ఉండటం వల్లనే కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యమంత్రి కాలేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీపై రూపొందించి 'యూనిటీ - ఏ మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' డాక్యుమెంటరీని విడుదల చేశారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ.. కొండా జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, డాక్యుమెంటరీ దర్శకుడు బడుగు విజయ్ కుమార్‌కి అభినందనలు తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే అనిల్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.



జలదృశ్యంలోలో ఆర్.కృష్ణయ్య తదితరులు



తెలంగాణ భవన్‌లో భారాస నేత మన్నె గోవర్దన్‌రెడ్డి, నేతలు

● బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారాస నేత మన్నె గోవర్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ● లక్ష్మణ్ బాపూజీ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో జలదృశ్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంపీ ఆర్. కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాలు సౌఖ్యంగా జీవించేందుకు తన స్వగృహమైన జలదృశ్యాన్ని ఉద్యమానికి అప్పగించారని కొనియాడారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జైప్రకాష్, పీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, బీసీ నాయకులు సురేష్, శంకర్, రామకృష్ణ, ఉదయ్, తదితరులు ఉన్నారు.

డీజే శబ్దాలపై దృష్టి

జూబ్లీహిల్స్: రానున్న పండుగలతో పాటు ఇతర వేడుకల సమయంలో డీజేల శబ్దాలపై దృష్టి సారిస్తామని బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సామల వెంటకరెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని అవర్ ప్లేస్ హోటల్‌లో శుక్రవారం బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ ప్రాంతాల్లో దసరా సందర్భంగా అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించే మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపు

పంజాగుట్ట: నిమ్స్ నుంచి పంజాగుట్ట చౌరస్తా వరకు కాలిబాటపై ఆక్రమణలను శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్, ఎస్సై ఆంజనేయులు సిబ్బంది ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

శ్మశాన వాటిక అభివృద్ధి చేయండి

ఫిల్మ్‌నగర్: హకీంపేట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ దేరంగుల వెంకటేశ్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించండి

బోరబండ: బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ మహమ్మద్ బాబాఫసియుద్దీన్ అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.

రహదారి విస్తరణ చేపట్టాలి

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి జీహెచ్ఎంసీ ముఖ్య నగర ప్రణాళికాధికారి శ్రీనివాస్‌ను కోరారు. రహదారి ఇరుకుగా ఉండటం వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, గత కొన్ని దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

నెక్లెస్‌రోడ్డులో చెత్త తొలగింపు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూట్స్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు నెక్లెస్ రోడ్డులో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నిఖిల్ పాల్గొన్నారు.



పర్యాటకం చెంత.. మురుగు కుంట!

నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ సమీపంలో పెద్ద ఎత్తున నీరు నిలిచి, పాకురుపట్టి మురుగుగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు పక్కనే హెచ్ఎండీఏ మైదానంలో ఐమ్యాక్స్ సమీపంలో ఈ దుస్థితి నెలకొంది. ఐమ్యాక్స్‌కు వచ్చే వాహనచోదకులు ఈ నీటిలోంచి వెళ్లి వాహనాలు పార్కింగ్ చేయాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా సమస్య ఉన్నా అధికారులు నీరు నిలువకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై నగరవాసులు అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఖైరతాబాద్

అల్లుకున్న నిర్లక్ష్యం

హిమాయత్‌నగర్ డివిజన్ షంషీర్బాగ్ వీధిలో వివిధ ఇంటర్నెట్, కేబుల్ టీవీ సంస్థలకు చెందిన తీగలు ప్రమాదకరంగా, ఇంటి ముందు చేతికి అందేలా ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: వెంగళ్‌రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య జన్మదిన వేడుకలు యూసుఫ్‌గూడలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. భారాస నాయకులు విజయకుమార్, శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి బిల్లులో రాయితీ పేరుతో ఉద్యోగుల చేతివాటం

జూబ్లీహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి బిల్లు చెల్లింపుల వ్యవహారంలో డబ్బులు తీసుకొని రాయితీ ఇస్తున్న ఇద్దరు ఉద్యోగులపై ఆసుపత్రి ప్రతినిధులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసుపత్రి ఆవరణలో ఉన్న ప్రత్యేక బిల్లింగ్ విభాగానికి జనరల్ మేనేజర్‌గా కె. విక్రమ్, అత సహాయకులుగా అరుణ్, భాను పనిచేస్తున్నారు. నగదు చెల్లించి చికిత్స పొందే పేద రోగులకు బిల్లుపై రాయితీ ఇచ్చే అధికారం వీరికి ఉంది. దీనిని అవకాశంగా తీసుకొని రాయితీ ఇస్తామని చెప్పి పలువురి వద్ద డబ్బులు తీసుకొన్నారు. జూన్‌లో ఆసుపత్రిలో ఉన్న ఒక రోగి సహాయకురాలైన నాగజ్యోతికి బిల్లులో రాయితీ ఇస్తామంటూ అరుణ్ డబ్బులు అడిగాడు. అతడి భార్య చరవాణి నంబరు ఇచ్చి అందులో రూ.10వేలు పంపాలని సూచించారు. ఈ డబ్బు తమ ఉన్నతాధికారులకు ఇస్తామని చెప్పారు. దీంతో తనకు మరింత రాయితీ కావాలని కోరింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఒప్పందం కుదరకపోవడంతో నాగజ్యోతి విషయం ఆసుపత్రి వర్గాల దృష్టికి తీసుకెళ్లింది. అంతర్గత విచారణ చేపట్టిన ఆసుపత్రి వర్గాలు విక్రమ్ సూచనల మేరకు అరుణ్ రోగుల నుంచి రాయితీ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆసుపత్రి జనరల్ మేనేజర్ గోపాల్‌రావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామసింహాలకు ఆశ్రయమిస్తే వేధిస్తున్నారు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ షెల్టర్స్‌లో ఆశ్రయం పొందుతున్న గ్రామ సింహాలకు భద్రత లేదని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆరోపించారు. వాటికి విషం ఇంజెక్షన్ ఇచ్చి దారుణంగా చంపేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలకు ఆశ్రయం కల్పిస్తున్న, ఆహారం పెడుతున్న ప్రైవేట్ షెల్టర్స్ నిర్వాహకులనూ వేధిస్తున్నారని అక్షయ పాత్ర ఫీడింగ్ బౌల్ ఫర్ ఏనిమల్స్ నిర్వాహకుడు జైదీప్ కుమార్, ఏనిమల్స్ హోమ్ ఎన్జీఓ నిర్వాహకులు సహస్ర, రాజా వాసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరంలో ఐదు జోన్లలో ఐదు షెల్టర్స్ ఉన్నాయని, వీటిలో ఆశ్రయం పొందుతున్న శునకాల పరిస్థితి దారుణంగా ఉంది. గత ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలో కుక్కలను పట్టుకునేందుకు రూ. 18కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది ఇప్పటి దాకా దాదాపు రూ. 12కోట్లు ఖర్చు చేసినా ఉపయోగం లేదన్నారు. సమావేశంలో జంతు ప్రేమికులు ధనలక్ష్మి, రాధారెడ్డి, అనురాధ మాట్లాడారు.

పక్వాడ వైద్యశిబిరాలకు మంచి స్పందన



మందులు పంపిణీ చేస్తున్న సెంట్రల్ జిల్లా భాజపా అధ్యక్షుడు గౌతంరావు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 'పక్వాడ' పేరిట పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలకు మంచి స్పందన లభిస్తోందని భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్‌సుల్తాన్‌నగర్ సామాజిక భవనంలో భాజపా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఆధ్వర్యంలో సరిత కృష్ణ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం అక్టోబరు రెండవ తేదీ వరకు ఉంటుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భాజపా రాష్ట్ర కమిటీ సభ్యులు లంకల దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంబాల గంగరాజు, డివిజన్ అధ్యక్షుడు రాజేష్, నగర నాయకులు అట్లూరి రామకృష్ణ, నాగేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, సరిత, ప్రసన్న, గణేష్, సునీత, ఓల్డ్‌సుల్తాన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ మెమరీ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: హైదర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు అక్టోబర్ 20న నగరంలో జరిగే 15వ ఇండియన్ నేషనల్ మెమరీ ఛాంపియన్‌షిప్ 2024కి ఎంపికయ్యారు. జూబ్లీహిల్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియన్ మెమరీ స్పోర్ట్స్ కౌన్సిల్ నుంచి ఛాంపియన్‌షిప్ చీఫ్ ఇన్‌ఛార్జి డా. పి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలో జ్ఞాపకశక్తిపై సదస్సు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఛాంపియన్‌షిప్ రుసుము వైరల్ పే సేల్స్ అండ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ అందించిందన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమార్‌ను అభినందించారు. మదీనా మహేక్, లాస్య, అనూష, మల్లికార్జున్, సమీమ్ ఇస్లాం ఎంపికైన వారిలో ఉన్నారని ప్రిన్సిపల్ చెప్పారు.

యువతి అదృశ్యం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: దర్జీ వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన యువతి అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక బీదర్‌కు చెందిన యువతి(17) గ్రామంలో ఓ యువకుడితో సన్నిహితంగా ఉంటోందని, మూడు నెలల కిందట బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబరు 1లో ఉంటున్న సోదరి వద్ద వదిలి వెళ్లారు. ఈనెల 22న టైలర్ వద్ద వస్త్రాలు ఇచ్చి వస్తానని చెప్పి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై దాడి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నిద్రిస్తున్న వ్యక్తిపై కర్రతో దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన మోతీలాల్ చిత్తు కాగితాలు సేకరిస్తూ రాత్రి వేళ ఖైరతాబాద్‌లోని సెన్సేషన్ థియేటర్ ప్రాంతంలోని కాలిబాటలపై నిద్రిస్తుంటాడు. గురువారం రాత్రి ఎప్పటి మాదిరిగా నిద్రించగా అదే వృత్తిలో ఉంటున్న బీదర్‌కు చెందిన దిలీప్ కర్రతో అతన్ని బలంగా కొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైనులో హుక్కా వ్యాపారం.. వ్యక్తి అరెస్టు

ఖైరతాబాద్: ఆన్‌లైన్ హుక్కా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన నాగరాజు అలియాస్ రాజాకింగ్ ఖైరతాబాద్‌లోని మారుతీనగర్‌లో నివాసం ఉంటూ గతంలో బంజారాహిల్స్‌లోని ఓ కేఫ్‌లో పనిచేసేవాడు. అక్కడ హుక్కా వాడుతున్న వారితో పరిచయాలు ఏర్పడటంతో ఆర్నెళ్లుగా సొంతంగా అవసరమైన పరికరాలన్నీ తెచ్చుకున్నాడు. అవసరం ఉన్న కస్టమర్లకు హుక్కాను వారి ఇంటికే పంపిస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి అతడి ఇంటిపై దాడి చేసి హుక్కాకు వినియోగించే 14 రకాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఖైరతాబాద్ పోలీసులకు అప్పగించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జికి విద్యుదాఘాతం.. ఒకరికి గాయాలు

ఖైరతాబాద్: నిత్యం పర్యాటకులతో రద్దీ ఉండే ఎన్టీఆర్ గార్డెన్ ఎదుట ఫుట్ ఓవర్ బ్రిడ్జికి విద్యుదాఘాతం ఏర్పడి ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాల్లోకి వెళ్లితే.. ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో గప్‌చుప్ బండిని నిర్వహించేందుకు గురువారం మధ్యాహ్నం కామారెడ్డికి చెందిన షేక్ ముజీబ్ ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి అనుకోగా తాకడంతో విద్యుదాఘాతమై వేగంగా పక్కకు తప్పుకున్నాడు. అప్పటికే వీపు భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానిక వ్యాపారులు బ్రిడ్జిపైకి పర్యాటకులు వెళ్లకుండా కట్టడి చేశారు. విద్యుత్తు అత్యవసర నంబరుకు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశారు. ముజీబ్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈ విషయమై విద్యుత్తు అధికారులను సంప్రదించగా వారు.. విద్యుత్తు తీగ దెబ్బతిని ఓ చోట విద్యుదాఘాతం వచ్చిందని, బ్రిడ్జిని పూర్తిగా తనిఖీ చేయగా ఎలాంటి విద్యుత్తు ప్రసారం లేదన్నారు.

పాదచారి చరవాణి చోరీ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: అర్ధరాత్రి వేళ ఒంటరిగా వెళ్తున్న యువకుడిపై దాడిచేసి చరవాణి ఎత్తుకెళ్లిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లికి చెందిన నవీన్ విద్యార్థి. మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 26న రాత్రి 2 గంటల సమయంలో అమీర్‌పేట్‌లో స్నేహితుడిని కలిసి ఒంటరిగా వస్తున్నాడు. ఎస్సార్‌నగర్ మెట్రో స్టేషన్ వద్దకు చేరుకునే సరికి బైక్‌పై అపసవ్య దిశలో వచ్చిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు నవీన్ చెంపపై కొట్టారు. నవీన్ కిందపడటంతో అతని సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై డ్రైవర్ దురుసు ప్రవర్తన

నారాయణగూడ, న్యూస్‌టుడే: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా.. దురుసుగా ప్రవర్తించిన డ్రైవర్‌పై నారాయణగూడ పోలీసు ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండకు చెందిన సర్వర్ ఓ కొరియర్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పని మీద హిమాయత్‌నగర్ వైపు వచ్చి, ఇక్కడి మినర్వా హోటల్ దగ్గర రోడ్డు మధ్యలో కారు నిలిపాడు. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న నారాయణగూడ బ్లూకోర్ట్స్ పోలీసులు అక్కడికి చేరుకొని వాహనం పక్కన నిలపాలని సూచించారు. దీంతో సర్వర్ దురుసుగా ప్రవర్తించాడు. కానిస్టేబుల్ నరసింహాచారి, హోంగార్డు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తు.. విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మద్యం మత్తు వల్ల అదుపు తప్పిన కారు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు, ఓ యువతి స్వల్పంగా గాయపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన రోహిత్ వెంకట్, అతడి స్నేహితులైన సంతోష్, చిన్మయి మునగాల, ఓ యువతి కలిసి జూబ్లీహిల్స్‌లోని డౌన్‌టౌన్ పబ్‌కు వచ్చారు. వెంకట్ కొద్ది రోజుల్లో విదేశాలకు వెళ్తుండటంతో స్నేహితులకు పార్టీ ఇవ్వడానికి వీరంతా ఇక్కడికి వచ్చారు. పబ్‌లో అతిగా మద్యం తాగి ఇంటికి కారులో బయలుదేరారు. అర్ధరాత్రి 12.10 గంటల ప్రాంతంలో రోడ్ నంబరు 37 లోని క్యూ హబ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఎంజీ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనంలోని బెలూన్‌లు తెరుచుకున్నాయి. కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ఉన్న వారు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించగా వెంకట్ రోహిత్‌కు మద్యం మోతాదు శాతం 240గా వచ్చింది. మిగిలిన వారూ మద్యం తాగినట్లు గుర్తించారు. విద్యుత్తు స్తంభం దెబ్బతినడంతో టీజీఎస్పీడీసీఎల్ ఏఈ మహమూద్ శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి



రామ ధనుస్సుకు పూజలు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: అయోధ్య రామాలయంలో ఏర్పాటు చేయనున్న ధనుస్సుకు జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రీనగర్‌లోని సత్యవరపు వీరభద్రరావు ఇంట్లో శుక్రవారం పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ధనుస్సుపై పుష్పాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కిలో బంగారం, 13 కిలోల వెండితో దీన్ని తయారు చేశారు. అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధనుస్సును నగరంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి పూజలు చేశారు.

మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసాని వీరేష్



నిజాంపేట, న్యూస్‌టుడే: కబడ్డీ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కాసాని వీరేష్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. బాచుపల్లిలోని కబడ్డీ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా తిరుమల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రహాస్, సంయుక్త కార్యదర్శిగా ఎన్. రమాదేవి, కోశాధికారిగా జి.వి.సుబ్రమణ్యం, సభ్యులుగా జాహింగీర్, కృష్ణవినీల ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా హైకోర్టు న్యాయవాదులు శ్రీనివాస్, దేవేందర్ వ్యవహరించారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్, జగదీష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎవరూ ఏమనరని..

అపసవ్య దిశలో వెళ్లే ఇలాంటి వారి కారణంగా ఇతర వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ట్రాఫిక్ జామ్ అవుతుందని తెలిసినా కూకట్‌పల్లి జాతీయ రహదారి సుమిత్రా నగర్ యూటర్న్ వద్ద ఈ పరిస్థితి రోజూ కనిపిస్తుంది.









ఎంతకాలం ఇలా వెళ్లాలని..

వర్షాలకు కూకట్‌పల్లి డివిజన్ ప్రకాష్‌నగర్ నుంచి దేవీస్థాన హోమ్స్ రోడ్డులో గుంతలు ఏర్పడి వాన నీరు నిలుస్తోంది. దీంతో బురదలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులూ ఇకనైనా స్పందిస్తారా?

ఎన్నాళ్లయినా ఏం కాదని..

కూకట్‌పల్లి డివిజన్ పాపారాయుడు నగర్ హైటెన్షన్ లైన్‌లో కొత్తగా రోడ్డు నిర్మించారు. ఒకవైపు రోడ్డు మాత్రమే తెరిచి వాహనాలను అనుమతిస్తున్నారు. వారం గడుస్తున్నా వ్యర్థాలను తొలగించలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.





ఉచిత వైద్య శిబిరానికి స్పందన



బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ ఇంద్రానగర్ సామాజిక భవనంలో శుక్రవారం కంఫర్ట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు వైద్యులు బీపీ పరీక్షలు చేశారు. మొత్తం 500 మందికి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కొట్లాడుకున్న విద్యార్థుల నుంచి వివరణ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ మెటలర్జీ, మెకానికల్ విభాగంలో విద్యార్థులు కొట్లాడుకోవడంపై వారి నుంచి ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి వివరణ తీసుకున్నారు. మెటలర్జీలో స్ఫూర్తి కార్యక్రమ నిర్వహణ విషయంలో, మెకానికల్ క్లాస్ రిప్రజెంటేటివ్ ఎన్నిక విషయంలో ఇరువర్గాలకు తరగతి గదుల్లో వేర్వేరుగా జరిగిన కొట్లాటల నేపథ్యంలో విచారణ కమిటీలు ఏర్పాటుచేశారు. విద్యార్థులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీల తొలగింపు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ప్రధాన ద్వారం ముందు ఉన్న పలు రకాల ఫ్లెక్సీలను శుక్రవారం కేపీహెచ్‌బీ ఎస్‌ఐ శ్రీలతారెడ్డి సిబ్బందితో తీయించారు. తాజాగా ప్రధాన ద్వారం వద్ద ఎన్ఎస్‌యూఐ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయంలో కూకట్‌పల్లి విద్యార్థి నేతలు, ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వర్సిటీలోని కొందరితో గొడవ జరిగిన నేపథ్యంలో ఆమె అన్ని ఫ్లెక్సీలను తొలగింపజేశారు. అలాగే విద్యార్థి నేతలు అనుమతి లేకుండా క్యాంపస్‌లో ఫ్లెక్సీలు, గోడపత్రికలు ఏర్పాటుచేయవద్దని అధికారులు సూచించారు.

'దేవర'ను వీక్షించిన రాజమౌళి దంపతులు

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్‌లోని విమల్ థియేటర్‌లో శుక్రవారం తెల్లవారుజామున ప్రదర్శించిన 'దేవర' సినిమా బెనిఫిట్ షోను సినీ దర్శకుడు రాజమౌళి దంపతులు వీక్షించారు. ఈ సందర్భంగా సినిమా థియేటర్ వద్ద జూ.ఎన్టీఆర్ అభిమానులు సందడి చేశారు.

పరీక్షల్లో అవకతవకలపై విచారించాలి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: దుండిగల్‌లోని ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నాయని వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని జేఎన్‌టీయూ విద్యార్థి నేత యశ్వంత్ ఆధ్వర్యంలో శుక్రవారం రిజిస్ట్రార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

భారీ భవంతులకు షాక్ ఇచ్చారు

20 కిలోవాట్లు దాటితే నియంత్రిక తప్పనిసరి

1000 భవనాల గుర్తింపు.. నోటీసుల జారీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

భారీ భవంతులు.. బహుళ అంతస్తుల భవనాల్లో కొందరు సర్వీసు మీటర్లతోనే సరిపెడుతున్నారు. మరికొందరు లోడు తక్కువగా ఉందని మీటర్లు తీసుకొని ప్యానల్ బోర్డు పెట్టుకున్నప్పటికీ తర్వాత లోడు పెరిగినా అలాగే నెట్టుకొస్తున్నారు. ఫలితంగా నియంత్రికలపై లోడు అధికమై తరచూ ఫ్యూజ్‌లు పోవడం.. లోఓల్టేజీ సమస్య తలెత్తడం.. కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడడం జరుగుతుంది. దీంతో వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. టీజీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్స్ పరిధిలోని కూకట్‌పల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, బోయిన్‌పలి డివిజన్లలో నియంత్రికలు ఏర్పాటు చేసుకోని భవనాలను గుర్తించి నోటీసులు ఇస్తున్నారు.



వినియోగదారుడికి జారీ చేసిన నోటీసు

నియంత్రిక ఏర్పాటు చేసుకోవాలంటే ఇంటి ముందు సరిపడా స్థలం ఉండాలి. 20-30 కిలోవాట్ల మధ్య విద్యుత్ వినియోగిస్తున్న వారు 25 కేవీఏ నియంత్రిక ఏర్పాటు చేసుకోవాలి. అందుకు కనీసం రూ.2.50 లక్షల వ్యయం అవుతుంది. వ్యక్తిగతంగా ఇబ్బంది ఎదురైతే బృందంగా ముందుకొచ్చినా నియంత్రిక ఏర్పాటు వెసులుబాటు ఉందంటున్నారు అధికారులు.

ముమ్మరంగా పరిశీలన

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో మొత్తం 11 డివిజన్లు ఉన్నాయి. ఇందులో కేపీహెచ్‌బీకాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్‌కాలనీ, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తు భవనాలతోపాటు వాణిజ్య సముదాయాలు అధిక సంఖ్యలో ఉంటాయి. మిగతా బాలానగర్, ఫతేనగర్, మూసాపేట, అల్లాపూర్ తదితర డివిజన్లలోనూ బహుళ అంతస్తుల భవనాలు ఉన్నప్పటికీ.. ఎక్కువగా సామాన్య, మధ్య, పేద వర్గాలకు చెందిన గృహాలుంటాయి.

వాస్తవంగా 20 కిలోవాట్లకంటే ఎక్కువ విద్యుత్ వాడకం ఉండే వ్యక్తిగత ఇంటికైనా.. అపార్ట్‌మెంట్.. డూప్లెక్స్, ట్రిప్లెక్స్ ఇలా ఏదైనా తప్పనిసరిగా వ్యక్తిగత నియంత్రిక ఏర్పాటు చేసుకోవాలి. ఇది పాత నిబంధనే. అయితే ఇటువంటి చాలామంది వినియోగదారులు అంత లోడు తమకు అవసరం రాదని.. కిందిస్థాయి విద్యుత్ సిబ్బందితో లాలూచీ పడి నియంత్రికను ఏర్పాటు చేసుకోకుండా ప్యానల్ బోర్డుతో మీటర్లు పెట్టుకున్న పరిస్థితులున్నాయి. దీని వలన సాధారణ రోజుల్లోనే కాలనీల్లోని నియంత్రికలపై లోడు అధికమై.. తరచూ కరెంటు సరఫరాలో అంతరాయం తలెత్తుతుంది. వేసవిలో ఈ సమస్య మరింత అధికమవుతోంది. దీంతో సిబ్బందితో అన్ని డివిజన్లలో సర్వే చేస్తున్నారు.

వెయ్యిమందికిపైగా నోటీసులు

ఇప్పటివరకు అన్ని సెక్షన్ల పరిధిలో గుర్తించిన వారిలో వెయ్యిమందికిపైగా వినియోగదారులకు నోటీసులు జారీ చేశారు. ఎంత విద్యుత్ వాడుతున్నారో ఆయా నోటీసుల్లో స్పష్టం చేస్తూ 20 కిలోవాట్ నిబంధనను పేర్కొంటూ ప్రత్యేకంగా నియంత్రిక ఏర్పాటుచేసుకోవాలని సూచిస్తున్నారు. నోటీసులు అందుకున్నవారిలో జీ+3, జీ+2 భారీ భవంతులు, డూప్లెక్స్, కొన్ని అపార్ట్‌మెట్లు, మరి కొందరు వాణిజ్య సముదాయాల వారు ఉన్నారు. 25-60 కిలోవాట్ల వరకు విద్యుత్ వినియోగిస్తున్న వారు ఇందులో ఉండడం గమనార్హం.



పర్వత్‌నగర్ ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త

అపరిశుభ్రంగా ఆసుపత్రి పరిసరాలు

అల్లాపూర్, న్యూస్‌టుడే: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి పిచ్చి గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆసుపత్రి వెనుకగేటు సమీపంలో గృహ నిర్మాణాల వస్తువులు, వ్యర్థాలు సైతం కుప్పలుగా పేరుకున్నాయి. ఆసుపత్రి ఆవరణ కొన్నిచోట్ల ఎత్తు, పల్లాలుగా ఉండటంతో వర్షం కురిసినపుడు నీరు నిలుస్తోంది. ఆవరణ అంతా చిత్తడిగా మారుతోంది.



పర్వత్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి అవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి



ఈపీఎస్ 95 పింఛనుదారుల ఆందోళన

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఈపీఎస్ 95 తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ పీఎఫ్ కార్యాలయం ఎదుట పింఛనుదారులు ఆందోళన చేశారు. కొన్నేళ్లుగా కనీస పింఛను రూ.7,500 డీఏతో కలిపి ఇవ్వాలని, పింఛనుదారుడితోపాటు కుటుంబసభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నినదించారు. తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ప్ల కార్డులు పట్టుకొని విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రాన్ని పీఎఫ్ కమిషనర్-1 హేమంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

మూసాపేట, న్యూస్‌టుడే: మోతీనగర్ పరిధి బబ్బుగూడలో భూగర్భ మురుగు నీటి మ్యాన్‌హోల్ ధ్వంసమైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీన్ని గుర్తించిన స్థానికులు ధ్వంసమైన మ్యాన్‌హోల్ వద్ద కర్రను నిలబెట్టి వచ్చిపోయే వారిని అప్రమత్తం చేశారు. సమస్యను జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లింది. స్పందించిన ఆయన శుక్రవారం మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు.





వీధి వెలుగులు పునరుద్ధరణ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాపు సమీపంలోని ఎల్ఐజీ 961 రోడ్డులో కొన్నిరోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు అంధకారం రాజ్యమేలుతుండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని మూసాపేట సర్కిల్ ఎలక్ట్రికల్ డీఈ స్వప్న దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆమె స్పందించి సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

మ్యూజియాన్ని సందర్శించిన చిన్నారులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని రెయిన్‌బో స్కూల్ చిన్నారులను ఉపాధ్యాయులు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని నెహ్రూ సెంటనరీ ట్రైబల్ మ్యూజియం సందర్శనకు తీసుకెళ్లారు. అక్కడ ఆకర్షణీయమైన చిత్రాలను చిన్నారులకు చూపించి వాటి గురించి ఉపాధ్యాయులు వివరించారు.



స్తంభాలు.. ఆటంకాలు



కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డులో



కేపీహెచ్‌బీలో రోడ్డు పక్కన

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డులో నడిరోడ్డుపై విద్యుత్తు స్తంభాల తొలగింపునకు జీహెచ్ఎంసీ తీవ్ర జాప్యానికి టీజీఎస్‌పీడీసీఎల్ తాత్సారం తోడైంది. ఫలితంగా స్తంభాల కారణంగా ప్రమాద తీవ్రత పెరుగుతోంది. సమస్యను సుమారు 3 ఏళ్లుగా నాన్చుతున్నారు. సమస్య తీవ్రతపై ఇప్పటికే 'ఈనాడు' పలు కథనాలు ప్రచురించి ముున్ముందు ఊహించని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో అధికారుల్లో కొంత కదలిక వచ్చింది. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం స్తంభాల తొలగింపునకు అప్పటి టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులకు ఖర్చయ్యే ప్రతిపాదనలు పంపమని కోరింది. దీంతో దాదాపు రూ.30 లక్షలకుపైగా అవుతుందని టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అప్పుడు జీహెచ్ఎంసీ వద్ద సరిపడా బడ్జెట్ లేదు. కాలయాపన మూల్యానికి టీఎస్ఎస్‌పీడీసీఎల్ పంపిన ధరలు పాతవి అవడంతో కొత్తవాటికి మరల పంపమని జీహెచ్ఎంసీ కోరింది. కేపీహెచ్‌బీ విద్యుత్తు కేంద్రానికి పూర్తిస్థాయి ఏడీఈ లేక ప్రతిపాదనల అంశం పెండింగ్‌లో ఉండిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఎంత తాత్సారం జరిగితే అన్ని ప్రమాదాలు జరుగుతాయి. 2022 ఏప్రిల్‌లో రాత్రి ఓ కారు దారికి అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టగా కారు నడిపిన వ్యక్తి అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. తర్వాత ఓ ద్విచక్ర వాహనదారుడికి త్రుటిలో ప్రమాదం తప్పింది. గుడిసెల ముందున్న స్తంభం మధ్యలో, కింది భాగంలో ధ్వంసమైంది. గట్టి గాలివాన, వాహనాల ధాటికి అది ఎప్పుడైనా నేలరాలితే ప్రమాదమే. తొలగించాల్సిన ఇలాంటి స్తంభాలు సుమారు 12 ఉన్నాయి.

మూత తీసి.. పైపు పెట్టేసి..

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ బస్టాపు సరిగ్గా షెల్టర్ ముందు భూగర్భ డ్రైనేజీ ప్రమాదకర లోతైన మ్యాన్‌హోల్ గుంత ఉంది. దీంతో జాలీ ఏర్పాటుచేశారు. ఈ మూత తీసి అందులోకి పక్కనే ఉన్న ప్రైవేటు స్థలం సెల్లార్‌లోకి వస్తున్న వాన నీటిని డ్రైనేజీలోకి పంపేందుకు పైపు వేశారు. వర్షాల సమయంలో మూతలు తీయడమే ప్రమాదకరమని జలమండలి ప్రచారం చేస్తున్నా దీన్ని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు.



ప్రగతినగర్ చెరువులో తేలిన రాజేశ్ మృతదేహం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: రాజేశ్ మృతదేహం ప్రగతినగర్ చెరువులో తేలింది. కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని ప్రగతినగర్ చెరువు వద్ద తాను ఆత్మహత్య చేసుకుంటానని రాజేశ్ అనే వ్యక్తి వీడియోకాల్ చేసి తర్వాత స్పందించని విషయం తెలిసిందే. ఈనెల 25న గోకుల్ ప్లాట్స్ వెంకటరమణ కాలనీలోని ఇంటి నుంచి బయటకు వచ్చిన రాజేశ్ రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా మద్యం మత్తులో మాట్లాడాడు. అదే సమయంలో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం చెరువు పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం చెరువులో ఓ మృతదేహం ఉన్నట్లు స్థానికులు ట్రాఫిక్ పోలీస్‌కు చెప్పగా ఇదే విషయాన్ని కేపీహెచ్‌బీ ఠాణాకు అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పరిశీలించి రాజేశ్ (32) మృతదేహంగా గుర్తించారు. శవపరీక్ష అనంతరం మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



మూసాపేట, న్యూస్‌టుడే: మూసాపేట పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారాస డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిరక్షించాలని ధర్నా

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ డివిజన్ నవజీవన్‌నగర్‌లోని రూ.కోట్ల విలువైన పార్కు స్థలాన్ని పరిరక్షించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేస్తూ శుక్రవారం పార్కు స్థలం వద్ద ధర్నా చేశారు. కొందరు కాజేయాలని పథకం రూపొందిస్తున్నారని వెంటనే స్థలాన్ని పూర్తిస్థాయిలో ఉద్యానంగా అభివృద్ధి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, పి.శంకర్, జగన్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు

సమయం: ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు.

ప్రాంతాలు: బాలానగర్ గీతానగర్, రాజు కాలనీ, కల్యాణీనగర్, సాయినగర్, సెయింట్ జోసెఫ్ స్కూల్, పోచమ్మ దేవాలయం పరిసరాలు. – బాలానగర్, న్యూస్‌టుడే

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

బర్డ్ వాక్ బ్రోచర్ ఆవిష్కరణ



మాదాపూర్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్ బ్రోచర్‌ను, విద్యార్థులు గార్డెన్‌ను సందర్శించే విధానాన్ని వివరించే బ్రోచర్‌ను అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.జి.చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఫైనాన్స్ సెక్రటరీ రవి, అడిషనల్ పీసీసీఎఫ్ సునీత బాగవత్, చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్ రామలింగం, జనరల్ మేనేజర్ డా.జి.స్నైలాబ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం తనూజ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోస్టర్లపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలకు దారి తీయడం, అపరిశుభ్రత, నగర వాతావరణాన్ని అధ్వానంగా మార్చుతున్న పోస్టర్లపై జీహెచ్‌ఎంసీ నిషేధం విధించింది. అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, చెట్లు, విద్యుత్తు స్తంభాలకు ప్రకటనలు తగిలించడం, రహదారులపై బోర్డులను ఏర్పాటు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిషేధాజ్ఞలను పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. సర్కిళ్ల ఉపకమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై పత్రాలను అంటించకుండా అవగాహన కల్పించాలన్నారు. గోడలపై ప్రకటనలు, నినాదాలు, ఇతర రాతలు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉపకమిషనర్లు నిర్లక్ష్యం వహిస్తే తాఖీదులు తప్పవన్నారు. ఎవరైనా నిషేధాజ్ఞలు పట్టించుకోకపోతే జరిమానా వేయాలని, రోజువారీ నివేదికలు పంపాలని తెలిపారు.

రాష్ట్రపతి పర్యటన.. ట్రాఫిక్ మార్గదర్శకాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పలుమార్గాల్లో ట్రాఫిక్ రద్దీకి అవకాశం ఉందని, ప్రజలు ప్రత్యామ్నాయాలు చూసుకోవడంతోపాటు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉదయం 11–12.30 వరకు రద్దీకి అవకాశం ఉండే మార్గం: హకీంపేట్ వై జంక్షన్ మీదుగా, ఎన్ఐఎస్ఏ, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, తూముకుంట వై జంక్షన్, బిట్స్ జంక్షన్, రోటరీ, ఆరెంజ్ బౌల్, నల్సార్ చౌరస్తా, పెద్దమ్మ కాలనీ, నల్సార్ ప్రధాన ద్వారం, నల్సార్ ఆడిటోరియం మార్గం.

మధ్యాహ్నం 2.30–4: నల్సార్ యూనివర్సిటీ కాలేజ్ ఆడిటోరియం, ప్రధాన ద్వారం, పెద్దమ్మ కాలనీ, నల్సార్ చౌరస్తా కుడి మలుపు, శామీర్‌పేట ఠాణా, ఆరెంజ్ బౌల్ రోటరీ, బిట్స్ జంక్షన్, తూముకుంట వై జంక్షన్, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, ఎన్ఐఎస్ఏ, హకీంపేట్ వై జంక్షన్ మీదుగా నగర పరిధి రహదారిలో ట్రాఫిక్ ప్రభావితమయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు ట్రాఫిక్ యంత్రాంగానికి సహకరించాలని జాయింట్ సీపీ సూచించారు.

పర్యవేక్షణ కరవు.. సమస్యలు తీరవు

- పటాన్‌చెరు పారిశ్రామికవాడలో మౌలిక వసతులు మృగ్యం
- మూడేళ్లుగా పెండింగ్‌లో ఐలా కార్యవర్గ ఏర్పాటు



పటాన్‌చెరు పారిశ్రామివాడ ముఖచిత్రం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న పట్టణ పారిశ్రామికవాడలో ఐలా కార్యవర్గం మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో మౌలిక వసతుల కల్పన మృగ్యంగా మారింది. రూ.కోట్ల విలువచేసే టీజీఐఐసీ భూములు చేతులు మారుతున్నాయి.

సభ్యత్వ నమోదు అయినా

ఐలా కమిషనర్ ప్రత్యేకంగా లేక కార్యవర్గం గడువు ముగియడంతో పర్యవేక్షణ లేకుండాపోయింది. ఐలా కార్యవర్గ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాలంటే పరిశ్రమల యజమానుల్లో 60శాతం సభ్యత్వ నమోదు ఉండాలి. దీన్ని పూర్తిచేసి పారిశ్రామికవేత్తలు జెడ్‌ఎంకు అందజేసి నెలపైన కావొస్తున్నా కార్యవర్గ ఎంపికకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

సమస్యల తిష్ఠ

● పారిశ్రామికవాడలో ఒక ఎస్టేట్, ఐదు ఫేజ్‌ల్లో చిన్నా పెద్దాకలిసి 550పైనే పరిశ్రమలుండగా, దాదాపు 450 నడుస్తున్నాయి.

● ఫేజ్-3 పంచముఖి వీరహనుమాన్ దేవాలయ నుంచి ఈఎస్‌ఐకు మీదుగా అక్కడి నుంచి ఫేజ్-5 పరిశ్రమలవైపు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. వీధిపాలు పనిచేయడం లేదు.

● జాతీయరహదారి నుంచి అగర్వాల్ రబ్బర్ పరిశ్రమ మీదుగా ఉన్న రహదారి ధ్వంసంకాగా, మార్కెట్ కమాన్ నుంచి లోపలికి వెళ్లే దారి ఎప్పుడూ నీటితో నిండిఉంటుంది.

● ఫేజ్-1లో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. రాసుటూల్స్ పరిశ్రమ నుంచి బండ్లగూడకు వెళ్లే రహదారి ధ్వంసమైంది. చాలాచోట్ల డ్రైనేజీ బ్లాక్ అయింది.

● ఏషియన్ పెయింట్స్ పరిశ్రమకు వెళ్లే దారిలో వీధిదీపాలు వెలగడంలేదు.

నిలిచిన నీటి సరఫరా

ఫేజ్ 2, 4లతోపాటు 1లోని కొంతభాగంలో 170 పరిశ్రమలకున్న నీటి కనెక్షన్లు కమర్షియల్ కేటగిరిలోకి జలమండలి మార్చింది. దీంతో అసలుకు, వడ్డీ తోడై దాదాపు రూ.10 కోట్ల వరకు బకాయి చేరిందని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. దీంతో జలమండలి నీటిసరఫరా నిలిపివేసింది.

నిబంధనలకు పాతర

పారిశ్రామికవాడలో మూతపడిన, ఉత్పత్తులు నిలిపివేసిన పారిశ్రామిక స్థలాలు విభజించి వేరే వారికి విక్రయించేందుకు టీజీఐఐసీ నుంచి సబ్‌డివిజన్ అనుమతి తీసుకోవాల్సి ఉంది. నిబంధనలు పక్కనపెట్టి రూ.కోట్లు విలువచేసే పారిశ్రామిక స్థలాలను ఫేజ్-1లో రెండుచోట్ల విభజించి వేరే వారికి రియల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. కొన్ని పారిశ్రామికస్థలాల్లో ఏకంగా నివాసగృహాలు నిర్మించుకున్నారు.

ప్రధాన కార్యాలయం ఆదేశాలమేరకే:

ఐలా కార్యవర్గ ఏర్పాటు విషయంపై టీఎస్ఐఐసీ ప్రధాన కార్యాలయం ఆదేశాలమేరకే వ్యవహరిస్తాం. ఉన్నతాధికారులు తెలియజేసిన తర్వాత అక్కడి నుంచి ఎవరైనా వచ్చి నిర్వహిస్తే ఎన్నికలు జరుగుతాయి. – రతన్ రాథోడ్, టీజీఐఐసీ జోనల్‌మేనేజర్

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414 మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201 రాయదుర్గం - 9848990352, పటాన్‌చెరు(రూ) - 8008573228 చందానగర్ - 8008555322

పటాన్‌చెరు, పటాన్‌చెరు అర్బన్, శేరిలింగంపల్లి, చందానగర్, మాదాపూర్, మియాపూర్,న్యూస్‌టుడే:

? అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి నర్రెగూడ రోడ్డులో వీధి దీపాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్లు పాడయ్యాయి. చీకట్లో ప్రయాణం చేస్తుంటే ప్రమాదాల బారిన పడుతున్నాం.– సురేష్, నర్రెగూడ

✓ నర్రెగూడ రోడ్డులో వీధి దీపాలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదు. తప్పకుండా దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. –జ్యోతిరెడ్డి, కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

? పటాన్‌చెరు పారిశ్రామికవాడకు వెళ్లే రహదారిలోని బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద వర్షం వచ్చిందంటే వరదలా మారి రోడ్డు పాడవుతుంది. దీనికి శాస్వత పరిష్కారం చూపాలి. –విజయ్‌కుమార్, పటాన్‌చెరు

✓ అక్కడ పల్లంగా ఉండటంతో వర్షపునీరు చేరుతుంది. ఎప్పటికప్పుడు నీరు తొలగించేలా చర్యలు తీసుకుని ఇబ్బంది లేకుండా చూస్తాం. – సురేష్‌కుమార్, ఉపకమిషనర్

? పాపిరెడ్డి కాలనీ చందానగర్ ఎంఎంటీఎస్ స్టేషన్ సమీపంలో ఉన్న మట్టి రోడ్డు పక్కన పెద్దఎత్తున చెత్త వేస్తున్నారు. –రాజేష్ గొట్టిముక్కల, పాపిరెడ్డికాలనీ

✓ సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపి పరిశీలించి తీసుకుంటాం. –ముకుందరెడ్డి, ఉపకమిషనర్, శేరిలింగంపల్లి సర్కిల్

? మంజీరా పైపులైన్ రోడ్డు ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ శ్రీచైతన్య స్కూల్ వద్ద దారి అధ్వానంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందిపడుతున్నాం. –మురళి, హుడాకాలనీ

✓ మట్టికుప్పలు పోయించి చదును చేయిస్తాం. – ప్రతాప్, ఏఈ, ఇంజినీరింగ్ విభాగం చందానగర్ సర్కిల్

? మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఇజ్జత్‌నగర్ విలేజ్ రోడ్డులో చెత్తాచెదారం పేరుకుపోయింది. పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో తొలగించక దుర్గంధంతో ఇబ్బందిపడుతున్నాం. చెత్తను తొలగించాలి. –శివకుమార్, ఇజ్జత్‌నగర్

✓ చెత్తకుప్పలు తొలగించి రోడ్డు శుభ్రం చేయిస్తాం. – శ్రీనివాస్, ఎస్సార్పీ పారిశుద్ధ్య విభాగం, చందానగర్ సర్కిల్

? గంగారం శ్రీరామ్ నగర్‌లో దోమల సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. –త్రినాథ్, శ్రీరామ్ నగర్ కాలనీ

✓ వెంటనే దోమల నివారణ చర్యలు చేపడతాం. – మోహన్‌రెడ్డి, ఉపకమిషనర్ చందానగర్ సర్కిల్

? మియాపూర్ అల్లూరి సీతారామరాజు నగర్ పార్కు రోడ్డు గుంతలమయంగా మారింది. నడవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంది. – దేవిశ్రీప్రసాద్, జేపీఎన్ నగర్

✓ వెంటనే పరిశీలించి మరమ్మత్తులు చేపడతాం. – దుర్గా ప్రసాద్, డీఈ, చందానగర్ సర్కిల్

? ఖానామెట్ ప్రాంతంలో వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నాం. –ప్రసాద్, ఖానామెట్

✓ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని ఆదేశించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –మల్లికార్జున్, ఎలక్ట్రికల్ ఈఈ, శేరిలింగంపల్లి జోన్

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ జేపీఎన్ నగర్ ప్రధాన రహదారిలో హోటళ్ల నిర్వాహకులు రాత్రి వేళల్లో వ్యర్థపదార్థాలను రోడ్లపై పడేస్తున్నట్లు హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన రత్నరాజు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను ఈనాడు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఈనాడు స్థానిక ఎస్‌ఆర్పీ కనకరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయా ప్రాంతాల్లో శుభ్రం చేయడంతో పాటు అక్కడ వ్యర్థాలను పడవేస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు.

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ వైపు చందానగర్ ఎంఎంటీఎస్ స్టేషన్ సమీపంలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ ముకుందరెడ్డికి వివరించగా.. ఆయన ఆదేశాల మేరకు సహాయ వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి స్పందించి చెత్తని తొలగింపజేయించారు.

పెండింగ్ పనులు సత్వరం పూర్తిచేయండి: ఎమ్మెల్యే



జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న గాంధీ

శేరిలింగంపల్లి, వివేకానందనగర్ కాలనీ, న్యూస్‌టుడే: హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్ల పరిధిలో పెండింగు పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్‌చౌహాన్‌ను కోరారు. శుక్రవారం ఆయన్ని కలిసి పలు అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై చర్చించారు. వర్షాలకు ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరించాలని సూచించారు. ఉషాముళ్లపూడి ఆసుపత్రికి వెళ్లే రోడ్డు విస్తరణ చేపట్టాలని, రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలన్నారు. ప్రగతినగర్-జేఎన్‌టీయూ రోడ్డులో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, శ్మశానవాటికల్లో సదుపాయాల కల్పన తదితర పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. ఎస్ఈ చిన్నారెడ్డి, కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాసకాలనీకి చెందిన షణ్ముఖ్‌కు ఎమ్మెల్యే గాంధీ రూ.2.50లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు.

● శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో ఎమ్మెల్యే గాంధీ సమావేశమయ్యారు. మంజీరా పైపులైన్ రోడ్డు పనులు, అమీన్‌పూర్, జోనల్ కార్యాలయం లింకురోడ్డు తదితరాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగేందర్ యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పైపులు పగిలి.. నీరు రోడ్డుపాలు



చందానగర్ జాతీయరహదారి వద్ద తాగునీరు వృథాగా పోతోంది. చందానగర్ ఠాణా వద్ద పైపులైన్ పగిలి నెల రోజులుగా నీరు రోడ్డు పై ప్రవహిస్తోంది. గతంలో ఇక్కడే జలమండలి మరమ్మతులు చేసినా సమస్య తిరగబెడుతోంది. తవ్వకాలతో ఆ ప్రాంతం అంతా గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, చందానగర్

పోషకాహారంతో ఆరోగ్యం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సేవలు ప్రసంశనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో శుక్రవారం ఏర్పాటుచేసిన పోషణ్ అభియాన్‌లో పోషణమాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పోషకాహార లోపంతో ఎదుగుదల లేని పిల్లల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందన్నారు. తక్కువ బరువుతో పుట్టే పిల్లలు బలహీనంగా ఉండే గర్భిణులు, మాతా శిశు మరణాల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోందని తెలిపారు. కార్పొరేటర్లు మెట్టుకుమార్‌యాదవ్, పుష్ప, ఉపకమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయ్‌కుమార్, ఐసీడీసీ అధికారులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి




సైబరాబాద్ కమిషనరేట్‌లో పుష్పాంజలి ఘటిస్తున్న కమిషనర్ అవినాశ్ మహంతి

ఆల్విన్‌కాలనీ, పటాన్‌చెరు, పటాన్‌చెరు అర్బన్, రాయదుర్గం, న్యూస్‌టుడే: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ పోరాటంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, తన జీవితాన్ని రాష్ట్ర సాధనకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు ప్రయాణ ప్రాంగణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు నివాళులర్పించారు. ఆల్విన్ కాలనీ ఎల్లమ్మబండలోని విగ్రహానికి కార్పొరేటర్ రోజాదేవి నివాళులర్పించారు. అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘం ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సైబరాబాద్ కమిషనరేట్‌లో కమిషనర్ అవినాశ్ మహంతి పుష్పాంజలి ఘటించారు. జాయింట్ సీపీ జోయల్ డేవిస్, డీసీపీ కే ప్రసాద్, అదనపు డీసీపీలు రవిచంద్రన్‌రెడ్డి, షమీర్, వెంకట్‌రెడ్డి, సీఏఓ గీత, ఏఓ రషీదా బేగం తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు బస్టాండ్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అమీన్‌పూర్‌లో పురపాలక ఛైర్మన్ పాండురంగారెడ్డి

కోర్టు ఉత్తర్వులు అమలుచేయరా?

- సహకార శాఖ కమిషనర్ రిజిస్ట్రార్‌పై హైకోర్టు ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అవకతవకలపై సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్పందించని సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ హరితపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాగైతే కోర్టు ధిక్కరణ కింద జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. చర్యల్లో జాప్యంపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 18కి వాయిదావేసింది. గత మేనేజింగ్ కమిటీ అవకతవకలపై విచారణ జరిపి సమర్పించిన నివేదికపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో జూబ్లీహిల్స్ సొసైటీ మాజీ కార్యదర్శి మురళీ ముకుంద్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ ఎం.హరిత వ్యక్తిగతంగా హాజరయ్యారు. విచారణ నివేదికను పిటిషనర్‌కు అందజేశారు. గత పాలకమండలి అవకతవకలపై విచారణ జరిపినా చర్యలు ఎందుకు చేపట్టలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించారు. వచ్చే విచారణకు హాజరు మినహాయింపు ఇవ్వాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనను తిరస్కరించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పటాన్‌చెరు: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలుచేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె రాజయ్య అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో శనివారం నిర్వహించతలపెట్టిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాటం చేయడానికి చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని చెప్పారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ, మియాపూర్, పటాన్‌చెరు, న్యూస్‌టుడే: మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా శనివారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుంది.

ఆల్విన్ కాలనీ పరిధి: సమయం: ఉదయం 11:30-12:00: ఆర్ పి కాలనీ, రామకృష్ణ నగర్, హనుమాన్ నగర్, ధీనబంధుకాలనీ, మాధవరం కాలనీ, పాపిరెడ్డినగర్, ప్రగతి నగర్. ఉదయం 10:00-11:30: విజయ నగర్ కాలనీ, నవోదయ కాలనీ, శుభోదయ కాలనీ. మధ్యాహ్నం 1:30-3: లాస్ట్ బస్టాప్, చక్రధర్ నగర్, ధరణీ నగర్, ఆల్విన్ కాలనీ ఫేజ్-2.

మాతృశ్రీ నగర్ సబ్ స్టేషన్ పరిధి: ఉదయం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు: వాటర్ వర్క్స్ రోడ్, కల్వరి టెంపుల్ ఏరియా, శిల్పఎవెన్యూ శ్రీలా గార్డెన్స్ గేట్ ఎల్-1,ఎల్ 2, జి -1, జి-2 ఏరియా.

మైత్రి నగర్ ఫీడర్: మధ్యాహ్నం 1:30-3:30: జనప్రియ నగర్, జనప్రియ అపార్ట్మెంట్స్, ఆల్విన్ కాలనీ, సితారహోటల్ పరిసర ప్రాంతాలు.

అమీన్‌పూర్ పురపాలక పట్టణం: ఉదయం 10-3: కేజీఆర్, సాయి విల్లాస్, గ్రీన్ విల్లాస్, ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ హోమ్స్, భరత్ నగర్ కాలనీ, సురక్ష హాబిటేట్, ఎన్టీఆర్ కాలనీ, సాయిరాంనగర్, నరేంద్రకాలనీ, నవ్య లేక్, సహస్రనామ బీహెచ్ఈఎల్, శంతన్ గ్రీన్ హోమ్స్, పీఎన్ఆర్ కాలనీ, సాయిఅంబికా, రాజరాజేశ్వరి, శాంతి శ్రీనగర్, ఐలాపూర్ తండా, అమీన్‌పూర్, సాయి రాజేశ్వరి, చక్రపురి, శ్రీవాణినగర్, సబ్‌వే హోమ్స్, ఎంపైర్ మెడోస్, సాయిఅంబికా, ఓడీఎఫ్ కాలనీ, లక్ష్మీ హోమ్స్, సాయికృప కాలనీ, అవంతిక, బంధం కొమ్ము గ్రామం, శ్రీదాం హిల్స్, గ్రీన్ విల్లాస్, సబ్‌స్టేషన్ బ్యాక్ సైడ్, కృష్ణ బృందావని టీచర్స్ కాలనీ, నారాయణరెడ్డికాలనీ, వీరారెడ్డి కాలనీ, ఎన్‌బీఆర్ ఎంక్లేవ్, శివసాయి నగర్, భ్రమరాంబిక ఎంక్లేవ్, ప్రశాంత్ నగర్ కాలనీ.

కళాశాల బస్సులు ఢీ: డ్రైవర్ మృతి

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక డ్రైవర్ మృతి చెందాడు. మరో డ్రైవర్‌తో పాటు దాదాపు 30 మంది విద్యార్థులు, అధ్యాపకులకు గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు. విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వెళుతోంది. హైదరాబాద్ నుంచి విద్యార్థులు, అధ్యాపకులతో వస్తున్న మరో బస్సు కళాశాలకు అతి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు వాటిలో ఇరుక్కుపోయారు. విద్యార్థులతో వస్తున్న బస్సులో సుమారు 40మంది వరకు ఉండగా.. వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల అద్దాలు పగలడంతో ముందు కూర్చున్న విద్యార్థులకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని గాయపడిన వారిని సంగారెడ్డి, నర్సాపూర్ ఆసుపత్రులకు తరలించారు. బస్సుల్లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను అతికష్టం మీద బయటకు తీశారు. డ్రైవర్ నాగరాజు(56)ను నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మరో డ్రైవర్ యాదగిరిని హైదరాబాద్‌కు తరలించారు. నాగరాజు స్వస్థలం అనంతపూర్ జిల్లా తాడిపత్రి కాగా.. పటాన్‌చెరులో స్థిరపడ్డారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఎంఈఓ కార్యాలయం ప్రారంభం



రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: అమీనపూర్ మండల ప్రజా పరిషత్ భవనంలో ఏర్పాటు చేసిన ఎంఈఓ కార్యాలయాన్ని ఎంఈఓ పీపీ రాథోడ్‌తో కలిసి రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప ప్రారంభించారు.

సామాజిక భవనం కాలనీ కమిటీకి అప్పగించాలి

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్ హుడా కాలనీ ఫేజ్-1 వెల్ఫేర్ సొసైటీ సామాజిక భవనాన్ని 2020లో జీహెచ్‌ఎంసీ కరోనా చికిత్స కోసం తన ఆధీనంలోకి తీసుకుంది. 40 పడకలతో కరోనా బాధితులకు చికిత్స అందించారు. నాలుగేళ్లు గడిచిపోయినా తిరిగి కాలనీవాసులకు అప్పగించలేదు. ప్రస్తుతం పారిశుద్ధ్య విభాగ సిబ్బంది సేవల కోసం వినియోగిస్తున్నారు. కాలనీవాసుల శుభకార్యాల నిర్వహణ, సమావేశాలకు భవనం అందుబాటులో లేక ఇబ్బందిపడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. భవనం తిరిగి అప్పగించాలని హుడా కాలనీ సంక్షేమ సంఘం కమిటీ అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి మనోహర్‌గౌడ్ కోరుతున్నారు.

అన్ని కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం

మియాపూర్: త్వరలోనే అన్ని కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ అన్నారు. జేపీఎన్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను ఆయన జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఏఈ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: భర్త అదృశ్యమయ్యాడని భార్య పటాన్‌చెరు ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ఆసిఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు నాయికోటి బస్తీకి చెందిన రవీందర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 22న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం భార్య లలిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

భారత్‌లో రోటరీ ఇంటర్నేషనల్ సేవలు భేష్



మాట్లాడుతున్న మారియో సీజర్ మార్టిన్స్ డి కమార్గో

రాయదుర్గం: రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ భారత్‌లో ఉత్తమ సేవలందిస్తోందని, అమెరికా తర్వాత అధిక సంఖ్యలో సభ్యులున్న రెండో దేశం భారత్ అని రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మారియో సీజర్ మార్టిన్స్ డి కమార్గో అన్నారు. రెండు రోజుల పర్యటనకు ఆయన నగరానికి వచ్చారు. నగరంలో రోటరీ ఇంటర్నేషనల్ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను పరిశీలించారు. శుక్రవారం రాయదుర్గంలో ఓ హోటల్‌లో ఆయన మాట్లాడారు. కొవిడ్ మహమ్మారి సమయంలో తమ సంస్థ విస్తృతంగా ఆహార, ఆరోగ్య సంరక్షణ పరికరాల పంపిణీ చేసి.. ప్రజలకు అండగా నిలిచిందన్నారు. పేదలకు విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. భారత్‌లో రోటరీ క్లబ్బులు క్రియాశీలకంగా పని చేస్తున్నాయన్నారు. నగరంలో 6 సంచార యూనిట్ల ద్వారా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 20ఏళ్లలో భారత్‌లో రొటేరియన్ల సంఖ్య రెట్టింపు అయిందన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, రొటేరియన్ డా.రాంప్రసాద్ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని బలవన్మరణం



వర్ష

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: బీటెక్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఠాణా పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ ప్రవీణ్‌కుమారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురానికి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి నాగరాజు రెండో కుమార్తె వర్ష(19) పటాన్‌చెరు మండలం గీతం విశ్వవిద్యాలయంలో బీటెక్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. వర్ష మరో ఇద్దరు విద్యార్థినులతో కలిసి గీతం బాలికల వసతిగృహంలో ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో తాను ఉండే గదిలోకి వెళ్లి బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు కట్టి ఉరిపోసుంది. కొద్దిసేపటికి సహచర విద్యార్థినులు తలుపు ఎంతకొట్టినా తీయకపోవడంతో వాచ్‌మెన్ చూసి తలుపు పగలగొట్టి లోపలకు వెళ్లగా ఫ్యాన్‌కు వర్ష వేలాడుతూ కన్పించింది. వెంటనే కిందకు దింపి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వర్ష ఎప్పుడూ చదువుతూనే ఉండేదని, ఎవరితోనూ మాట్లాడేది కాదని.. ఎప్పుడూ ఒంటరిగానే ఉండేదని సహచర విద్యార్థినులు చెబుతున్నారు. బహుశా ఒత్తిడితో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అనంతపురం నుంచి వస్తున్నారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

'గాంధీ' టీటీజీడీజీఏ నూతన కమిటీ

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోషియేషన్ (టీటీజీడీఏ) గాంధీ యూనిట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గాంధీ యూనిట్ అధ్యక్షుడిగా డాక్టర్ బి.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.మదన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా హర్షిత, విక్రమ్, అనీల్, ఉపకార్యదర్శులుగా అర్జున్, త్రిభువన్‌కుమార్, నాగరాజగౌడ్, కోశాధికారిగా డాక్టర్ డి.రమేష్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, సయ్యద్ ఇబ్రహీంజుబారీ, సైదాఅస్పియా తమ్‌కీన్, నిరంజన్, సందీప్, సదానందం, రాంబాబు, దినేష్, శ్రేయ సంతోషి ఎన్నికయ్యారు.

కుత్బుల్లాపూర్



రామ ధనుస్సుకు పూజలు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: అయోధ్యలోని రామాలయంలో ఏర్పాటు చేయనున్న ధనుస్సుకు జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రీనగర్‌లోని సత్యవరపు వీరభద్రరావు ఇంట్లో శుక్రవారం పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ధనుస్సుపై పుష్పాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కిలో బంగారం, 13 కిలోల వెండితో దీన్ని తయారు చేశారు. అయోధ్య భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధనుస్సును నగరంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి పూజలు చేశారు.

తుమార్ చెరువు పరిశీలన


తటాకాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లిలోని తుమార్ చెరువును శుక్రవారం ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. చెరువులో డ్రైనేజీ కలుస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. చెరువులో డ్రైనేజీ కలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తటాకం స్థలం కబ్జా కాకుండా చూడాలని కోరారు. భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి, నాయకులు విక్రమ్‌రెడ్డి, రాజిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం


శిబిరంలో కమిషనర్ సౌజన్య, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ తదితరులు

నిజాంపేట: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. బాచుపల్లిలోని మమత ఆసుపత్రి వైద్య సిబ్బంది అన్ని విభాగాల కార్మికులు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. డిప్యూటీ మేయర్ శనిగల ధన్‌రాజ్‌యాదవ్, ఆసుపత్రి వైద్య నిపుణులు రష్మీ, విపంచి, ప్రీతి, సాయి పూజిత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోస్టర్లపై నిషేధం

ఈనాడు, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలకు దారి తీయడం, అపరిశుభ్రత, వాతావరణాన్ని అధ్వానంగా మార్చుతున్న పోస్టర్లపై జీహెచ్ఎంసీ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలను పక్కాగా అమలు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం యంత్రాంగాన్ని ఆదేశించారు. సర్కిళ్ల ఉపకమిషనర్లతమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్‌లు, సినిమా థియేటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గోడలపై పత్రాలను అంటించకుండా అవగాహన కల్పించాలన్నారు.

పూడిక నిండి.. కాలువలు పొంగి

అధికారుల మధ్య సమన్వయ లోపం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: వరద కాలువల్లో పూడిక తొలగించడంలో జీహెచ్ఎంసీ, ఐలా అధికారుల మధ్య సమన్వయం కొరవడుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని నాలాల నుంచి ఏడాది పొడవునా పూడికతీతకు చర్యలు చేపడుతుండగా... ఎగువన ఉన్న జీడిమెట్ల ఐలా ప్రాంత నాలాల నుంచి సకాలంలో పూడిక తీయడంలేదు. ఆయా నాలాల నుంచి వరదతోపాటు దిగువకు వచ్చే పూడిక జీహెచ్ఎంసీ పరిధి నాలాల్లో తిష్ఠ వేస్తోంది. దీంతో ఓ మోస్తారు వర్షానికే కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి.

కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో ఈసారి కూడా ఏడాది కాల పరిమితితో (జనవరి నుంచి డిసెంబరు) రూ.75 లక్షలతో 18.56 కిలోమీటర్ల వరద కాలువల నుంచి 5889.83 క్యూబిక్ మీటర్ల పూడిక.. గాజులరామారం సర్కిల్‌లో రూ.83 లక్షలతో 13.65 కి.మీ. వరద కాలువల నుంచి 6386.27 క్యూబిక్ మీటర్ల పూడిక తొలగించడానికి ఫిబ్రవరిలో టెండర్లు నిర్వహించిన విషయం తెలిసిందే. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో అంచనా వ్యయంపై 0.69 శాతం.. గాజులరామారం సర్కిల్‌లో 1.50 శాతం తక్కువతో ఒకే గుత్తేదారు పనులను దక్కించుకొని పూడిక తీతకు పూనుకున్నారు.


అయోధ్యనగర్ వద్ద తూములకు అడ్డుగా వ్యర్థాలు

ప్యాకేజీలవారీగా..

గత ఏడాది రూ.1.18 కోట్లతో 36.39 కి.మీ. వరద కాలువల్లో 18,777 క్యూబిక్ మీటర్ల పూడిక తీయడానికి డివిజన్లవారీగా టెండర్లు నిర్వహించారు. కానీ పనులను 10 నుంచి 15 శాతం తక్కువతో గుత్తేదార్లు అరకొరగా పూడిక తీసి మమ అనిపించుకున్నారు. దీంతో తొలకరి వర్షాలకే కాలువలు పొంగి ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈసారి అలా కాకుండా ప్యాకేజీల రూపంలో టెండర్లు నిర్వహణకు శ్రీకారం చుట్టడంతో పూడికతీత పనుల్లో కొంతమేర స్పష్టత వస్తోంది. కానీ జీడిమెట్ల, ఎస్వీ కోఆపరేటివ్ ఇండస్ట్రియల్ నాలాల నుంచి పూడిక తీయకపోవడం వల్ల అక్కడి నుంచి వరదతోపాటు పూడిక కొట్టుకొచ్చి కుత్బుల్లాపూర్ సర్కిల్ నాలాల్లోకి చేరుతోంది.


నాలా నుంచి తీసి రోడ్డు పక్కన పడేసిన పూడిక

దీంతో జీహెచ్ఎంసీ వారే అక్కడి నాలాలో కూడా పూడిక తీయాల్సి వస్తోంది. కానీ తీసిన వ్యర్థాలను వెంటనే డంపింగ్ యార్డుకు తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

డంపింగ్ యార్డుకు తరలించడానికి చర్యలు

– గణేష్, ఈఈ కుత్బుల్లాపూర్ సర్కిల్.

జీడిమెట్ల పారిశ్రామిక వాడ నాలా నుంచి పూడిక తొలగించడంలేదు. ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సర్కిల్ సరిహద్దులోని పారిశ్రామిక వాడ నాలాల్లోంచి తామే పూడిక తీయిస్తున్నాం. తొలగించిన వ్యర్థాలను వెంటవెంటనే డంపింగ్ యార్డునకు తరలించడానికి చర్యలు తీసుకుంటాం.

మహిళా పోలీసులకు మెరుగైన సౌకర్యాలు


గదిని ప్రారంభిస్తున్న ఏసీపీ హనుమంతరావు

జీడిమెట్ల,న్యూస్‌టుడే: విధుల్లో ఉండే మహిళా పోలీసులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. జీడిమెట్ల ఠాణాలో మహిళా పోలీసుల కోసం కేటాయించిన గదులను ఆధునికీకరించారు. శుక్రవారం ఆయన వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, ఎస్సైలు హరీశ్, ఆంజనేయులు, మహిళా కానిస్టేబుళ్లు సాహు, మణిరత్నకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ట్యాంకు స్థలాన్ని ఆసుపత్రికి కేటాయించండి


ఓవర్‌హెడ్ ట్యాంకుకు కేటాయించిన స్థలం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: గాంధీనగర్ పారిశ్రామిక వాడలో ఓవర్ హెడ్ ట్యాంకు కోసం నిర్దేశించిన స్థలాన్ని ఈఎస్ఐ ఆసుపత్రికి కేటాయించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ స్థలంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకును ఇటీవల గాంధీనగర్ ఐలా అధికారులు నేలమట్టం చేయించారు. సుమారు రూ. 4 కోట్ల విలువ చేసే 400 చదరపు గజాల ఈ స్థలాన్ని అడ్డదారిలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు స్వామి, శ్రీనివాస్ కుత్బుల్లాపూర్ మండల ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథరావుతో కలిసి శుక్రవారం గాంధీనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మాట్లాడారు. గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని కంపెనీల్లో సుమారు 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారి కోసం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూములను తొలగించండి


మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ మండలంలోని 58 సర్వే నంబరు నుంచి 226 వరకు నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేట్ భూములను అందులోంచి తొలగించాలని కోరుతూ భాజపా నాయకులు శుక్రవారం కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ సురేందర్, డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌లకు వినతిపత్రాలు అందజేశారు. గెజిట్ నోటిఫికేషన్ లేకుండా సర్వే నంబర్లు ఎన్ని.. వాటి విస్తీర్ణం ఎంతో.. రెవెన్యూ అధికారుల నుంచి సరైన సమాచారం లేకుండా వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రార్ నుంచి వచ్చిన ఉత్తర్వులంటూ 172 ఎకరాల్లో అమ్మకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి వక్ఫ్‌బోర్డు స్థలాలను గుర్తించి ఆయా స్థలాలు మినహాయించి మిగిలిన స్థలాల్లో రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. భాజపా నాయకులు ఆకుల సతీష్ పాల్గొన్నారు.

అటవీ అకాడమీలో క్రీడాపోటీలు ప్రారంభం

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో చార్మినార్ సర్కిల్, రీజనల్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి సువర్ణ క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. పోటీల ప్రారంభానికి ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారిణి సువర్ణ

దుండిగల్ కళాశాలలో..

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీఎం, ఫార్మసీ కళాశాలలో క్రీడాపోటీలను శుక్రవారం కళాశాల ఛైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు దేహదారుఢ్యం పెంపొందించుకోవచ్చన్నారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ పి.శ్రీధర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ అర్జున్ మాలిక్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో కళాశాల ఛైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి

సహకార సంఘం అభివృద్ధికి చొరవ


సమావేశంలో మాట్లాడుతున్న దూలపల్లి సహకార సంఘం ఛైర్మన్ నరేందర్

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం ఛైర్మన్ నరేందర్ ఆధ్వర్యంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ల సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేశామన్నారు. దూలపల్లి, డి.పోచంపల్లిలలో సంఘం ఆధ్వర్యంలో గోదాములు నిర్మించామన్నారు. గోదాముల ద్వారా ప్రతి సంవత్సరం సంఘానికి రూ.90 లక్షల ఆదాయం సమకూరుతుందన్నారు. వైస్ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు


శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బహదూర్‌పల్లి వాసులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను శుక్రవారం ఆయన నివాసంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. బహదూర్‌పల్లిలోని అసైన్డ్ భూములు కోల్పోయిన దళితులకు, పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. గాజులరామారం డివిజన్ పరిధి ఉషోదయ కాలనీలోని ఇళ్ల స్థల వివాదంపై నెలకొన్న సందిగ్ధత తొలగించాలని కోరారు. రోడ్లు, భూగర్భడ్రైనేజీ, ఇతర మౌలిక వసతులు కల్పించాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. సమస్యలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండల ఓబీసీ అధ్యక్షుడు కుమారయాదవ్, ప్రధాన కార్యదర్శి సాదయ్య, దళిత సంఘాల ప్రతినిధులు మహేందర్, రాజేశ్, నర్సింగరావు, విజ్ఞప్తి పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసాని వీరేశ్


జగదీశ్‌యాదవ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న వీరేశ్, చిత్రంలో కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

నిజాంపేట, న్యూస్‌టుడే: కబడ్డీ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కాసాని వీరేశ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. బాచుపల్లిలోని కబడ్డీ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఓటింగ్ పద్ధతిన ఎన్నికలు జరిగాయి. జిల్లాలోని 15 మండలాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు హాజరై ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరేశ్‌తో పాటు ఉపాధ్యక్షుడిగా తిరుమల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రహాస్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.రమాదేవి, కోశాధికారిగా జి.వి.సుబ్రమణ్యం, సభ్యులుగా జహంగీర్, కృష్ణవేణిలు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయవాదులు శ్రీనివాస్, దేవేందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో భారత కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, జగదీశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు


కార్యక్రమంలో గిరివర్ధన్ రెడ్డి, ఝాన్సీ, నాగమణి

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వానికి ఆదరణ పెరుగుతోందని భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధానకార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి తెలిపారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రామరాజునగర్‌లో కుత్బుల్లాపూర్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ మహిళా మోర్చా కన్వీనర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్‌లోని రెండు పడక గదుల గృహసముదాయంలో వాటర్ ట్యాప్‌లను దొంగతనం చేస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. బేగంపేటకు చెందిన గణేష్ ప్రధాన్ సదరు గృహసముదాయంలో గురువారం అర్ధరాత్రి వాటర్ ట్యాప్‌లను చోరీ చేస్తుండగా కాపలాదారుడు గుర్తించి అతన్ని పట్టుకున్నాడు. అతని నుంచి 45 స్టీల్ వాటర్ ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద ప్రవాహం.. ఇబ్బందుల్లో జనం



గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డి నగర్‌లో వరద రోడ్లపై ప్రవహిస్తోంది. గాలిపోచమ్మ దేవాలయం వీధి లోతట్టు ప్రాంతం కావడంతో దేవేందర్‌నగర్ గుట్టపై నుంచి వచ్చే వరద రావినారాయణరెడ్డినగర్ వీధులను ముంచెత్తుతోంది. ఈ సమస్య కొన్నేళ్లుగా ఉంది.

–న్యూస్‌టుడే, షాపూర్‌నగర్

సాంకేతిక రంగంలో మార్పులను తెలుసుకోవాలి

మేడ్చల్, న్యూస్‌టుడే: సాంకేతికత రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం విద్యార్థులు తెలుసుకునే ప్రయత్నం చేయాలని మల్లారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ అశోక్ సూచించారు. 'ఇంజినీరింగ్, అడ్వాన్స్‌మెంట్ టెక్నాలజీ' అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి సదస్సును శుక్రవారం కళాశాలలో ప్రారంభించారు. వివిధ దేశాల నుంచి 120 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో చెన్నయ్ ఓ.ఎస్.ఐ.ఇ.టి విశ్వవిద్యాలయం కార్యదర్శి ప్రభాకర్, వీఐటీ వెల్లూర్ ఆచార్య విజయవాజన్, కన్వీనర్ వివేకానంద, వైస్ ప్రిన్సిపల్ టి.వి.రెడ్డి పాల్గొన్నారు.

అబ్బురపరిచే.. ఆలోచనలు పెంచే

యువజనోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యువజనోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వివిధ రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన 630 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల నృత్యం


కొంపల్లి జడ్పీ విద్యార్థినులను అభినందిస్తున్న అధికారులు

వీఎన్ఆర్ కళాశాలకు 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్' అవార్డు


అవార్డు అందుకుంటున్న చెన్నకేశవరరావు తదితరులు

నిజాంపేట, న్యూస్‌టుడే: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలకు 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్' అవార్డు దక్కింది. కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ విండ్సర్, గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఈ పురస్కారానికి ఎంపికైంది. బేగంపేటలోని హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్ చేతుల మీదుగా కళాశాల డైరెక్టర్ చెన్నకేశవరావు, ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తుల కిరణ్‌లు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా బోధనలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నందుకు వరుసగా ఏడేళ్ల నుంచి అవార్డు పొందుతుండడం గర్వంగా ఉందన్నారు.

బాచుపల్లి మండల విద్యాధికారిగా రామకృష్ణ


సన్మాన గ్రహీతతో ఉపాధ్యాయులు

నిజాంపేట, న్యూస్‌టుడే: బాచుపల్లి మండల విద్యాధికారి(ఎంఈఓ)గా రామకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం బాచుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్న రామకృష్ణకు ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించి సత్కరించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పి.నర్సింహులు, మాలి ప్రమోద్‌కుమార్‌రెడ్డి, విఠల్, గాలయ్య, సుమతి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పనులు

దుండిగల్, న్యూస్‌టుడే: చర్చ్‌గాగిల్లాపూర్‌లోని రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన మంచినీటి పైపులైన్, రోడ్డు, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బి-బ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ పురపాలిక కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నాయకులు నయీమ్, సమీర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ హర్ష ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రస్తుతం (హర్ష హోమ్స్ & ఇన్‌ఫ్రా ప్రై.లిమిటెడ్) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ నల్లమల్లారెడ్డి తండ్రి లేట్ నల్లసాయిరెడ్డి ఇంటినెం. 4-52, దివ్యానగర్, కాచివాని సింగారం, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్ జిల్లా గారు కాచివాని సింగారం గ్రామ శివారు సర్వేనెం. 60 దివ్యానగర్ ఫేజ్ -2 లేఅవుట్‌లో గల ప్లాట్ నెం. 80 విస్తీర్ణం 173 గజాలు చట్టబద్ధంగా రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 6028/2003 హర్ష ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున పొందివున్నారు. అట్టి దస్తావేజు ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిష్టరు చేయబడినది.
తేది 25-09-2024 బుధవారం రోజున నా క్లయింట్ గండిమైసమ్మ మొయిన్‌రోడ్డు నుండి దుండిగల్ స్నేహితుడి ఇంటికి వెళ్ళుచుండగా పైన తెలిపిన ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు రోడ్డు పైన ఎక్కడో పడిపోయినది, ఇట్టి ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికినచో పైన తెలిపిన నా క్లయింట్ అడ్రస్‌కు గాని ఈ క్రింద చూపిన నా అడ్రస్‌కి గాని అప్పగించి తగిన పారితోషకం పొందగలరని మనవి.
ఇట్లు
జంబుల నరసింహారెడ్డి, న్యాయవాది.
ప్లాట్ నెం.5ఎ. ఎ.పి.హెచ్.బి. బిల్డింగ్, ఆపోజిట్: స్మార్ట్ హోమ్, బర్కత్‌పుర, హైద్రాబాద్-27. మొబైల్ 9848264119

కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం మరువలేనిది

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట బస్టాపులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివన్నారు. సంఘం నాయకులు బేతి గోపాల్, శంకరయ్య, దత్తాత్రేయ, రఘునందన్, లక్ష్మీనాథ్, జనార్ధన్, హరినారాయణ, రాజేష్, మారుతి పాల్గొన్నారు.

● స్వాతంత్ర్య సమరయోధుడు, త్యాగశీలి కొండాలక్ష్మణ్ బాపూజీ అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొలను హనుమంత్‌రెడ్డి అన్నారు. జగద్గిరిగుట్టలో జరిగిన బాపూజీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు కృష్ణగౌడ్, సంజీవరెడ్డి, కౌసల్య, స్వాతి, రవీందర్ పాల్గొన్నారు.

● కళావతినగర్‌లో సూరారం డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు అమర్‌నాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగేందర్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, కోశాధికారి మల్లేష్, సలహాదారులు సహదేవ్, కుమార్ పాల్గొన్నారు.

● గాజులరామారంలోని ప్రాణవాయుపార్కు వద్ద గాజులరామారం డివిజన్ పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. సంఘం నాయకులు శంకరయ్య, కస్తూరి బాలరాజు, రాజశేఖర్, భారాస నేతలు శ్రీనివాస్‌యాదవ్, కమలాకర్, మారుతి పాల్గొన్నారు.

నిజాంపేట, న్యూస్‌టుడే: నిజాంపేట నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. కమిషనర్ దేవులపల్లి సౌజన్య, డిప్యూటీ మేయర్ శనిగల ధన్‌రాజ్ యాదవ్, ఎస్ఈ సత్యనారాయణ, మేనేజర్ పవన్, పర్యావరణ విభాగం ఇంజినీర్ సుకృతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లి (పేట్‌బషీరాబాద్): మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కొంపల్లి మున్సిపల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కమిషనర్ కె.శ్రీహరి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బాపూజీ జయంతి నిర్వహించారు. వైస్ ఛైర్మన్ రత్లావత్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జగద్గిరిగుట్ట బస్టాపు వద్ద ఎమ్మెల్యే వివేకానంద్, పద్మశాలి సంఘం ప్రతినిధులు


బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కొలను హనుమంత్‌రెడ్డి


నిజాంపేట నగర పాలక సంస్థ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ సౌజన్య, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ తదితరులు


మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీశైలంయాదవ్, కమినర్ శ్రీహరి తదితరులు

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి


నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేయాలని సూచించారు. డీవైఎఫ్ఐ నేతలు కరుణాకర్, శ్రీనివాస్, వంశీ, నగేష్, విష్ణు పాల్గొన్నారు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

'గాంధీ' టీటీజీడీఏ నూతన కమిటీ



డాక్టర్ కిరణ్

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) గాంధీ యూనిట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గాంధీ యూనిట్ అధ్యక్షుడిగా డాక్టర్ బి.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.మదన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా హర్షిత, విక్రమ్, అనీల్, ఉపకార్యదర్శులుగా అర్జున్, త్రిభువన్‌కుమార్, నాగరాజగౌడ్, కోశాధికారిగా డాక్టర్ డి.రమేష్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, సయ్యద్ ఇబ్రహీంజుబారీ, సైదాఅస్పియా తమ్‌కీన్, నిరంజన్, సందీప్, సదానందం, రాంబాబు, దినేష్, శ్రేయసంతోషి ఎన్నికయ్యారు. ప్రభుత్వ బోధన వైద్యుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ ప్రతినిధులు తెలిపారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

గోడపత్రిక ఆవిష్కరణ

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ డ్రగ్స్ నివారణ అవగాహన కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను శుక్రవారం గాంధీ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ రాజకుమారి, ఆర్ఎంఓ-1 శేషాద్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీహెచ్ అశోక్, కోఆర్డినేటర్ రాజేందర్ పాల్గొన్నారు.



గడ్డి అన్నారం.. కూకట్‌పల్లి..
మరి బోయిన్‌పల్లి..?

ఏఎంసీ పాలకవర్గ నియామకానికి ఎదురుచూపులు



కిటకిటలాడుతున్న మార్కెట్

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 16 మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమిస్తూ.. ప్రభుత్వం ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది. అందులో నగరానికి సంబంధించి గడ్డిఅన్నారం, కూకట్‌పల్లి పాలకవర్గాలను సైతం నియమించింది. నగరంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఊసెత్తకపోవడం గమనార్హం.

గడువు ముగిసి ఏడు నెలలు..

ఈ మార్కెట్‌లో 154 దుకాణాలు ఉండగా.. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి నిత్యం రెండు వేల టన్నులకు పైగా కూరగాయలు వస్తుంటాయి. క్రయవిక్రయాలు, రైతుల సంక్షేమం తదితర విషయాలలో ఏవైనా సమస్యలు తలెత్తినపుడు పాలకమండలి పెద్దన్న పాత్ర పోషించి పరిష్కరిస్తుంది. ఇక్కడి కమిటీ గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ముగిసింది. ఏడు నెలలుగా రైతులు, వ్యాపారులు పాలకవర్గాన్ని ఎప్పుడు నియమిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ప్రధాని ప్రశంసలు అందుకొని..

గత ప్రభుత్వ హయాంలో 2019లో పాలక మండలి ఏర్పాటైంది. సుమారు రూ.3 కోట్లతో కూరగాయల వ్యర్థాలతో గ్యాస్‌ను ఉత్పత్తి చేసే బయోగ్యాస్ ప్లాంటును సమకూర్చారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ సైతం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించి అభినందించారు. అప్పటి పాలకమండలి కరోనా కష్టకాలంలోనూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది.

ఉత్తర్వులు జారీ అయినా..

2022 డిసెంబరులో కొత్త పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తరువాత ప్రభుత్వం మారిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాలకమండలి ప్రతినిధులు తమ పదవులను ఉపసంహరించుకోవాలని మార్కెటింగ్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం స్థానిక కాంగ్రెస్ నేతలు పాలకమండలి నియామకం కోసం ఎదురుచూస్తున్నారు. ఏదో ఒక పదవి దక్కించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలతో గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఏదిఏమైనా.. కొత్త కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఖాళీ జాగా.. అనారోగ్యం పాగా

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బీకేగూడ దాసారం బస్తీ పక్కన ఉన్న ఖాళీ స్థలం అనారోగ్యానికి నిలయంగా మారింది. పలుకాలనీలు, బస్తీల మధ్యలో చెత్తాచెదారం నిండిపోయింది. దుర్గంధం, అపరిశుభ్రత నడుమ పది కాలనీలు, సుమారు పది వేలకు పైగా కుటుంబాలు నిత్యం నరకం అనుభవిస్తున్నాయి. తలుపులు తీస్తే దుర్వాసన గుప్పుమంటూ వచ్చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. కొందరైతే తక్కువ ధరకు ఇళ్లను అమ్ముకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.



అపరిశుభ్రంగా బస్తీ పరిసరాలు

నాడు విద్యానిలయం..

దాసారం బస్తీ పక్కన ఉన్న ఈ ఖాళీ స్థలంలో నాలుగు దశాబ్దాల కిందట పాఠశాల ఉండేది. తరువాత బడిని ఎత్తేశారు. రానురాను పాఠశాల భవనాలు, ఖాళీ స్థలం చెత్త డంపింగ్‌యార్డుగా మారింది. ఈ నేపథ్యంలో నగరంలో చెత్తను తరలించే వారు ఇక్కడ గుడిసెలు వేసుకుని ఉండటం ప్రారంభించారు. సుమారు 400 కుటుంబాలున్నాయి. చెత్తను తీసుకొచ్చి ఇక్కడే పోస్తున్నారు. బహిర్భూమిగా వినియోగించేవారు. దుర్గంధం కారణంగా సమస్య నివారణకు కొన్నాళ్ల కిందట డంపింగ్‌యార్డును ఎత్తేశారు. గుడిసెల వాసులకు మరుగుదొడ్లు కట్టించారు. గతంలో జీహెచ్ఎంసీ అధికారులు పారిశుద్ధ్య కార్మికులను కాపలాగా పెట్టినా.. తరువాత వారిని తీసేయడంతో పరిస్థితి మొదటికి వచ్చింది.



రోడ్డుపై మురుగు ప్రవాహం

షెడ్ల ఏర్పాటు..

నగరంలో సగం ప్రాంతాల్లో చెత్తను తరలించే కార్మికులు ఇక్కడే ఉంటున్నారు. వీరు ఆటో రిక్షాల్లో చెత్తను తీసుకొచ్చి వేరు చేస్తున్నారు. కొందరు షెడ్లు ఏర్పాటు చేసి చెత్త నుంచి వేరు చేసిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. గంజాయి, మాదకద్రవ్యాలు వంటివి జోరుగా విక్రయాలు సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చెత్త డంపింగ్ చేయకుండా నివారిస్తే సమస్య పరిష్కారమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: వివిధ విద్యుత్ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా ఈ దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదు.

● **10 నుంచి 11.30 వరకు:** బేగంపేట, లోధా, హెచ్‌పీఎస్ పరిధిలోని దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్, అమీర్‌పేట వెల్‌నెస్ ఆసుపత్రి పరిసరాలు, అభిరుచి హోటల్, డీఎన్ఎం కాలనీ, అశోక్ కాలనీ, సనత్‌నగర్ మెయిన్ రోడ్, సుభాష్‌నగర్, ఎస్సార్టీ కాలనీలో కొంత భాగం, టీవీఎస్ షోరూం లేన్, మెథోడిస్ట్ చర్చి లేన్, డిమార్ట్ ఎదురు ప్రాంతం, గురుమూర్తి లేన్, తాతాచారి కాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్ పరిసరాలు.

● **10.30 నుంచి 11 వరకు:** మైత్రీవనం, లోధా పరిధిలోని బ్రాహ్మణవాడి, బేగంపేట బస్తీ, మాతాజీనగర్, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా, డీమార్ట్, టయోటా షోరూం లేన్, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ, ఆంధ్రా బ్యాంక్ లేన్, సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్ ఏరియా, శీష్‌మహల్ థియేటర్ పరిసర ప్రాంతాలు.

● **11.30 నుంచి ఒంటి గంట వరకు:** బేగంపేట, ఎయిర్‌పోర్ట్ పరిధిలోని గ్రీన్‌పార్క్, డా.రెడ్డీస్ ల్యాబొరేటరీ ఏరియా, పేస్ ఆసుపత్రి, గురుమూర్తిలేన్, మోతీలాల్‌నెహ్రూనగర్, ఎయిర్ కార్గో, శ్యామ్‌లాల్ బిల్డింగ్ పరిసర ప్రాంతాలు.

● **11.30 నుంచి 12 వరకు:** లోధా సబ్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, లిక్కర్ కంపెనీ, అల్లావుద్దీన్‌కోఠి పరిసర ప్రాంతాలు, సుందర్‌నగర్, మోడల్‌కాలనీ, సనత్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్ రోడ్, అల్లావుద్దీన్ కోఠి, ఓల్టాస్, టయోటా షోరూం లేన్, కామత్ లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్ .

● **1.30 నుంచి 3 వరకు:** గ్రీన్‌ల్యాండ్స్, ఎయిర్‌పోర్ట్ పరిధిలోని శ్రీనివాస్ టవర్స్, అమోఘ్ ప్లాజా, మైటస్, బ్లూమూన్ హోటల్, మనీల్యాండ్ చైనా. ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్ విహార్ కాలనీ షేర్‌ఖాన్ బస్తీ.

● **3 నుంచి 4.30 వరకు:** కుందన్‌బాగ్, సంజీవయ్యపార్క్, హెచ్‌పీఎస్ పరిధిలోని స్వప్న నర్సింగ్‌హోం, నిశాంత్ బాగ్, కీర్తిలాల్ జ్యువెల్లర్స్, బాబూఖాన్ మాల్, అమృత మాల్, మయూరిమార్గ్, అల్లంతోట బావి, గీతాంజలి స్కూల్, కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్.

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ● **11.30 నుంచి 12 వరకు:** 11కేవీ పింఛను లైన్ ఫీడర్ పరిధిలోని సీతారాంపురం, కంసారిబజార్, దర్జి బస్తీ, ఖాదర్ జెండా, ఎంబీఎన్ ఎస్టేట్ ప్రాంతం. ● **1.30 నుంచి 2 వరకు:** 11కేవీ పార్క్‌వ్యూ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని పార్క్ వ్యూ ఎన్‌క్లేవ్, గ్రీన్ వ్యూ ఎన్‌క్లేవ్, ఫరీద్‌నగర్, అబ్రార్‌నగర్, మనోవికాస్ నగర్, రిలయన్స్ మార్ట్, రాయల్ ఎన్‌క్లేవ్, ఎస్‌బీఐ కాలనీ, ఆరావలీ ఎన్‌క్లేవ్ పరిసరాలు. ● **2 నుంచి 4 గంటల వరకు:** 11కేవీ సెంట్రల్ ఎక్సైజ్ ఫీడర్ పరిధిలోని రాంగోపాల్ ఎన్‌క్లేవ్, మారుతీనగర్, సాయిబాబా దేవాలయం, సిండికేట్ బ్యాంక్ కాలనీ, వైష్ణవి రెసిడెన్సీ పరిసరాలు.

కంటోన్మెంట్ సీబీడీ పరిధిలో...

●**11 నుంచి 11:30 వరకు:** 11కేవీ శాంతినికేతన్ ఫీడర్ పరిధిలోని ఏసీఎస్ నగర్, శాంతినికేతన్, బాలంరాయి, సేవామండల్, సంతోషి మా సొసైటీ, గురుకులం పాఠశాల ప్రాంతం. ● **11:30 నుంచి 12 వరకు:** 11 కేవీ లక్ష్మీనగర్, వెంకటాపురం ఫీడర్ల పరిధిలోని మడ్‌ఫోర్ట్, కంటోన్మెంట్ వర్క్‌షాపు పరిసరాలు, వెంకటాపురం, ఇందిరానగర్, జగన్మాత దేవాలయ పరిసరాలు. ● **12 నుంచి 12:30 వరకు:** 11 కేవీ వాసవీనగర్, తుర్కపల్లి ఫీడర్ల పరిధిలోని ఓల్డ్ వాసవీనగర్, కాకాగూడ, బాలాజీ కాలనీ, న్యూవాసవీ నగర్, ఎల్ఐసీ కాలనీ, వైడబ్ల్యూసీఏ, జడ్జి క్వార్టర్స్, సరస్వతి కాలనీ, బూసారెడ్డిగూడ, ఫిషర్‌పురి, గాంధీకాలనీ. ● **1 నుంచి 1.30 వరకు:** 11 కేవీ రాధా సత్సంగ్ ఫీడర్ పరిధిలోని రుక్మిణి ఎన్‌క్లేవ్, పెద్దిపామారెడ్డి కాలనీ, సంజీవ్‌రెడ్డి ఫంక్షన్ హాలు, గణేశ్ ఎన్‌క్లేవ్, రాయల్ ఎన్‌క్లేవ్, లక్ష్మీనగర్ ప్రాంతాలు. ● **1.30 నుంచి 2 వరకు:** 11 కేవీ మంగాపురం ఫీడర్ పరిధిలోని కిష్టమ్మ ఎన్‌క్లేవ్, నాగిరెడ్డి కాలనీ, వేణుగోపాల్‌రావునగర్, ఎగ్జిక్యూటివ్ కాలనీ, యాదమ్మనగర్, పంప్‌హౌస్ పరిసరాలు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య	
సికింద్రాబాద్:	8008573368
కంటోన్మెంట్:	8008573361
సనత్‌నగర్:	8008573356

రెజిమెంటల్‌బజార్, సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే:

? సికింద్రాబాద్ సెకండ్‌బజార్‌లో పారిశుద్ధ్య సిబ్బంది గత నాలుగు రోజులుగా రాకపోవడంతో బస్తీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది.
– శివకుమార్, సెకండ్‌బజార్

✓ సిబ్బందిని పంపించి చెత్తకుప్పలు తరలిస్తాం.
– ధర్మారెడ్డి, డీఈ, జీహెచ్ఎంసీ

? ఎస్సార్‌నగర్‌లో పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు.
– కె.హనుమంతురావు, ఎస్సార్‌నగర్

✓ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.
– కిరణ్మయి, వీధి దీపాల నిర్వహణాధికారి.

స్పందనకు వందనం

రసూల్‌పురా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ రెండో వార్డులోని కృష్ణానగర్ బస్తీలో కొన్ని రోజులుగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించగా.. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఎస్సార్‌నగర్, బీకేగూడ సమీపంలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద మ్యాన్‌హోల్ కుంగిపోగా.. స్థానికులు సాయిబాబు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను ఈనాడులో ప్రచురితం కావడంతో జలమండలి డీజీఎం వంశీకృష్ణ సిబ్బందిని పంపించి మ్యాన్‌హోల్ మూతను సరిచేయించారు.

కంటోన్మెంట్: న్యూబోయిన్‌పల్లిలోని ఆనంద్‌నగర్‌కాలనీ, తాడుబంద్‌లోని మన్నపురం లైన్‌లలో కొద్దిరోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీనిపై ఈ నెల 24న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు' ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు.

మూడుతరాల ఉద్యమనాయకుడు కొండా లక్ష్మణ్



వేడుకలో ఆర్.కృష్ణయ్య, విద్యార్థి నాయకులు

లాలాపేట, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ మూడుతరాల ఉద్యమ నాయకుడని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వందేమాతర ఉద్యమం, స్వాతంత్ర్య సంగ్రామం, క్విట్ ఇండియా, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమం, రైతాంగ సాయుధ పోరాటం, రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం ఇలా అనేక పోరాటాల్లో పాల్గొన్న గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో ఓయూ ఐకాస నేతలు రాజు నేత, రాము, విక్రం, నాగరాజు, మహేష్ మధు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

కార్ఖానా: కంటోన్మెంట్‌లోని బస్తీలు, కాలనీల్లో ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఏడో వార్డులోని చిన్నకమేళా, టీచర్స్ కాలనీలో ఆయన పర్యటించారు. టీచర్స్ కాలనీ పార్కులో రీడింగ్‌రూం, సామాజిక భవనంలో సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరారు. గృహజ్యోతి, ఇతర పథకాలు అందడం లేదని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్ నుంచి అమలయ్యే అవకాశాలు ఉన్నాయని, అర్హులందరికీ పథకాలు అందించే బాధ్యత తనదన్నారు.

దేవీ శరన్నవరాత్రోత్సవాలకు ఆహ్వానం



తలసానికి ఆహ్వాన పత్రం ఇస్తున్న ఈవో జయంతి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమీర్‌పేట హనుమాన్ దేవస్థానంలో వచ్చే నెల 3 నుంచి మొదలయ్యే దేవీ శరన్నవరాత్రోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు దేవస్థాన ప్రతినిధులు ఆహ్వానం అందజేశారు. మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.జయంతి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, దేవస్థాన ప్రతినిధులు సతీష్, నర్సింహమూర్తి, రాజేశ్వరశర్మ, భారాస నేతలు కూతురు నర్సింహ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలుకు డిమాండ్



మాట్లాడుతున్న అతార్‌సింగ్

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: ఆలిండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ 64వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం హైదరాబాద్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్, కార్యదర్శి అతార్‌సింగ్ మాట్లాడుతూ రైల్వే పింఛనుదారులకు మెడికల్ కార్డులు, పాసులు అందించడానికి మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సాయపడుతూ, మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. పాత పింఛను విధానం అమలు చేయాలని, 18 నెలల కరవుభత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇన్‌క్విజిటివ్ ప్రో-2024 పోటీల విజేత మంజీరా హోటల్స్



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బేగంపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బేగంపేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, శ్రీ శక్తి కళాశాలల ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఫ్యామిలీ వరల్డ్‌లో ఇన్‌క్విజిటివ్ ప్రో-2024 క్విజ్ పోటీలు నిర్వహించారు. నగరంలోని 15 హోటళ్లకు చెందిన టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు. పోటీల్లో మంజీరా హోటల్స్ ప్రతినిధులు విజయం సాధించగా ఎయిర్‌పోర్ట్ నోవాటెల్ ప్రతినిధులు రన్నరప్‌గా నిలిచారు.

ఆరోగ్యం..



శ్రమదానానికి సిద్ధమైన ఎమ్మెల్యే, బోర్డు అధికారులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం న్యూబోయిన్‌పల్లిలోని రామన్నకుంట చెరువు పరిసరాల్లో స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే శ్రీ గణేష్ రక్షణ శాఖ సదరన్ కమాండ్ డైరెక్టర్ అమూల్ జగతప్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే, అధికారులు, స్థానికులు చెరువు పరిసరాలు శుభ్రం చేశారు. బోర్డు సీఈవో మధుకర్‌నాయక్, జాయింట్ సీఈవో పల్లవి విజయవంశీ, జంపన ప్రతాప్, పాండుయాదవ్ పాల్గొన్నారు.

ఆందోళన..



సనత్‌నగర్, న్యూస్‌టుడే: తిరపతి లడ్డూ కల్తీపై సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీకి చెందిన పలువురు శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. కాలనీ ప్రధాన కార్యదర్శి దండా బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జె.ఎస్.టి.శాయి ఆధ్వర్యంలో కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీహాల్ వద్ద ప్లకార్డులతో నినాదాలు చేశారు. తిరుమల ఆలయ పవిత్రతను కాపాడాలని, దోషులను శిక్షించాలని కోరుతూ వేంకటేశ్వర స్వామివారికి పూజలు చేశారు. 11 సార్లు క్షమాశ్లోకం పఠించారు.

అవస్థ..



సీతాఫల్‌మండి డివిజన్‌లోని మైలార్ గడ్డ - నామాలగుండు దారిలో కొత్తగా సీసీ రోడ్డు వేశారు. నిర్మాణ సమయంలో తవ్విన శిథిలాలను రోడ్డును ఆనుకొని ఉన్న అనుసంధాన దారుల్లో పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరిని అడగాలో తెలియక స్థానికులు సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సికింద్రాబాద్

ఆనందం..



కార్ఖానా, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని పీజీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మ ఆడుతూ.. పాటలు పాడుతూ సందడి చేశారు. కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, కార్యదర్శి ఝాన్సీ, ప్రిన్సిపల్ రవికుమార్ హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకని తెలిపారు.

ఘన నివాళి

లాలాపేట, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం తార్నాకలో ఉపమేయర్ మోతే శ్రీలత తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ కమిటీ ఎన్నిక

మారేడుపల్లి, న్యూస్‌టుడే: మహేంద్రహిల్స్ రవి కాలనీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం ఎన్నికల అధికారి ఏబీ ప్రభాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడిగా కొత్త సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.చంద్రమోహన్, కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు జె.ఎన్.నర్సింగరావు, వి.శ్రీనివాసరావు, బి.సురేఖ, ఎం.ప్రశాంతి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సభ్యత్వ నమోదు

మారేడుపల్లి: ప్రతీ కార్యకర్త వందమందితో సభ్యత్వం చేయించాలని, అప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మహేంద్రహిల్స్ త్రిమూర్తికాలనీలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డా.వంశ తిలక్, విజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



లాలాపేట, న్యూస్‌టుడే: లాలాపేటలోని విజయ డెయిరీ పరిపాలన భవనం వద్ద శుక్రవారం తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యూనియన్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ డెయిరీ అభివృద్ధికి ఇటీవల రూ.50 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, విజయలక్ష్మి, నిఖిల్, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా నడిపి.. కారును ఢీకొట్టి

రెజిమెంటల్‌బజార్: నిర్లక్ష్యంగా కారును నడుపుతూ ప్రమాదానికి కారణమైన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ వివరాల ప్రకారం... చైతన్యపురికి చెందిన రాహుల్ శుక్రవారం ఉదయం కారులో ఆర్పీరోడ్డులోని బాటా వైపు నుంచి వెళ్తూ.. పాట్నీ సెంటర్ వద్ద యూటర్న్ వద్ద మలుపు తిరుగుతూ పాఠశాల విద్యార్థిని ఢీకొట్టాడు. వెంటనే ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్‌రాజు కారును ఆపే ప్రయత్నం చేయగా.. రాహుల్ వేగంగా దూసుకెళ్లాడు. వెంటనే గ్యాస్‌మండీ చౌరస్తాలో ఉన్న కానిస్టేబుల్ శివకుమార్‌ను అప్రమత్తం చేశారు. అతను వెంటనే రెడ్ సిగ్నల్ వేయడంతో రాహుల్ తప్పించుకొనే ప్రయత్నంలో ముందున్న కారును ఢీకొట్టాడు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని రాష్ డ్రైవింగ్ కేసు నమోదు చేశారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యం

మారేడుపల్లి, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులు పని చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంత దీపిక అన్నారు. వెస్ట్ మారేడుపల్లి మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం కార్మికులకు చెత్తను తరలించే చక్రాల బళ్లను అందించారు. శుభ్రతతో ఆరోగ్యం సాధ్యమన్నారు.

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

బేగంపేట, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ఉదయం 11.20 గంటలకు ఆమె బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆ సమయంలో బేగంపేట ఫ్లైఓవర్, హెచ్‌పీఎస్ ఔట్‌గేట్, పీఅండ్ టీ ఫ్లైఓవర్, రసూల్‌పురా, సీటీఓ, ప్లాజా జంక్షన్, టివోలి, జేబీఎస్, సికింద్రాబాద్ క్లబ్, కార్ఖాన పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు ట్రాఫిక్‌ను నిలిపివేయడం లేదా మళ్లిస్తారు. ● తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, రాణిగంజ్, గ్రీన్‌ల్యాండ్స్ జంక్షన్, మోనప్ప జంక్షన్, సోమాజిగూడ రోడ్, యశోద ఆసుపత్రి, ఎంఎంటీఎస్, వీవీ స్టాట్యూ జంక్షన్, పంజాగుట్ట, ఎన్ఎఫ్‌సీఎల్, ఎన్టీఆర్ భవన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు ట్రాఫిక్ మళ్లిస్తారు.

ట్రాఫిక్ మళ్లించే పాయింట్లు: ● రిసాలాబజార్ నుంచి బొల్లారం చెక్‌పోస్ట్ వైపు వచ్చే ట్రాఫిక్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వైపు మళ్లిస్తారు. లక్‌డావాలా నుంచి బొల్లారం చెక్‌పోస్ట్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను ఫ్రీడమ్ ఫౌండేషన్, బొల్లారం బజార్ వైపు మళ్లిస్తారు. ● అమ్ముగూడ నుంచి ఆర్ఎస్ఐ సర్కిల్ వైపు వెళ్లే ట్రాఫిక్ అమ్ముగూడ వద్ద బైసన్ గేటువైపు, లక్‌డావాలా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను అల్వాల్, బొల్లారం చెకపోస్టు వైపు వెళ్లాలి. ● లోతుకుంట వై-జంక్షన్ నుంచి రాష్ట్రపతి నిలయంవైపు వెళ్లే వాహనాలు అల్వాల్ వైపు వెళ్లాలి. ● రాష్ట్రపతి తిరిగి వెళ్లే సమయంలో టివోలివైపు ట్రాఫిక్ అనుమతించరు. అక్కడి ట్రాఫిక్‌ను వైఎంసీఏ, స్వీకార్-ఉప్‌కార్ వైపు మళ్లిస్తారు. ● టివోలి నుంచి ట్రాఫిక్‌ను ప్లాజావైపు అనుమతించరు. అక్కడి ట్రాఫిక్‌ను స్వీకార్-ఉప్‌కార్, బాలంరాయి జంక్షన్ వైపు మళ్లిస్తారు. ● కార్ఖాన, జేబీఎస్ నుంచి ఎస్‌బీహెచ్, ప్యాట్నీవైపు వచ్చే ట్రాఫిక్ స్వీకార్-ఉప్‌కార్ వద్ద వైఎంసీఏ-క్లాక్‌టవర్-ప్యాట్నీ వైపు లేదా టివోలీ, బ్రూక్‌బ్రాండ్, బాలంరాయి వైపు అవసరం మేరకు మళ్లిస్తారు. ● ప్లాజా జంక్షన్, టివోలీ, సికింద్రాబాద్ క్లబ్, తిరుమలగిరి ఎక్స్ రోడ్, లోతుకుంట, అల్వాల్, బొల్లారం చెక్‌పోస్ట్, హకీంపేట వై జంక్షన్ నుంచి ప్రయాణించే ఆర్టీసీ బస్సులు ఉదయం 11 నుంచి 12 మధ్య తిరిగి సాయంత్రం 5.30 నుంచి ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి ఉంటుంది.

బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లు
ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కార్ఖానా, న్యూస్‌టుడే: ట్రాఫిక్ సిగ్నళ్లతో పాటు దుకాణాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు ట్రాన్స్‌జెండర్లతో పాటు మరో నలుగురు నకిలీ ట్రాన్స్‌జెండర్లను కార్ఖానా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన సూరద చాందిని అలియాస్ సాయికుమార్ (45), యాప్రాల్ బాలాజీనగర్‌కు చెందిన నల్లన్నగారి జయశ్రీ అలియాస్ రమేష్ (29), యాప్రాల్ బాలాజీనగర్‌కు చెందిన ఏటప్పగారి మనీషా అలియాస్ మల్లేష్ (25) లింగమార్పిడి చేసుకొని ట్రాన్స్‌జెండర్లుగా మారారు. యాప్రాల్ బాలాజీనగర్‌కు చెందిన కోయల దిన్న అలియాస్ సురేష్ (35), షేక్ ముంతాజ్ అలియాస్ బాషా (39), షేక్ ఆషు అలియాస్ షఫి (45), షేక్ సమీరా అలియాస్ ఇషాక్ (29)లు ట్రాన్స్‌జెండర్లుగా చలామణి అవుతున్నారు. వీరంతా కార్ఖానా ఠాణా పరిధిలోని సిగ్నళ్ల వద్ద వాహనాదారులతో పాటు వ్యాపార సముదాయాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పలువురి ఫిర్యాదుతో పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (శుక్రవారం నాటివి.. కిలో రూ.లో) టమాట 43, వంగ 28, బెండ 35, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 35, దొండ 35, ఆలు 37, ఉల్లి 54, సొర 15, పొట్ల 18, బీన్స్ 55, గోరుచిక్కుడు 40, చిక్కుడు 55, దోస 25, బీర 28, కాకర 38, చామగడ్డ 35, కీర 35, క్యాప్సికం 65, బీట్‌రూట్ 28, కందగడ్డ 55, చిలకడదుంప 45, మామిడి 65, మునగ 85, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాట కిలో రూ. 43, వంగ 28, బెండ 35, పచ్చిమిర్చి 28, కాకర 35, బీర 40, క్యాబేజీ 20, బీన్స్ 55, క్యారెట్ 40, దొండ 33, చిక్కుడు 50, క్యాప్సికం 68, ఆలు 38, కీర 20, దోస 19, చామగడ్డ 35, అరటి 10, బీట్‌రూట్ 28, సొర 15, గోకర 28

భూగర్భ మురుగు కాలువ పనులు ప్రారంభం

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ మౌలాలి తిరుమల నగర్ కాలనీలో రూ.9 లక్షలతో చేపట్టిన భూగర్భ మురుగు కాలువ పనులను(యూజీడీ) శుక్రవారం కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మురుగు పారుదల సక్రమంగా ఉండేలా పనులు చేపడుతున్నామన్నారు. జలమండలి మేనేజర్ నవీన్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నర్సింగ్‌రావు, బాబూరావు, రత్నం, రాము, మాధవర్, అంజయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు



మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం, సాయంత్రం స్వామివారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



మౌలాలి, న్యూస్‌టుడే: మౌలాలి డివిజన్ గాయత్రీనగర్‌లోని శ్రీగాయత్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఆలయం కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఉదయం పంచహారతులు, రాత్రి మంత్రపుష్పంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో భద్రత అంతంతే..!

గౌతంనగర్, న్యూస్‌టుడే: ప్రజల సౌలభ్యం కోసం గ్రేటర్ పరిధిలో ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయాల్లో సామగ్రికి భద్రత కరవైంది. మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఎప్పుడు ఏ వస్తువు మాయమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలను పట్టుకోవడం అటు సిబ్బందికి, ఇటు పోలీసులకు సవాల్‌గా మారింది. పది రోజుల క్రితం సర్కిల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో డీఈ గదిలోని కంప్యూటర్‌కు సంబంధించిన సీపీయూ, మౌస్, కీబోర్డు మాయమయ్యాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. కానీ ఇంతవరకు కంప్యూటర్ ఎవరు తీసుకెళ్లారో తెలియకపోవడం విశేషం.



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం



ఆఫీసులో సీసీ కెమెరాలు

నిత్యం వందలాది మంది...

మల్కాజిగిరి గ్రామ పంచాయతీగా మొదలై మున్సిపాలిటీగా ఎదిగి ప్రస్తుతం గ్రేటర్‌లో భాగమైంది. ఇక్కడ 6 లక్షల మంది.. 6 డివిజన్లు.. 420పైగా కాలనీలు ఉన్నాయి. 1940లో చిన్న కుగ్రామంగా ఉన్న మల్కాజిగిరి 1981లో మున్సిపాలిటీగా అవతరించింది. 2007లో గ్రేటర్‌లో విలీనమైంది. ప్రస్తుతం 87,169 గృహ.. 6,037 వ్యాపార సముదాయాలున్నాయి. గతంలో గాంధీ పార్కు వద్ద నిర్వహించే సర్కిల్ కార్యాలయానికి కాలక్రమేణా సొంత భవనం నిర్మించుకున్నారు. సుమారు 458 మంది నాలుగో తరగతి ఉద్యోగులు ఉండగా.. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పన్ను వసూళ్ల విభాగంలో మరో 126 మంది సిబ్బంది ఉన్నారు. వీరంతా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధుల్లో ఉంటారు. ఇంజినీరింగ్, పన్ను వసూళ్ల సిబ్బంది ఫీల్డ్ వర్క్ అనంతరం సాయంత్రం 3 నుంచి 5 గంటల గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. కార్యాలయంలో రెండు అంతస్తులకు కలిపి 16 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. కార్యాలయం మొత్తానికి ఒకే కాపలాదారు ఉన్నాడు. నిత్యం వందలాది మంది మల్కాజిగిరి వాసులు పలు రకాల పనుల నిమిత్తం సర్కిల్ కార్యాలయానికి వస్తుంటారు. ఇంత పెద్ద వ్యవస్థ ఉన్న కార్యాలయంలోనే భద్రత లేకపోవడం గమనార్హం.

ఇటీవల గణేశ్ నిమజ్జన విధుల్లో భాగంగా సిబ్బంది నిమగ్నమైన సందర్భంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంజినీరింగ్ విభాగంలో కంప్యూటర్‌ను చోరీ చేశారు. ఈ విషయమై ఉప కమిషనర్ రాజు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కార్యాలయంలోని సీసీ ఫుటేజీలను పోలీసులకు అప్పగించామని, కేసు దర్యాప్తులో ఉందన్నారు. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఫలితం లేదని, దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

★ సర్కిల్ పరిధిలో ఏటా రకరకాల పన్నులు కలిపి సుమారు రూ.40 కోట్లకుపైగా వసూలు చేస్తారు. కానీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తగిన వసతులను కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ★ పౌర సేవా కేంద్రం వద్ద నాలుగు వరసల కుర్చీల్లో రెండు మాయమయ్యాయి. ★ కార్యాలయంలో మూత్రశాలల నుంచి దుర్వాసన వస్తుండడంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. ★ పరిశుభ్రమైన తాగునీరు కేవలం అధికారులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. సందర్శకులకు చుక్క నీరు దొరకదు. ★ జనరేటర్ అందుబాటులో ఉన్నా పనిచేసేది నామమాత్రంగానే. ★ ఏ వాహనం వస్తుందో.. వెలుతుందో ఎవరికీ తెలియదు. ★ కార్యాలయానికి సంబంధించిన అనేక దస్త్రాలు ఆరుబయటే ఉన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, మౌలాలి, అల్వాల్, న్యూస్‌టుడే:

? మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్‌లోని శంకర విద్యాపీఠం వద్ద కొన్ని రోజులుగా వీధి దీపం వెలగటం లేదు. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. –ఎం.నాగేశ్వరరావు, కాలనీవాసి

✓ కాలనీలో వీధి దీపాలను పరిశీలిస్తాం. వెలగని వాటికి మరమ్మతులు చేసి వెలిగించేలా చర్యలు తీసుకుంటాం. –వెంకటేశ్, పర్యవేక్షకులు, సర్కిల్ వీధిదీపాల విభాగం

? గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో వారం రోజులుగా విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి అంధకారం నెలకొంటోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. –వీరేశం, మల్లికార్జున్‌నగర్

✓ పరిశీలించి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
–వెంకటేష్, ఏఈ, వీధి దీపాల నిర్వహణ

? డివిజన్‌లోని ప్రగతినగర్‌లో చెత్త, చెదారం పేరుకుపోయింది. దుర్వాసన వెలువడుతోంది. – శ్రవణ్, మౌలాలి

✓ వాటిని తరలించేలా చర్యలు తీసుకుంటాం.
–శ్రీనివాస్‌గౌడ్, పారిశుద్ధ్య విభాగం అధికారి

? శక్తినగర్‌కాలనీ సమీపంలోని కరుణానగర్ కాలనీ రోడ్డు నంబరు-2లో వీధి దీపాలు వెలగడం లేదు. స్థానికులు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు.– జయసింహారావు, స్థానికుడు

✓ కొత్త దీపం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటా.
–రఘుపతిరెడ్డి, డీఈ

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ● **ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ప్రాంతాలు:** సంతోషీమానగర్ ఫీడర్ పరిధిలోని సంతోషీమానగర్, డి.మార్ట్ వెనుక ప్రాంతాలు, వినాయక్‌నగర్. ● **ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రాంతాలు:** ఆర్కే నగర్ ఫీడర్ పరిధిలోని ఆర్కేనగర్, చాణిక్యపురి, వెస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాలు ● **మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రాంతాలు:** వెస్ట్ ఆనంద్ బాగ్, ఏడీఆర్ ఆస్పత్రి వెనుక ప్రాంతం, కృపానంద్ అపార్టుమెంట్స్ ప్రాంతం.

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: ● **మధ్యాహ్నం 3 నుంచి సాయంత్ర 4.30 గంటల వరకు వినాయకనగర్, ఓల్డ్ సఫిల్ గూడా, వీవీ గార్డెన్, సుధానగర్**

అల్వాల్, న్యూస్‌టుడే: ● **ఉదయం 11:30 నుంచి 12 గంటల వెంకటాపురం, లక్ష్మీనగర్, ఇందిరానగర్, జగన్నాథ టెంపుల్** ● **మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు** రుక్మిణి ఎన్‌క్లేవ్, పెద్దిపద్మరెడ్డికాలనీ, సంజీవ్‌రెడ్డి వేడుక మందిరం, గణేశ్ ఎన్‌క్లేవ్, రాయల్ ఎన్‌క్లేవ్, రాందేవ్‌బాబా ఆలయం, లక్ష్మీనగర్ ● **మధ్యాహ్నం 1:30 నుంచి 2 వరకు:** కిష్టమ్మ ఎన్‌క్లేవ్, నాగిరెడ్డికాలనీ, దమ్మాయిగూడ కూడలి, వేణుగోపాల్‌రావునగర్, ఎగ్జిక్యూటివ్‌కాలనీ, యాదమ్మనగర్ పంపుహౌస్ ప్రాంతాలు.

గౌతంనగర్, న్యూస్‌టుడే: ● **ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు** గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్, గౌతంనగర్, ఉత్తమ్‌నగర్, ఏకలవ్యనగర్, దయానంద్‌నగర్

'భాజపా సభ్యత్వ నమోదుకు ఆదరణ'

రాంనగర్, న్యూస్‌టుడే: భాజపా చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రక్రియకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో.. ముషీరాబాద్ నియోజకవర్గం యువ మోర్చా కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ సర్కార్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై.. యువత సహా పలువురు స్వచ్ఛందంగా భాజపా సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు. కార్పొరేటర్లు సుప్రియ, రచనశ్రీ పాల్గొన్నారు.



చరవాణిలో సభ్యత్వం అందజేస్తున్న లక్ష్మణ్. చిత్రంలో శ్రీనివాస్ యాదవ్ తదితరులు

వాకర్స్ సభ్యుల వితరణ

గౌతంనగర్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌కు చెందిన భాగ్యలక్ష్మి భర్త చనిపోవడంతో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుమార్తె, కుమారుడిని చదివిస్తున్నారు. డిగ్రీ చదువుతున్న కుమార్తె మల్లేశ్వరి ఊపిరితిత్తుల వ్యాధితో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం భాగ్యలక్ష్మికి రూ.27,100 నగదు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, రవీందర్, పీవీఎన్‌రావు, గోవింద్, శివ, వెంకటేశం, అనిల్, సుబ్బారావు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కృషి

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేలా కృషి చేస్తున్నామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి చెప్పారు. తూర్పుఆనంద్‌బాగ్‌లోని ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఐదేళ్ల అనుభవం ఉన్న జర్నలిస్టుల సమాచారం సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బాలరాజు, బిక్షపతి, భాస్కరరెడ్డి, రాములు, వెంకటేశ్, విశాల్, సునీల్‌రెడ్డి, మోహన్‌రావు, లవకుమార్, శివకుమార్ తదితరరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



జయంతి వేడుకల్లో బీసీ నాయకులు

మౌలాలి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మౌలాలి భరత్‌నగర్‌లో శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్కాజరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల శ్రీనివాస్, సీనియర్ నాయకులు బత్తిని నరసింహగౌడ్, సంపత్, గోపాల్, బాలరాజు, సుధాకర్, వంశీ నేత, నరేందర్, పిట్టల నాగరాజ్, మంద భాస్కర్, దశరథినేత, వెంకటేష్ నేత, ఆంజనేయులు, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

నేరేడ్‌మెట్: ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగి రమేష్ కోరారు. వాజ్‌పేయీనగర్‌లోని కళాశాల ఆవరణలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మొక్కలను నాటారు. జాతీయ సేవా విభాగం అధికారి డాక్టర్ జగన్, డాక్టర్ ప్రదీప్, హరిత, రాజేష్, శైలజ, లలిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్నా.. పట్టించుకోరేం?



గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌లో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ ఆధునికీకరణ పనుల్లో భాగంగా రోడ్డుపై తవ్వకాలు చేపట్టారు. పనుల అనంతరం దారికి మరమ్మతులు చేపట్టలేదు. ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు.
–న్యూస్‌టుడే, గౌతంనగర్

జాతీయ సమైక్యతకు హిందీ దోహదం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజశ్రీ మోరె

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: హిందీ భాష సనాతన సంప్రదాయాన్ని కాపాడడానికి, జాతీయ సమైక్యతను చాటడానికి ఎంతో దోహదపడుతుందని కోటి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజశ్రీ మోరె అన్నారు. హిందీ భాషా వారోత్సవాల్లో భాగంగా హిందీ దివస్ వేడుకలను నేరేడ్‌మెట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డా. అడవిరాజు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ రాజశ్రీ మోరే మాట్లాడారు. హిందీ విశిష్టతను వివరించారు. హిందీ నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు పొందవచ్చని చెప్పారు. హిందీ విభాగం అధ్యక్షుడు, భారత ప్రభుత్వ భాషా సలహాదారు డా. జగన్ మాట్లాడుతూ హిందీ భావ వ్యక్తీకరణకు సులభమైన, సరళమైన భాష అని అన్నారు. సామాన్యునికి కూడా అర్థమయ్యే భాష అని వివరించారు. కళాశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు విభాగం అధ్యక్షులు శైలజ, సంస్కృత విభాగం అధ్యక్షులు డా. అహల్య తదితరులు పాల్గొన్నారు.

30న ధర్నాచౌక్‌లో 'రైతు హామీల సాధన దీక్ష': భాజపా



మహేశ్వర్‌రెడ్డితో పొంగులేటి సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి

రాంనగర్: అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు భాజపా పోరాటాలు చేపడుతుందని ఆ పార్టీ శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. హామీలన్నింటినీ సత్వరం అమలుచేయాలని కోరుతూ ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరా పార్కు సమీపంలోని ధర్నా చౌక్‌లో 24 గంటల పాటు 'రైతు హామీల సాధన దీక్ష' చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కిసాన్ మోర్చా నేతలతో కలిసి ధర్నాచౌక్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్రనేత రాహుల్‌గాంధీని రాష్ట్రానికి తీసుకొచ్చి 'వరంగల్ డిక్లరేషన్' పేరిట అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. పంట ఉత్పత్తులకు బోనస్‌తోపాటు రైతుభరోసా పథకం కూడా బోగస్ అని.. సగంమంది కర్షకులకే రుణమాఫీ చేశారని ఆయన చెప్పారు. వానాకాలం సీజన్ మొదలైనా.. రైతుభరోసా నిధులను విడుదలచేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతుల పక్షాన పోరాటం చేయాలని భాజపా నిర్ణయించి.. 'రైతు హామీల సాధన దీక్ష' కార్యక్రమాన్ని తలపెట్టిందన్నారు. సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంజయ్య యాదవ్, జగన్ మోహన్‌రెడ్డి, కార్యదర్శి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



పతాకావిష్కరణలో సీపీఎం నాయకులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రవి డిమాండ్ చేశారు. డిఫెన్స్ కాలనీ పరిధిలోని అంతయ్యకాలనీ పార్టీ శాఖ మొదటి మహాసభలు శుక్రవారం స్థానిక సామాజిక భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలను అమలు చేయకపోతే సీపీఎం తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంజుల, నర్సింగరావు, కృపాసాగర్, నాగమణి, లత తదితరులు పాల్గొన్నారు.

పేదల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదు: ఈటల



జొన్నబండవాసులతో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

అల్వాల్, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. 582, 583 సర్వే నంబర్లలో తాఖీదులు అందుకున్న జొన్నబండ బస్తీలో శుక్రవారం ఆయన పాదయాత్ర చేశారు. స్థానికుల ఆందోళనను తెలుసుకొని ఆయన మాట్లాడారు. తాఖీదులతో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఏళ్ల నుంచి నివాసముంటున్న పేదల ఇళ్లకు ఎలా తాఖీదులు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తక్కువ కాలంలోనే ప్రజావ్యతిరేకత మొదలైందన్నారు. శని, ఆదివారాలను చూసుకొని నిజాం సర్కార్ కంటే దుర్మర్గంగా కూల్చివేతలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. పేదల సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

మౌలాలిలో స్వచ్ఛతా హీ సేవ

మౌలాలి: అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్‌లోని మౌలాలి కమాన్ వద్ద శుక్రవారం పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి సర్కిల్ ఉప వైద్య అధికారిణి శ్రీమతి కె.మంజుల మాట్లాడుతూ అంటువ్యాధులు, మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇంటిలోని చెత్తను స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు అందజేయాలని సూచించారు. అనంతరం కమాన్ వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు శ్రీనివాస్ గౌడ్, అంజయ్య, మనీషా, ఎస్ఎఫ్ఏలు అజయ్, జవాన్ ఇబ్రహీం పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

శుభ్రత పాటిద్దాం.. స్వచ్ఛభారత్ నిర్మిద్దాం

మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవ

గౌతంనగర్, న్యూస్‌టుడే: లక్ష్యం ఎంత పెద్దదైనా సంకల్ప బలం ఉంటేనే అది సాధ్యమవుతుంది. పరిసరాల శుభ్రతకు పాటుపడడంతోపాటు స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని సాధించాలన్న ప్రధాని నరేంద్రమోదీ సందేశంతో ఎస్సీఆర్ (రైల్వే) ఉద్యోగులు కదిలారు. వీరికి స్థానిక కాలనీ వాసులు, సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెల్లర్స్ సంఘం సభ్యులు, విద్యార్థులు సహకరించారు. స్వచ్ఛ భారత్-స్వచ్ఛతా హీ సేవ నినాదంతో శుక్రవారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని సమష్టిగా తొలగించారు. అంతకుముందు ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని, పరిసరాల శుభ్రతను కాపాడాలని స్థానికులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయడంతో పాటు స్టేషన్ పరిసరాల్లో ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. కళాకారులు ప్రదర్శించిన స్వచ్ఛ నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీనియర్ డీపీవో సుధీర్‌కుమార్, చీఫ్ వెల్ఫేర్ అధికారి దేవిడ్‌రాజు, వినోద్, రజని, డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్, మధు, హీరాసింగ్, రాజేష్, శ్యామ్‌కుమార్, ఏవీస్వామి, వాసంశెట్టి శ్రీనివాస్, శంకర్‌రావు, డీఏవీ పబ్లిక్ స్కూల్, జ్యోతి ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

బాధ్యతగా భావిస్తున్నా..



– సుధీర్‌కుమార్, డీపీవో, ఎస్సీఆర్

రైల్వే పరిసరాల్లో చెత్తను తొలగించడంతోపాటు స్టేషన్లను శుభ్రంగా తీర్చిదిద్దడం బాధ్యతగా భావిస్తున్నా. ప్లాస్టిక్ కాఫీ గ్లాసులు, టిఫిన్ ప్లేట్లు, మంచినీళ్ల సీసాలు, ఇతర వ్యర్థాలను స్టేషన్‌లో ఎక్కడ పడితే అక్కడ వేయకూడదు. మరుగుదొడ్లను వాడిన తర్వాత నీరు ఎక్కువగా వాడాలి. పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతను ఇతరులకు చెప్పడమే కాకుండా వారందరిలో అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి



– నూర్, డీఆర్‌యూసీసీ సభ్యుడు

ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న స్వచ్ఛ భారత్ నిర్ణయం ప్రజాహితంతో కూడుకున్నది. సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్థానికులంతా ముందుకు రావాలి. అప్పుడే ప్రభుత్వం చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు విజయవంతమవుతాయి. సామాజిక సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలి. అప్పుడే దేశం ప్రపంచంలో ముందు వరుసలో ఉంటుంది. కనీసం వారానికి ఒక్కసారైనా పజలంతా స్వచ్ఛభారత్‌లో పాల్గొనాలి.

రైల్వే స్టేషన్లు మనందరివి



– రజని, రైల్వే ఉద్యోగి, యాంకర్

రైల్వే స్టేషన్లు మనందరివి. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయొద్దు. మిగిలిన ఆహార పదార్థాలను ఆవరణలో, బయట వేయకూడదు. ప్లాట్‌ఫామ్‌లపై మల మూత్ర విసర్జన చేయొద్దు. మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవడం నాకు చాలా సంతోషం కలిగించింది. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే స్వచ్ఛ భారత్ కల సాకారమైనట్లే.

ప్రగతి పనుల్లో నాణ్యత పాటించాలి: ఎమ్మెల్యే



పైపులైన్ నిర్మిస్తున్న ప్రాంతంలో ముఠా గోపాల్

రాంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. వీఎస్టీ కూడలిలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న పైపులైన్ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నపాటి వర్షం వచ్చినా స్థానికంగా 3 అడుగుల మేరకు వరద నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి చేపట్టిన పైపులైన్ పనుల్లో గుత్తేదారు నాణ్యత పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భారాస నాయకులు ముఠా జైసింహ, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్, జ్ఞానేశ్వర్, కిశోర్, సత్యనారాయణ, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

ఆకట్టుకున్న ద్విభాషా సినీ సంగీత విభావరి



గాయకులతో బాలకామేశ్వరరావు, జంగయ్యగౌడ్

గాంధీనగర్, న్యూస్‌టుడే: కల్చరల్ కళాకేతన్, అనుపేగ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను మధురంగా ఆలపించి ఆకట్టుకున్నారు. గాయకుడు బాలకామేశ్వరరావు గౌరవ అతిథిగా హాజరై గాయనీగాయకులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు దొంతి జంగయ్యగౌడ్, ప్రముఖులు దైవజ్ఞశర్మ, బాలయ్యచౌదరి, వడ్లమాను వెంకటేశ్వర్లు, అయోధ్య రామయ్య, భీమ్‌రావ్, మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఆమ్రపాలికి వినతిపత్రం ఇస్తున్న రోహిన్‌రెడ్డి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలని, కొత్తగా చేపట్టేవాటికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు సత్వరమే మరమ్మతులు చేయించాలని కోరారు.

వరదనీటి పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి

ముషీరాబాద్, న్యూస్‌టుడే: భోలక్‌పూర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్-1, 2 ప్రాంతాలతోపాటు బంగ్లాదేశ్ మార్కెట్ పరిసరాల్లో వరదనీటి పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ మహ్మద్ గౌసుద్దీన్ తెలిపారు. శుక్రవారం జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో.. డీఈ సన్నీ, ఏఈ సుభాష్‌లతో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లు, పొంగిపొర్లుతున్న నాలాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సత్వరం చర్యలు చేపట్టాలని కోరారు. ఎంఐఎం నేత షరీఫ్‌హుస్సేన్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసు పాల్గొన్నారు.

'భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజాదరణ'



చరవాణిలో సభ్యత్వం అందజేస్తున్న లక్ష్మణ్. చిత్రంలో శ్రీనివాస్ యాదవ్ తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే: భాజపా చేపట్టిన సభ్యత్వ నమోదు ప్రక్రియకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో.. ముషీరాబాద్ నియోజకవర్గం యువమోర్చా కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ సర్కార్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై.. యువత సహా పలువురు స్వచ్ఛందంగా భాజపా సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు సుప్రియ, రచనశ్రీ, నాయకులు సలేంద్ర శ్రీనివాస్‌యాదవ్, భరత్‌గౌడ్, రమేశ్‌రాం, వెంకటేశ్, పూస రాజు, అరుణ్, రఘునాథ్, రాకేశ్, నవీన్, చింటూ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మూసీలో ఆక్రమణలు.. తొలగింపుపై ఆందోళనలు

రెండు నెలల క్రితం గుర్తులు వేసిన రెవెన్యూ సిబ్బంది



మూసీ నదిని ఆనుకుని చేపట్టిన నిర్మాణాలు



రెవెన్యూ సిబ్బంది వేసిన గుర్తులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీ నది పరీవాహక ప్రాంతంలోని ఆక్రమణల తొలగింపునకు హైడ్రా యంత్రాంగం ఉపక్రమిస్తుండడంతో అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మూసీ నది ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాల కూల్చివేతలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. బఫర్ జోన్‌లో ఇళ్లను నిర్మించుకుని వేల మంది పేదలు, దిగువ మధ్యతరగతి వారు నివాసం ఉంటున్నారు. అయితే, వాటి జోలికి హైడ్రా అధికారులు వెళ్లరని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కేవలం ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను మాత్రమే కూల్చివేయడానికి మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) సూచనల మేరకు రెవెన్యూ విభాగం సర్వే ప్రక్రియను గతంలోనే చేపట్టిందంటున్నారు.

ఆక్రమణలతో అన్యాక్రాంతం

నియోజకవర్గంలోకి మూసీ నది ప్రవేశించాక.. గోల్నాక, అంబర్‌పేట డివిజన్లలోని పలు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ ఉప్పల్ నియోజకవర్గంలోకి వెళుతుంది. కొన్ని దశాబ్దాల వ్యవధిలో మూసీ నదితోపాటు పరీవాహక ప్రాంతంలోనూ ఆక్రమణలు కొనసాగాయి. నదికి ఇరువైపులా ఉన్న స్థలాలను మట్టితో పూడ్చివేసిన కొందరు అక్రమార్కులు.. అనంతరం ప్లాట్లుగా చేసి విక్రయించారు. అవి తక్కువ ధరకు వస్తుండడంతో పేదలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం బఫర్ జోన్‌ను మినహాయించి మూసీ నదిలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయడానికి రంగం సిద్ధమవుతుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

షెడ్లలో కుటీర పరిశ్రమల నిర్వహణ

మూసీ నదికి ఆనుకుని ఉన్న న్యూదుర్గానగర్ ప్రాంతంలో షెడ్లను వేసుకుని పలువురు చిన్నతరహా, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్నారు. ఎంఆర్‌డీసీఎల్ ఆదేశాలకనుగుణంగా రెణ్నెల్ల క్రితం అంబర్‌పేట మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది సర్వే చేపట్టారు. ఈ క్రమంలో న్యూ దుర్గానగర్‌లో ఉన్న కట్టడాలు, షెడ్లకు గుర్తులు వేశారు. రెవెన్యూ విభాగం సర్వే నిర్వహించి వేసిన గుర్తుల ఆధారంగా... ముందుగా కూల్చివేతలను చేపడతారని ప్రచారం జరుగుతోంది.

ఆక్రమణలను గుర్తించాం..

-వీరాబాయి, తహసీల్దార్, అంబర్‌పేట మండలం

రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేలో భాగంగా మూసీ నదిలో ఆక్రమణలను గుర్తించాం. అనంతరం సంబంధిత కట్టడాలు, షెడ్లపైనా గుర్తులు వేశాం. కూల్చివేతల విషయం హైడ్రా పరిధిలోకి వస్తుంది.

చిన్నతరహా పరిశ్రమలను కూల్చొద్దు



వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న చిన్నతరహా పరిశ్రమలను కూల్చొద్దని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అలీకేఫ్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించి అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టాక.. బాధితులతో కలిసి ఆర్ఐకి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఒక్కో పరిశ్రమలో అనేకమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వాటిని కూల్చివేస్తే వందల మంది రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. నేతలు లవంగు ఆంజనేయులు, లింగారావు, జాఫర్, మహేశ్ ముదిరాజ్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

బస్తీవాసులకు మద్దతు ప్రకటించిన సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్

మూసీ సుందరీకరణ పేరిట ఇళ్లు, కార్ఖానాలను తొలగించొద్దని కోరుతూ అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన దుర్గానగర్ బస్తీవాసులు, కార్మికులకు సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్, అంబర్‌పేట జోన్ కన్వీనర్ మహేందర్‌లు మద్దతు తెలిపారు. బాధితులతో మాట్లాడి నష్ట పరిహారం చెల్లించాకే కూల్చివేతలపై ముందుకెళ్లాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య కేంద్రంలో 'స్వచ్ఛ భారత్'



చెత్తను తొలగిస్తున్న ఆనంద్‌గౌడ్, నాగభూషణం, భిక్షపతి, యాదగిరి, నవీన్‌రెడ్డి, వెంకటస్వామి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ఆరోగ్య కేంద్రంలో భాజపా ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్'ను నిర్వహించారు. 'స్వచ్ఛతాహీ సేవా'లో భాగంగా శుక్రవారం ఎంసీహెచ్ కాలనీలోని నగర సామాజిక ఆరోగ్య కేంద్రంలో భాజపా అంబర్‌పేట అధ్యక్షుడు నాగభూషణంచారి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం నేతలు భిక్షపతి, యాదగిరి, నవీన్‌రెడ్డి, మైలారం రాజు, వెంకటస్వామిగౌడ్, భాస్కర్‌గౌడ్, ఈశ్వర్, పెంటం రాజు, ఎస్ఎస్‌రెడ్డి, మనోజ్‌యాదవ్, వినోద్, జగన్‌యాదవ్‌లతో కలిసి.. కేంద్రంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

30న ధర్నాచౌక్‌లో 'రైతు హామీల సాధన దీక్ష': భాజపా



మహేశ్వర్‌రెడ్డితో పొంగులేటి సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి

రాంనగర్: అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు భాజపా పోరాటాలు చేపడుతుందని ఆ పార్టీ శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. హామీలన్నింటినీ సత్వరం అమలుచేయాలని కోరుతూ ఈ నెల 30న ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో 24 గంటల పాటు 'రైతు హామీల సాధన దీక్ష' చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కిసాన్ మోర్చా నేతలతో కలిసి ధర్నాచౌక్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్రనేత రాహుల్‌గాంధీని రాష్ట్రానికి తీసుకొచ్చి 'వరంగల్ డిక్లరేషన్' పేరిట అన్నదాతలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. పంట ఉత్పత్తులకు బోనస్‌తోపాటు రైతుభరోసా పథకం కూడా బోగస్ అని.. సగం మంది కర్షకులకే రుణమాఫీ చేశారని ఆయన చెప్పారు. వానాకాలం సీజన్ మొదలైనా.. రైతుభరోసా నిధులను విడుదలచేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతుల పక్షాన పోరాటం చేయాలని భాజపా నిర్ణయించి 'రైతు హామీల సాధన దీక్ష' కార్యక్రమాన్ని తలపెట్టామని చెప్పారు. సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంజయ్య యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, బాగ్‌లింగంపల్లి, రాంనగర్, నల్లకుంట, న్యూస్‌టుడే:

? గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్ర సమీపంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. చీకటి కారణంగా స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. -ఝాన్సీ, గాంధీనగర్

? శంకర్‌మఠ్ ఆలయ వెనక ప్రాంతం నుంచి పద్మకాలనీ సామాజిక భవనం వెళ్లే రోడ్డులోని వీధి దీపాలు కొన్నాళ్లుగా వెలగడం లేదు.
-రామకృష్ణ, పద్మకాలనీ

✓ వెలగని వీధిదీపాలను పరిశీలించాక మరమ్మతులు చేయిస్తాం.
– అనూష, జీహెచ్ఎంసీ వీధిదీపాల నిర్వహణ విభాగం ఏఈ

? రాంనగర్ డివిజన్ రిసాలగడ్డ కల్లు కాంపౌండ్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. -శ్రీనివాస్, రాంనగర్

✓ సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం
-మోహన్‌రాజ్, డీజీఎం జలమండలి

? న్యూనల్లకుంట సెయింట్ ఆగస్టీన్ పాఠశాల లేన్‌లో చెట్టు ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. దాని తొలగింపుపై సత్వరం దృష్టిసారించండి. -విజయ్ కుమార్, న్యూనల్లకుంట

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించాక చెట్టును తొలగించే విషయాన్ని పరిశీలిస్తాం. – ఫయాజ్, ఉద్యానశాఖ పర్యవేక్షకుడు

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు



క్రీడాకారుడికి ట్రోఫీ అందజేస్తున్న కె.ఉమారాణి, మహాలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న హిమాయత్‌నగర్ మండల జోనల్‌స్థాయి కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమానికి కాచిగూడ, హిమాయత్‌నగర్ కార్పొరేటర్లు కె.ఉమారాణి, జి.మహాలక్ష్మి, హిమాయత్‌నగర్ మండల ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి హాజరై.. విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వారంతా మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా విద్యార్థులను గురువులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మి, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నేతలు శీర్‌సాగర్, కృష్ణకుమార్, సుభాష్‌పటేల్ గౌడ్, మిలింద్ పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో నీటితొట్లు ఏర్పాటు చేయండి: వీహెచ్

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కబ్జాకు గురైన బతుకమ్మకుంట పరిధిలోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడంతోపాటు స్థానికంగా 'బతుకమ్మ ఉత్సవాలు' నిర్వహించేలా నీటితొట్లు ఏర్పాటుచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు కోరారు. శుక్రవారం ఆమెను కార్యాలయంలో కలిసి.. ఈ దఫా వేడుకలను బతుకమ్మకుంటలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లతోపాటు దేవీ శరన్నవరాత్రులకు కల్పించాల్సిన సౌకర్యాలపై వినతిపత్రం అందజేశారు. బతుకమ్మకుంటలోని కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత నెలలో పరిశీలించాక.. తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఆయన గుర్తు చేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు



బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ సీబీడీ కార్యాలయం పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు.

ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు... 11కేవీ అంబర్‌పేట ఫీడర్ పరిధిలో అంబర్‌పేట, ఆకాష్‌నగర్, ఎంసీహెచ్ కాలనీ, రెడ్‌బిల్డింగ్, రామకృష్ణానగర్, వినాయకనగర్ పరిసర ప్రాంతాలు.

ఉ.11.30 నుంచి మ.12 గంటల వరకు.. 11కేవీ సీసీ ష్రాఫ్ ఫీడర్ పరిధిలో సీసీ ష్రాఫ్ ఆసుపత్రి, భూమన్నగల్లీ, రాజేంద్రనగర్, లింగంపల్లిలోని కొన్ని ప్రాంతాలు, కాచిగూడ రైల్వేస్టేషన్ పరిసరాలు.

ఉ.11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... 11కేవీ పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, కృష్ణానగర్, అంబేడ్కర్‌నగర్, ఆజాద్‌నగర్, వడ్డెరబస్తీ ప్రాంతాలు. ★ 11కేవీ తులసీనగర్ ఫీడర్ పరిధిలో తులసీనగర్, గోల్నాక, ఛే నంబరు ప్రధాన రహదారి సమీప ప్రాంతాలు.

మ.1.30 నుంచి 2 గంటల వరకు.. 11కేవీ కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, తులసీనగర్, గంగానగర్ పరిసర ప్రాంతాలు. ★ 11కేవీ డీడీ కాలనీ ఫీడర్ పరిధిలో డీడీ కాలనీ, ఏఅండ్‌బీ లేన్, రామచంద్రయ్య డిగ్రీ కళాశాల, గ్లాస్కో, ఇటాన్ కేఫ్ ప్రాంతాలు.

నరికేసినా.. తరలింపులో నిర్లక్ష్యమే



నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని నరేంద్ర పార్కు వద్ద చెట్లకొమ్మల వ్యర్థాలు పేరుకుపోయాయి. స్థానికంగా రోడ్లకు ఇరువైపులా పెరిగి ఇళ్లలోకి చొచ్చుకొచ్చిన చెట్లకొమ్మలను మూడు వారాల క్రితం నరికివేసినా.. తరలింపులో నిర్లక్ష్యంతో ఉద్యానం పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఇదే అదనుగా స్థానికుల్లో కొందరు అక్కడే వ్యర్థాలను పారవేస్తున్నారు. కొమ్మలను తరలించాలని బల్దియా సిబ్బందిని కోరుతున్నా స్పందన కరవైందని.. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవచూపాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నల్లకుంట

తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలి



జైస్వాల్‌గార్డెన్‌లో శ్రీనివాస్ ముదిరాజ్, ప్రతినిధులు



పద్మశాలికాలనీలో ప్రసాదానికి మంగళహారతి ఇస్తూ..

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన తిరుమల తిరుపతి లడ్డూ పవిత్రతను కాపాడాలని జైస్వాల్‌గార్డెన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. లడ్డూలో కల్తీ నేపథ్యంలో శుక్రవారం స్థానిక మైసమ్మ ఆలయం వద్ద.. వేంకటేశ్వర స్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కల్తీ వ్యవహారంలో దోషులను గుర్తించాక కఠినంగా శిక్షించి భక్తుల మనోభావాలను కాపాడాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినిధులు రామాగౌడ్, యాదవ్‌రెడ్డి, శ్రీహరిచారి, దిలీప్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, రామస్వామి, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి కాలనీలో సంప్రోక్షణ పూజలు

ముషీరాబాద్: లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు కోరారు. సంబంధిత ఘటన వెలుగుచూశాక.. నాణ్యమైన నెయ్యితో తితిదే తయారుచేయించిన లడ్డూలను తిరుపతి నుంచి తాజాగా తెప్పించారు. వాటిని శుక్రవారం కాలనీలో ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత సంప్రోక్షణ పేరిట స్థానికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుందర్‌పటాలే, సభ్యులు గోవిందరాజు, ఎస్.కె.శర్మ, తరుణ్, హరి, సుజాత, రాధిక, లావణ్య, ఉమాదేవి, కవిత, నాగేశ్వరస్వామి పంతులు పాల్గొన్నారు

స్ఫూర్తి ప్రదాత అక్కినేని



అవార్డు గ్రహీతలతో కేవీ రమణాచారి, శ్రీనివాసరావు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అక్కినేని నాగేశ్వరరావు ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి ప్రదాత అని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించారు. రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అక్కినేని క్రమశిక్షణతో సినీరంగంలో ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పలువురికి నగదు పురస్కారాలను ఆయన ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖులు రామరాజు శ్రీనివాసరావు, సి.రామకృష్ణ, శ్యామ్‌సుందర్, కొండపాక కృష్ణమాచార్య, కుసుమ భోగరాజు, లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE XXIV ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT HYDERABAD
O.S.No. 422 OF 2024

Between:
T. Ramachander Rao & 3 others ...Plaintiffs.
AND
1. Dy. Commissioner, GHMC Amberpet.
2. All Concerned. ...Defendants

This is to inform to the General Public that the above said Plaintiffs, Viz., T.RamachanderRao, T.Narender Kumar, T.Aruna Kumari, T.Ravinder Kumar who are the Husband, Sons and Daughter respectively and Legal Heirs of Late Smt. B.Sarojini Bai @ T.Laxmi the absolute owner of Residential House No. 2-3-54, admeasuring 346 Sq. yds equivalent to 289.25 Sq.mtrs is situated in Bagh Amberpet Revenue Mandal, Hyderabad district Telangana state. The present Suit No. OS No. 422/2024 has been filed by the Plaintiffs before the Court of Honorable XXIV Additional Chief Judge, seeking declaration as Legal Heirs of the above deceased owner of suit Schedule Property and the above OS is posted on 23.10.2024 before this Honorable Court. And this Honorable Court has directed the Plaintiffs to issue a notice to "All Concerned (D-2)" by way of paper publication. Hence, public at large are put to notice that if any person is having any objection to such claim of Plaintiffs to be declared as absolute Owners of the suit property may file their Objections/counter along with the relevant documents in support of their claim/objection at 10.30 am before the Court of the Honorable XXIV Additional Chief Judge at Hyderabad on 23.10.2024 failing which the Court will proceed and pass necessary orders as prayed for. By Order of Honorable XXIV Additional Chief Judge at Hyderabad.

Sd/- DURGA PRASAD KOTAMRAJU
Advocate
Counsel for Plaintiffs,
12-13-879/1, Hanuman Nagar, Tarnaka, Secunderabad 500 017. Cell: 9246547044.

అలుపెరుగని పోరాట యోధుడు కొండా లక్ష్మణ్



అశోక్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న అంజన్ కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్



అరుంధతినగర్‌లో ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న మేరుగు శ్రీనివాస్‌యాదవ్



ముషీరాబాద్‌లో బాపూజీ చిత్రపటం వద్ద నేతలు

ముషీరాబాద్, గాంధీనగర్, రాంనగర్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. పద్మశాలి ప్రజా సంఘం సహా వివిధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ..క్విట్‌ఇండియా, నాన్ ముల్కీ, తెలంగాణ తొలితరం ఉద్యమాల్లో లక్ష్మణ్ బాపూజీ కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ అలుపెరుగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయనకు భారతరత్న అవార్డు ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



ధరణి



గణేష్

నల్లకుంట: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా ధరణి, ప్రధాన కార్యదర్శిగా గణేష్‌లు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన హైదరాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ ప్రకటించారు. శుక్రవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ చిన్నానాయక్‌ల వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి(50) శుక్రవారం ఉదయం మలక్‌పేట స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-2 వద్ద పట్టాలను దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (శుక్రవారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట-50, ఆలుగడ్డ-50, వంకాయ-45, బెండ-45, దొండ-50, దోసకాయ-35, కాకర-60, బీర-70, సొర-30, క్యాబేజీ-40, క్యాప్సికం-60, బీన్స్-80, చిక్కుడు-80, క్యారెట్-50, బీట్‌రూట్-45, ఉల్లిగడ్డ-50, పచ్చిమిర్చి-45, వెల్లుల్లి-320, అల్లం-80.

రహదారిపై గుంత పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

న్యూనల్లకుంట-నర్సింహబస్తీ మార్గంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను సంబంధిత అధికారులు ఎట్టకేలకు పూడ్చివేయించారు. గుంత కారణంగా రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్న వైనంపై 'నడిరోడ్డుపై ప్రమాదం.. చెట్టుకొమ్మతో అప్రమత్తం' శీర్షికతో ఈనెల 26న ప్రచురితమైన చిత్రకథనానికి వారు స్పందించారు. శుక్రవారం ఉదయం సిబ్బంది అక్కడికి చేరుకుని.. గుంతను పూడ్చివేశారు.

న్యూస్‌టుడే, కీసర. నాగారం, నాచారం,హబ్సిగూడ

? బోగారం-ఘట్‌కేసర్ వెళ్లే రోడ్డులో తిరుమల కళాశాల మూల మలుపు వద్ద ఎప్పుడు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా ఉంటోంది. – రాములు, బోగారం

✓ రోడ్డు పక్కనున్న వ్యవసాయ పొలంలో నుంచి రోడ్డుపైకి వస్తున్నట్లు గుర్తించాం. రైతులతో మాట్లాడి నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం.
– ధన్‌రాజు, ఆర్‌అండ్‌బి ఏఈ కీసర

? నాచారంలోని గొల్లముత్యాలు బావి కాలనీలో మట్టిరోడ్లతో అవస్థలు పడుతున్నాం. గుంతల్లో పడిపోతున్నాం. –కైలాష్, నాచారం

✓ సీసీరోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. –రూప–డీఈ, నాచారం

?రామంతాపూర్ డివిజన్ శారదానగర్ రహదారి గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. –మోహన్, శారదానగర్

✓ గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. –శ్వేత, ఏఈ, రామంతాపూర్

? నాగారం బాజీనగర్ ఫేస్ -2లో చెట్ల కొమ్మలకు విద్యుత్తు తీగలు తగలడంతో తరచుగా కరెంటు పోతోంది. – భిక్షపతిగౌడ్ ,బాలాజీనగర్ , నాగారం

✓ సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – కామేశ్వరరావు, ఏఈ ట్రాన్స్‌కో , నాగారం

పార్కును శుభ్రంగా ఉంచుదాం

నాగారం, న్యూస్‌టుడే: పార్కులోకి వచ్చి సేదతీరేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పట్టణ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. శిల్పానగర్ పార్కులో శుక్రవారం చెత్త చెదారాన్ని వైస్ ఛైర్మన్ బండారు మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లతో కలిసి తొలగించారు.

వినియోగదారులు బిల్లులు చెల్లించాలి

కీసర: విద్యుత్తు వినియోగదారులు ప్రతినెలా బాధ్యతాయుతంగా కరెంట్ బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలని కీసర మండల ట్రాన్స్‌కో ఏఈ ఎస్. మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కీసర విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ప్రతినెలా రూ. 4.50 కోట్ల డిమాండ్ ఉంటే..ఇంకా రూ.కోటికిపైగా బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించాలని కోరారు.

ఉప్పల్

• ఉప్పల్ • మేడ్చల్

ఉపవాస దీక్షలపై అవగాహన

కాప్రా: మంచి నవరాత్రి ఉపవాస దీక్ష కార్యక్రమాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు నేచురల్ లైఫ్‌స్టైల్ తెలంగాణ ఇన్‌ఛార్జి జె.నిషాంత్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేనెల 3 నుంచి 11 వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవస్థల లోపం.. ప్రజలకు శాపం..!

● నాడు పట్టింపు లేదు.. నేడు చర్యలంటే ఎలా..!
● భూములు, చెరువులు, నాలాల అన్యాక్రాంతం
● ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం

న్యూస్‌టుడే, ఉప్పల్

కంచె చేను మేస్తే కాపు కాసేదెలా..? అన్న చందంగా ప్రభుత్వ సంస్థల తీరు మారిపోయింది. ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను, వివిధ రకాల వనరులను కాపాడటంలో వ్యవస్థలు విఫలమయ్యాయి. బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఆయా విభాగాల అధికారుల ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నేతల కనుసన్నల్లో పని చేశారు. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోలేదు. **ఫలితం ఇదీ:** ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాలలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయి. అక్రమ నిర్మాణాలు కొకొల్లలుగా వెలుస్తూనే ఉన్నాయి. వీటన్నింటికీ రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ, మున్సిపల్ విభాగాల అధికారులే కారకులు. ఇప్పటి ప్రభుత్వం వీటి పరిరక్షణకు చర్యలు చేపట్టడంతో ఇదే విభాగాల అధికారులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.

ఏ శాఖ పట్టించుకోలేదు..? శాఖల అధికారులెవరూ వాటివైపు దృష్టి పెట్టలేదు. ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్(గ్రామాలలో), హెచ్ఎండీఏ విభాగాల అధికారులెవ్వరూ కూడా కబ్జాదారులు చెరువులను చెరబడుతుంటే ఎలాంటి చర్యలు కూడా తీసుకోలేదు.

అంతా మింగేశారు..: చెరువుల తరహాలోనే నాలాలు సైతం సహజసిద్ధమైనవే. గ్రామం నుంచి పట్టణం వరకు నాలాలు వాటికవే ఏర్పడినవే. చెరువులు, కుంటలను అనుసంధానంగానే ఇవి ఉంటాయి. మరికొన్ని ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాల్లోనూ ఇవి ఉంటాయి. చివరకు కబ్జాదారులు నాలాలను సైతం మింగేశారు. వీటిని పరిరక్షించాల్సిన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాలతో నాలాల కబ్జాలు, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు హడావుడి చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు పోయాయి..: ఒకప్పుడు నగర శివారులో ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాలున్నాయి. ఈ రెండు నియోజకవర్గాలలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు భూములిచ్చినప్పటికీ ఇంకా లక్షల ఎకరాల్లో మిగిలే ఉన్నాయి. నగర విస్తరణ, అభివృద్ధి శివారు వరకు వచ్చేసింది. కబ్జాదారులు దర్జాగా కబ్జాలు చేస్తూ అమ్మేసుకుంటూ సొమ్ము చేసుకున్నారు. అయినా రెవెన్యూ విభాగం చర్యలు చేపట్టలేదు.

● భూములను పర్యవేక్షించే వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థ రద్దుతో నగర శివారులోని మేడ్చల్ నియోజకవర్గంలో కబ్జాలు మరింతగా పెరిగాయి.

అక్రమ నిర్మాణాల తర్వాత: జీహెచ్ఎంసీ, శివారులోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, ఇలా ప్రతి చోట అక్రమ నిర్మాణాలే జోరుగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అన్ని ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లను వేస్తున్నారు. వాటిలో ఎలాంటి భవనాల అనుమతులు లేకుండానే నిర్మాణాలను చేస్తూ పోతున్నారు. కొంతమంది అధికారులు ముడుపులు పుచ్చుకుంటూ చర్యలు తీసుకోవడం లేదు.





చిలుకానగర్ లే అవుట్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

చెరువులను చెరపట్టాక..

చెరువులు, కుంటలు సహజ వనరులు. నీటి సంరక్షణలో వీటి పాత్ర చాలా కీలకం. కానీ భూముల ధరలకు రెక్కలు వచ్చాక చెరువుల కింద ఉన్న భూములపైనే కబ్జాదారుల కన్ను పడింది. బఫర్‌జోన్ల నుంచి మొదలై ఎఫ్‌టీఎల్ వరకు దర్జాగా చెరువుల్లో మట్టి పోసి పూడుస్తూ కబ్జాలు చేస్తూ వచ్చారు. చివరకు చెరువులే లేకుండా పూడ్చేశారు.

● ఉప్పల్ భగాయత్ లే అవుట్లను హెచ్ఎండీఏ చేపట్టింది. దానిలోనూ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

● చిలుకానగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని, నాలాన్ని కలుపుకొని పట్టాభూమిగా చెలామణి చేసుకొని అక్రమ లే అవుట్ ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నా ఉప్పల్ సర్కిల్ అధికారులు ఏం పట్టించుకోవడం లేదు.

● రామంతాపూర్ భగాయత్ మొత్తంలోనూ అక్రమ లే అవుట్లల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

న్యూస్‌టుడే, బృందం: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి తరం ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, పలు సంస్థలు శుక్రవారం నిర్వహించారు.



మేడ్చల్‌లో..



ఏఎస్ రావునగర్‌లో..



జవహర్‌నగర్‌లో..



చిలుకానగర్‌లో..



ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో



దమ్మాయిగూడ ఛైర్మన్ వసుపతి ప్రణీత ఇతరులు



బోడుప్పల్ మేయర్ ఇతరులు



పీర్జాదిగూడ మేయర్, ఇతరులు

అబ్బుర పరిచే.. ఆలోచనలు పెంచే

యువజనోత్సవంలో విద్యార్థినుల ప్రతిభ

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యువజనోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వివిధ రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివివేకానందుడి చిత్ర పటానికి పూలమాల వేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన 630 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



తెలంగాణ మైనార్టీ గురుకుల కుషాయిగూడ విద్యార్థినుల నృత్యం



అందమైన వస్తువులను తయారు చేసిన కుషాయిగూడ విద్యార్థినులు



అంకిరెడ్డిపల్లి విద్యార్థినులు బంజారాలుగా..



కొర్రెముల జడ్పీ విద్యార్థినులు పల్లెపడుచులుగా..



ఉప్పల్‌లోని ఆక్సీలియమ్ నవజీవన్ అనాథాశ్రమం చిన్నారులు



పాత వస్త్రంతో కళాత్మక దుస్తులు తయారు చేసిన కొంపల్లి విద్యార్థినులు

రక్తహీనతను అధిగమించేందుకు ప్రణాళిక

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం ఉన్న పద్ధతులను మరింత బలోపేతానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి ఎనీమియా ముక్త్ భారత్ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు కొత్తవ్యూహాలను ప్రవేశపెట్టడానికి సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలలు మెదడువాపు వ్యాధి నివారణ టీకాను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.రఘునాథస్వామి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి ఎం.సరస్వతి, డీఈవో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా,డీఎంహెచ్‌వో

బస్సు ఎలా ఎక్కేది..?

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్ దూరదర్శన్ కేంద్రం ఆర్టీసీ బస్టాపులో సెవన్ సీటర్ ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. బస్సులు రోడ్డు మధ్యలో ఆపేస్తున్నారు. ప్రయాణికులు పరుగెత్తి బస్సును ఎక్కాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కాస్త దృష్టి సారించరూ...!



రామంతాపూర్ బస్టాప్‌లో ఆటోల పార్కింగ్

వైద్యులు లేని బస్తీ దవాఖానాలు



నర్సుతో మాట్లాడుతున్న భాజపా నాయకులు

ఉప్పల్, న్యూస్‌టుడే: చిలుకానగర్ డివిజన్‌లోని రెండు బస్తీదవాఖానాల్లో వైద్యులు లేరని శుక్రవారం డివిజన్ భాజపా అధ్యక్షుడు గోనె శ్రీకాంత్ ఆరోపించారు. ప్రతి సెంటర్‌లో డాక్టర్, నర్సు, సిబ్బంది ఉండాలన్నారు. చిలుకానగర్‌లో నర్సు, బీరప్పగడ్డలో సిబ్బంది ఒకరు మాత్రమే ఉన్నారన్నారు. బస్తీదవాఖానాలలో నర్సు, సిబ్బందితో వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. భాజపా నాయకులు బస్తీదవాఖానాలను పరిశీలించారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లు

కార్ఖానా: ట్రాఫిక్ సిగ్నళ్లతో పాటు దుకాణాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు ట్రాన్స్‌జెండర్లతో పాటు మరో నలుగురు నకిలీ ట్రాన్స్‌జెండర్లను కార్ఖానా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం. . బాలాజీనగర్‌కు చెందిన నల్లన్నగారి జయశ్రీ అలియాస్ రమేష్(29), ఏటప్పగారి మనీషా అలియాస్ మల్లేష్(25) లింగమార్పిడి చేసుకొని ట్రాన్స్‌జెండర్లుగా మారారు. కోయల దిన్న అలియాస్ సురేష్(35), షేక్ ముంతాజ్ అలియాస్ బాషా(39), షేక్ ఆషు అలియాస్ షఫి(45), షేక్ సమీరా అలియాస్ ఇషాక్(29)లు ట్రాన్స్‌జెండర్లుగా చలామణి అవుతున్నారు. వీరంతా కార్ఖానా ఠాణా పరిధిలోని సిగ్నళ్ల వద్ద వాహనాదారులతో పాటు వ్యాపార సముదాయాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

రూ.30.55 కోట్లు.. 173 పనులు



మాట్లాడుతున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర పాలక కార్యాలయంలో జరిగిన సర్వసభ్యసమావేశంలో 173 పనులకు రూ. 30. 55కోట్ల కేటాయింపులు చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. నగరంలోని వివిధ డివిజన్లలో ప్రజా పనులకు ప్రాధాన్యం ఇస్తూ నిధుల కేటాయింపులు చేసినట్టు కమిషనర్ రామలింగం చెప్పారు.

● తమకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని భాజపా కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి నిరసన తెలిపారు. ● భారాస కార్పొరేటర్లు కూడా అసంతృప్తిని వ్యక్తం చేశారు. ● డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అమ్మోరిని కొలిచేద్దామా..!

ఉప్పల్, హబ్సిగూడ, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాలకు దుర్గామాత విగ్రహాలు విక్రయానికి సిద్ధమయ్యాయి. వివిధ రూపాల్లో తయారుచేసిన అమ్మవారి ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఉప్పల్ భగయాత్‌లో పలు రకాల ఆకృతుల్లో ప్రతిమలను రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులతో సందడి మొదలైంది.









దోమ తెరల అందజేత

మేడిపల్లి (బోడుప్పల్):మేడిపల్లి మాత్రు అభయ ఫౌండేషన్ అనాథాశ్రమ విద్యార్థులకు పీర్జాదిగూడ లయన్స్ క్లబ్ ప్రతినిధులు శుక్రవారం దోమ తెరలను వితరణ చేశారు. పీర్జాదిగూడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీకే నాదంగౌడ్, ప్రధానకార్యదర్శి బాలరాజ్‌గౌడ్ , ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

కాప్రా: కాప్రా డివిజన్‌లోని మెహర్ బాబా కాలనీలో శుక్రవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కార్పొరేటర్ స్వర్ణరాజ్ పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాసాని వీరేష్

నిజాంపేట, న్యూస్‌టుడే: కబడ్డీ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా కాసాని వీరేష్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. బాచుపల్లిలోని కబడ్డీ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఓటింగ్ పద్ధతిన ఎన్నికలు జరిగాయి. జిల్లాలోని 15 మండలాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు హాజరై ఓటింగ్‌లో పాల్గొన్నారు. అధ్యక్షుడిగా వీరేష్‌తోపాటు ఉపాధ్యక్షుడిగా తిరుమల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రహాస్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.రమాదేవి, కోశాధికారిగా జి.వి.సుబ్రమణ్యం, సభ్యులుగా జాహింగీర్, కృష్ణవినీల ఎన్నికయ్యారు

సమాజ మార్పులో వయోవృద్ధులు కీలకం

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: వయోవృద్ధులు సమాజ మార్పుల్లో కీలకం కావాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నేపథ్యంలో ఏఎస్ రావునగర్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఇందులో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణా రెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా వయోవృద్ధుల కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఇతరులు

సాంకేతిక రంగంలో మార్పు తెలుసుకోవాలి



కరదీపికను విడుదల చేస్తున్న అశోక్, ప్రభాకర్, తదితరులు

మేడ్చల్, న్యూస్‌టుడే: సాంకేతికత రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం విద్యార్థులు తెలుసుకునే ప్రయత్నం చేయాలని మల్లారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ అశోక్ సూచించారు. 'ఇంజినీరింగ్, అడ్వాన్స్‌మెంట్ టెక్నాలజీ' అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి సదస్సును శుక్రవారం కళాశాలలో ప్రారంభించారు. వివిధ దేశాల నుంచి 120 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో చెన్నయ్ ఓ.ఎస్.ఐ.ఇ.టి విశ్వవిద్యాలయం కార్యదర్శి ప్రభాకర్, వీఐటీ వెల్లూర్ ఆచార్య విజయవాజన్, కన్వీనర్ వివేకానంద, వైస్ ప్రిన్సిపల్ టి.వి.రెడ్డి పాల్గొన్నారు.

కప్పితే ఎలా..!



హబ్సిగూడ, న్యూస్‌టుడే: హబ్సిగూడ ఎన్‌జీఆర్ఐ మెట్రోస్టేషన్ వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని చెత్తడబ్బాలను ఏర్పాటు చేశారు. ఆ డబ్బాలపై కవర్లను వేసి కప్పి ఉంచారు. అవి ఎగిరిపోకుండా బరువును పెట్టారు. చెత్తను ఎక్కడ వేయాలో తెలియక బాటసారులు కింద పడేస్తున్నారు. మళ్లీ యథారీతిలో అక్కడంతా అపరిశుభ్రత నెలకొంటోంది. అయినా సిబ్బంది పట్టించుకోవడం లేదు.

అటవీ అకాడమీలో క్రీడాపోటీలు ప్రారంభం

దుండిగల్,న్యూస్‌టుడే: దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో చార్మినార్ సర్కిల్, రీజనల్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి సువర్ణ క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు దీర్ఘకాలిక రుణాలు

కీసర: కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మండలంలోని రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామని అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గొర్రెల పెంపకం, మైనర్ ఇరిగేషన్‌కు రుణాలు కావాల్సిన రైతులు కీసరలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కాప్రా: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు : ఓల్డ్ మౌలాలి, గోపాల్‌నగర్, బాగ్ ఈ హైదరీ, హనుమాన్‌నగర్, రావునగర్, ఆండాళ్‌నగర్, పార్ట్ వసంత్‌విహార్ కాలనీ, ఎస్పీనగర్, మహాలక్ష్మీ దేవాలయం, మీర్‌పేట్, తిరుమలానగర్, న్యూశ్రీనగర్ కాలనీ

నాచారం: మల్లాపూర్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. . న్యూనర్సింహనగర్, మీర్‌పేట్, హనుమాన్ ఆలయ పరిసరాలు

శామీర్‌పేట: తుర్కపల్లి ఉప కేంద్రం పరిధిలో మరమ్మతులతో శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు తుర్కపల్లి గ్రామంతోపాటు వ్యాపార వాణిజ్య, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

తడి పొడి చెత్త బుట్టల పంపిణీ

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్తను వేరుచేసి వేసేందుకు చెత్తబుట్టలను శుక్రవారం ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు.

రోడ్డు బాగు చేయించరూ

కాప్రా: న్యూ వాసవి శివ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి కలిసి కాలనీలో రోడ్లు బాగు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తానని శ్రీదేవి చెప్పారు.

వైద్య, రక్తదాన శిబిరం

కాప్రా: చర్లపల్లి డివిజన్ చక్రీపురంలో శుక్రవారం కాప్రా ఏఎస్‌రావునగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 82 మంది రోగులకు మందులను అందజేశారు. 40 మంది రక్తదానం చేశారు.

అప్పుడప్పుడూ.. అక్కడక్కడ..!

దోమల నివారణకు కంటితుడుపు చర్యలు...

మేడ్చల్ రూరల్, న్యూస్‌టుడే: వర్షాలు, వరదల ప్రభావంతో మేడ్చల్ మునిసిపాలిటీలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. దోమల వ్యాప్తి పెరిగింది. జ్వర బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సివిల్ ఆస్పత్రుల్లో ప్రతి రోజు సగటున 50నుంచి 120మంది, బస్తీ దవాఖానాల్లో 30 నుంచి50మంది చికిత్స చేయించుకుంటున్నారు. అయినా దోమల నివారణకు తీసుకునే చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఖర్చుల మోత...తగ్గని రోద

ఫాగింగ్ యంత్రంలో పెట్రోలు, డీజిల్ వినియోగం అనివార్యం. మునిసిపల్ సాధారణ నిధుల నుంచి ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా ఆచరణలో దానికి తగిన ప్రయోజనం కనిపించడం లేదు.



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మేడ్చల్‌లో వార్డులు	: 23
కాలనీలు	: 50
జనాభా	: లక్ష
ఫాగింగ్ యంత్రాలు	: 7
పని చేస్తున్నవి	: 3
చేయనివి	: 2
కొత్తగా కొనుగోలు చేసినవి:	2
రోజూ ఖర్చు చేస్తున్నది:	రూ.2-3వేలు

● రోజూ సాయంత్రం కనీసం నాలుగు నుంచి ఆరు వార్డుల చొప్పున ఫాగింగ్ చేయాలి.

● కేవలం ప్రాబల్యం ఉన్న కౌన్సిలర్ల వార్డుల్లో, ఇతర ప్రాంతాల్లో మాత్రం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

● వర్షం కురిసే రోజులు తప్ప ప్రతి రోజు ఫాగింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

● వీధులు శుభ్రం చేయడంతో పాటు ప్రతి రోజూ సాయంత్రం సమయాల్లో వీధుల వెంట ఫాగింగ్ చేయాలి. అప్పుడప్పుడు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

శుక్రవారం డ్రైడేగా నిర్వహిస్తున్నాం:

నాగిరెడ్డి, కమిషనరు మేడ్చల్

పరిశుభ్రత, దోమల నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహిస్తున్నాం. నీటి కుంటల్లో దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. కాలనీల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం.

పరిశ్రమలో పని చేయనని బాలుడి ఆత్మహత్య

మేడ్చల్, న్యూస్‌టుడే: కంపెనీలో పని చేయడం ఇష్టం లేక ఓ బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన బాలుడు (15) తన అన్నతో పాటు 15 రోజుల క్రితం జీవనోపాధికి వచ్చారు. మేడ్చల్ మండలం రాజబొల్లారం తండాలో ఇద్దరు ఒకే ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. అదే గ్రామంలో ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అక్కడ పని చేయడం ఇష్టం లేదని పలుమార్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. గురువారం రాత్రి అన్న నిద్రపోయాక గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుత్తేదారుతో పాటు కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చెన్నాపురం చెరువులో మహిళ మృతదేహం గుర్తింపు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ చెన్నాపురం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. శుక్రవారం 40ఏళ్లలోపున్న మహిళ చనిపోయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నలుపు రంగు జాకెట్టు, మెడలో పుస్తెల తాడుతో పాటు పూల రంగు చీర ధరించినట్లు తెలిపారు.